www.andhrajyothy.com
పేజీలు: 14
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 66
సంచిక (Issue) : 112

బుధవారం 6-8-2025

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం, తిథి: ద్వాదశి మ.2.09 తదుపరి త్రయోదశి, నక్షత్రం: మూల మ.1.00 తదుపరి పూర్వాషాఢ, వర్జ్యం: ఉ.11.17-1.00, రా.11.00-12.40, దుర్ముహూర్తం: ఉ.11.55-12.46, అమృతఘడియలు: ఉ.6.10-7.52, రాహుకాలం: మ.12.00-1.30, సూర్యోదయం: 5.59, సూర్యాస్తమయం: 6.42

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ జిల్లా ధరాలీ గ్రామాన్ని ముంచెత్తుతున్న జలప్రళయం. బురదతో కలిసి దూసుకొచ్చిన వరద ధాటికి కొట్టుకుపోతున్న నివాసాలను చిత్రంలో చూడొచ్చు!

ఉత్తరాఖండ్‌లో జలప్రళయం

- నలుగురి మృతి.. 70 మందికి పైగా గల్లంతు
- గల్లంతైనవారిలో 11 మంది సైనికులు
- 2 గంటల వ్యవధిలో రెండుసార్లు మేఘ విస్ఫోటం
- కొండలపై నుంచి ముంచెత్తిన మెరుపు వరద
- కన్నుమూసి తెరిచేంతలో పెద్ద పెద్ద భవనాలను సైతం పెకిలిస్తూ.. విధ్వంసం సృష్టించిన వెల్లువ
- పూర్తిగా బురదలో కూరుకున్న ధరాలీ గ్రామం
- పది నిమిషాల వ్యవధిలోనే రంగంలోకి సైన్యం
- స్థానిక యంత్రాంగంతో కలిసి సహాయక చర్యలు
- బాధితులను అన్నివిధాలా ఆదుకుంటాం: ప్రధాని
- మృతదేహాల గుర్తింపునకు కెడవర్ జాగిలాలు
- ఢిల్లీ నుంచి విమానంలో తరలించేందుకు సిద్ధం

న్యూఢిల్లీ, ఆగస్టు 5: ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ జిల్లా ధరాలీ గ్రామాన్ని జలప్రళయం తుడిచిపెట్టింది. మంగళవారం మధ్యాహ్నం 1.45 గంటల సమయంలో.. క్లౌడ్ బరస్ట్ (మేఘ విస్ఫోటం- ఒకేచోట కుండపోతగా వర్షం కురవడం) దెబ్బకు ప్రళయవేగంతో దూసుకొచ్చిన గంగమ్మ (ఖీర్ గంగానది).. దారిలోని చెట్టూచేమ, బురదను కలుపుకొని కిందికి ప్రవహించింది! కొండచరియలను

మిగతా 2వ పేజీలో...

అబద్ధాల రాతలతో అతుకుల బొంత!



తీగల విజయేందర్ రెడ్డి ఫామ్‌హౌస్‌లో రూ.11 కోట్లు చంద్రబాబే పెట్టించారంటూ జగన్ పత్రిక ప్రచురించిన కథనం

జగన్ రోత పత్రిక బురద కథలు

- రూ.11 కోట్ల నగదు చంద్రబాబే పెట్టించారట
- తీగల విజయేందర్ రెడ్డి టీడీపీ మనిషేనట!
- ఎక్కడో 'ఆంధ్రజ్యోతి' ఎండీతో దిగిన ఫొటో చూపించి... 'ఇద్దరూ దగ్గరే' అని చిత్రాలు
- మోకాలికీ బోడిగుండుకూ ముడిపెట్టి వెర్రితనం
- సొంత పాఠకుల చెవిలో జగన్ పూలు
- చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో కలిసి శ్రీలంక వెళ్తుండగా వెంకటేశ్‌నాయుడు అరెస్టు
- ఇద్దర్నీ ఒకేసారి బెంగళూరులో పట్టుకున్న సిట్
- అయినా.. సంబంధం లేదంటారా?



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

తాచెడ్డ కోతి వనమెల్లా చెరిచిందని సామెత! అలాగే... వైఎస్ జగన్మోహన్ రెడ్డి తనకు అంటిన బురదను అందరికీ పూయాలని ఆరాట పడుతున్నారు. అక్రమాలు, అవినీతి సొమ్ముకు పుట్టిన తన రోత పత్రికను ఇందుకోసం వాడుతున్నారు. లిక్కర్ స్కామ్‌లో అన్ని వేళ్లూ తాడేపల్లి ప్యాలెస్ వైపు చూపిస్తుండటం, 'సిట్' సాంకేతిక ఆధారాలతో సహా అరెస్టులు చేస్తుండటంతో దిక్కుతోచక పిచ్చి కథలు సృష్టిస్తున్నారు. ఇందులో భాగంగానే.. మంగళవారం సంచికలో 'సూత్రధారి చంద్రబాబే' అంటూ ఒక కథనాన్ని వండి వార్చారు. ఇటీవల సిట్ అధికారులు శంషాబాద్ మండలం కాచారం గ్రామ పరిధిలోని ఫామ్‌హౌస్‌లో రూ.11 కోట్లు స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ కేసులో అరెస్టయిన నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు... తీగల విజయేందర్ రెడ్డి కుటుంబానికి చెందిన వర్ధమాన్ ఇంజనీరింగ్ కాలేజీ

మిగతా 14వ పేజీలో...

రాజమండ్రి జైలులో వైసీపీ రాజ్యాంగం!

- మిథున్‌రెడ్డికి ఒక్క రోజే 2 ములాఖత్‌లు.. తొలుత పెద్దిరెడ్డి, ఎమ్మెల్సీ తలశిల 14
- తర్వాత జక్కంపూడి రాజా, లాయర్ హుస్సేన్.. కోరిందే తడవుగా సౌకర్యాలు
- వైసీపీ ఎంపీకి జైలు అధికారుల రాచమర్యాదలు
- నాడు చంద్రబాబుతో ములాఖత్‌లకు ముప్పుతిప్పలు
- టీడీపీ నేతలను సమీపానికే రానివ్వని అధికారులు
- ఇప్పుడు జైలు పరిసరాల్లో గుంపులుగా వైసీపీ కార్యకర్తలు



జైలు గేటు ఎదుట వైసీపీ నేతల గుంపు

అదే కుట్ర.. అదే కుతంత్రం!

- వివేకా హత్య తరహాలో.. మద్యం స్కామ్‌పైనా తప్పుడు ప్రచారం
- నాడు వివేకా.. నేడు వెంకటేశ్‌నాయుడు
- రోజుకో అబద్ధంతో చంద్రబాబుపై నిందను నెట్టే యత్నం
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి ఫైర్



చేనేతకు చేయూత

- హ్యాండ్లూమ్ వస్త్రాలపై ప్రభుత్వమే జీఎస్టీ భరించాలని నిర్ణయం 13
- మగ్గాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్
- పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్లు
- రేపటి నుంచి అమలుకు సీఎం ఆదేశం

ఇకపై భూ అభివృద్ధి ఫీజు! 13


భూ వినియోగ మార్పిడిపై 4% వసూలు

- నాలా ఫీజుకు స్వస్తి.. చట్టం రద్దుపై ఆర్డినెన్స్
- మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం
- నేడు క్యాబినెట్ భేటీలో చర్చించి నిర్ణయం
- నిషేధ జాబితాలోని ప్రైవేట్ భూములకు విముక్తి

3 ఎంపీటీసీ, 2 సర్పంచి స్థానాలు

ఏకగ్రీవం

- అన్నీ టీడీపీ బలపరిచిన వారికే
- జగన్ ఇలాకాలో 'ఉప' పోరు షురూ
- పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీలకు 12న ఎన్నికలు 12




మార్గదర్శుల ఎంపిక స్వచ్ఛందమే

ఎవరినీ బలవంతం చేయొద్దు: సీఎం

- వీరి ఎంపికలో వ్యతిరేకత రాకూడదు
- 2029 నాటికి పీ-4 లక్ష్యం సాకారం
- ఈ కార్యక్రమం దేశానికే ఆదర్శం
- అవనిగడ్డ పారిశుధ్య కార్మికురాలే స్ఫూర్తి
- ఆర్థిక అసమానతలు మరింత తగ్గాలి
- ఇవి పెరగడం సమాజానికి మంచిది కాదు
- ప్రజలే ఆస్తిగా జీరో పావర్టీ మిషన్ అమలు
- నేనూ 250 కుటుంబాలను దత్తత తీసుకున్నా
- ప్రజాప్రతినిధులతో సీఎం వీడియో కాన్ఫరెన్స్

అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేపట్టిన పీ-4 కార్యక్రమంలో భాగంగా మార్గదర్శుల ఎంపిక పూర్తి స్వచ్ఛందంగానే జరుగుతోందని సీఎం చంద్రబాబు అన్నారు. ఇందులో ఎలాంటి బలవంతం లేదని తెలిపారు. మార్గదర్శుల ఎంపికలో ఎక్కడా వ్యతిరేకత రాకూడదని సీఎం ఆదేశించారు. ఎవరినీ బలవంతం చేయొద్దని, మానవత్వం ఉండేవారు ఇందులో చేరతారని పేర్కొన్నారు. సచివాలయంలో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, పీ-4 లక్ష్యం 2029 నాటికి సాకారమవుతుందని, ఇది దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. పేదరిక నిర్మూలనలో భాగంగానే ఈ కార్యక్రమాన్ని చేపట్టామని, బంగారు కుటుంబాలకు మెరుగైన జీవన ప్రమాణాలే లక్ష్యమని తెలిపారు. సమాజానికి తిరిగి ఇవ్వాలన్నదే ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. మార్గదర్శుల నుంచి

మిగతా 13వ పేజీలో...



వివేకా హత్య కేసులో దర్యాప్తు పూర్తయింది!



- సుప్రీంకోర్టు ఆదేశిస్తే తదుపరి విచారణ: సీబీఐ
- వేరే కోర్టులో ఉన్న సునీతారెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది లూథ్రా
- మరో రోజు విచారిస్తామన్న ధర్మాసనం
- తదుపరి విచారణ 19కి వాయిదా 13



2

సత్యపాల్ మాలిక్ కన్నుమూత

- జమ్మూకశ్మీర్‌తో పాటు పలు రాష్ట్రాల గవర్నర్‌గా సేవలు
- పుల్వామా ఉగ్రదాడి, ఆర్టికల్ 370 రద్దుపై కేంద్రం మీద ఘాటు విమర్శలు
- అవినీతికి పాల్పడ్డారంటూ సత్యపాల్‌పై సీబీఐ కేసు.. ఇంట్లో సోదాలు
- ఈ నేపథ్యంలోనే అస్వస్థత.. మృతి

వీళ్లా.. భావి టీచర్లు!?



- టెట్ లేకుండానే డీఎస్సీ రాశారు.. 2 వేల మంది అనర్హులుగా గుర్తింపు
- టెట్‌లో వచ్చిన మార్కులు తప్పుగా నమోదు చేసినవారు 35 వేల మంది
- టెట్ డేటాబేస్ ఆధారంగా వడపోత.. ఇంకా తేలాల్సినవారు 9 వేల మంది
- క్షుణ్నంగా పరిశీలిస్తున్న విద్యాశాఖ.. 2-3 రోజుల్లో తుది మార్కులు
- వాటిపైనా అభ్యంతరాలకు అవకాశం.. పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు 12

అంబులెన్స్ ఢీకొని ఇద్దరు మృతి 3

ఏలూరులో రైతు, రైతు కూలీ విషాదాంతం

ప్రాణం తీసిన పెన్సిల్!

- ఇద్దరు చిన్నారుల మధ్య బడిలో గొడవ
- ఓ విద్యార్థి తల్లిదండ్రులపై మరొకరి దాడి
- తీవ్ర గాయాలతో విద్యార్థి తండ్రి మృతి
- అనంతపురం జిల్లాలో విషాద ఘటన 12

కూల్‌డ్రింక్స్‌తో పెనుముప్పు!

- డైట్ సోడాతోనూ అంతే నష్టం 2
- స్ట్రోక్, డిమెన్షియా ప్రమాదం మూడింతలు

మరో 24 గంటల్లో..

భారత్‌పై భారీగా సుంకాలు

రష్యా నుంచి చమురు కొనుగోళ్లే కారణం



- భారత్ మంచి వాణిజ్య భాగస్వామి కాదు
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలు
- నచ్చిన వాణిజ్య భాగస్వామిని ఎంచుకునే హక్కు భారత్‌కు ఉంది: రష్యా
- ట్రంప్‌తో 'దోస్త్ దోస్త్ నా రహా'!.. ప్రధాని మోదీపై కాంగ్రెస్ విసుర్లు
- మాస్కోలో పర్యటించనున్న అజిత్ దోవల్

భారత్‌ను దారికి తెచ్చుకుని.. చమురు అమ్మాలన్నదే ట్రంప్ ప్లాన్!

న్యూయార్క్, ఆగస్టు 5: రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై భారత్ వెనక్కి తగ్గని నేపథ్యంలో మరింత భారీగా సుంకాలు విధిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. మంగళవారం న్యూయార్క్‌లో ఓ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ అంశంపై మాట్లాడారు. "భారత్ అత్యధిక సుంకాలు వసూలు చేసే దేశం. అన్నిదేశాల కంటే కూడా ఎక్కువ. భారత్ మంచి

మిగతా 2వ పేజీలో...





నాట్లేసిన కలెక్టర్

విజయవాడ సమీపంలోని గుంటుపల్లి గ్రామంలో చేలోకి దిగి నాట్లు వేస్తున్న ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మిశ

నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో

మార్చి తర్వాత భారీగా పరిశ్రమలు

- సీఐఎస్ఎఫ్ సంఖ్య 2.20 లక్షలకు పెంపు

న్యూఢిల్లీ, ఆగస్టు 5: సీఐఎస్ఎఫ్ (సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్) సిబ్బంది సంఖ్యను మరో 20 వేల మేర పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం 2 లక్షలుగా ఉన్న సిబ్బంది సంఖ్యను 2.20 లక్షలకు పెంచనున్నట్లు హోంశాఖ ఇటీవల ఓ ప్రకటనలో తెలిపింది. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో 2026 మార్చి తర్వాత రాబోయే పరిశ్రమలకు, విమానాశ్రయాలు, పోర్టులు వంటి కీలక రంగాలకు భద్రత పెంచే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. ప్రైవేటు సంస్థల్లో, సులువైన విధులు ఉండే చోట పనిచేస్తున్న సిబ్బందిని క్రమం తప్పకుండా వేరే ప్రాంతాలకు బదిలీ చేయాలని కూడా హోంశాఖ ఆదేశించింది. దీనివల్ల సంస్థలో వృత్తి నైపుణ్యం, పనిలో చురుకుదనం పెరుగుతాయని అధికారులు అంటున్నారు. కాగా, 2026 మార్చి నాటికి నక్సలిజాన్ని అంతంచేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఖనిజ వనరులు అధికంగా లభించే ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లో మావోయిస్టులను అంతం చేసి అక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కేంద్రం యోచిస్తున్నట్లు సమాచారం.

ధర్మస్థలలో 100 ఎముకలు లభ్యం

బెంగళూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని ధర్మస్థలలో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఆధ్వర్యంలో జరుపుతున్న తవ్వకాలలో ఇప్పటి వరకు 100 ఎముకలు లభ్యమయ్యాయి. మరో 3 అస్థిపంజరాలు లభ్యమయ్యాయనే ప్రచారాన్ని సిట్ తోసిపుచ్చింది. ఫిర్యాదుదారు చూపించిన 13 ప్రదేశాలకుగాను ఇప్పటి వరకు 12 ప్రదేశాల్లో తవ్వకాలు జరిపారు. బుధవారం 13వ ప్రదేశంలో తవ్వకాలు చేపట్టనున్నారు. అవసరమైతే మరిన్ని ప్రాంతాల్లోనూ తవ్వకాలకు సిద్ధంగా ఉన్నామని సిట్ వర్గాలు తెలిపాయి. 6వ ప్రదేశంలోనూ, 11వ ప్రదేశానికి 100 మీటర్ల దూరంలోని 11-ఏ ప్రదేశంలోనూ ఎముకలు లభించాయి. ఆ ఎముకలను ఫోరెన్సిక్ నిపుణులు పరీక్షిస్తున్నారు. 11వ ప్రదేశంలో కాకుండా బంగ్లగుడ్డపై తవ్వకాలు జరపాలని ఫిర్యాదుదారు కోరిన నేపథ్యంలో సోమవారం అక్కడ(11-ఏ) జరిపిన తవ్వకాలలో ఒక అస్థిపంజరం లభించింది. అయితే, 11-ఏ ప్రదేశంలో కనీసం మూడు అస్థిపంజరాలు లభించాయని బాధితుల తరఫు న్యాయవాదులు తెలిపారు. వాటిలో ఒకటి మహిళదని, అక్కడ చీర కూడా లభ్యమైందని చెప్పారు. అయితే, దీన్ని పోలీసులు తోసిపుచ్చారు.

ఈడీ విచారణకు అనిల్ అంబానీ హాజరు

న్యూఢిల్లీ, ఆగస్టు 5: మనీలాండరింగ్ కేసులో విచారణ నిమిత్తం రిలయన్స్ గ్రూపు ఛైర్మన్ అనిల్ అంబానీ (66) మంగళవారం ఈడీ అధికారుల ఎదుట హాజరయ్యారు. ఉదయం 10.50 నిమిషాలకు ఆయన విద్యుత్తు వాహనంలో ఈడీ కార్యాలయానికి వచ్చారు. వివిధ బ్యాంకుల నుంచి తన గ్రూపులోని కొన్ని కంపెనీల పేరున తీసుకున్న రూ.17వేల కోట్ల రుణాలను అదే గ్రూపులోని మరికొన్ని కంపెనీలకు మళ్లించారంటూ నగదు అక్రమ చలామణి నిరోధక చట్టం (పీఎల్ఎంఏ) చట్టం కింద ఈడీ కేసు నమోదు చేసింది. విచారణలో భాగంగా ఈడీ గత నెల 24న ముంబయిలో అనిల్ అంబానీకి చెందిన 50 కంపెనీల్లో సోదాలు చేసింది.

మద్యం తాగించి.. భర్తను చంపించిన భార్య

- కరీంనగర్‌లో ఘటన.. భార్య, ఆమె ప్రియుడు, మరో వ్యక్తి అరెస్టు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వివాహేతర బంధం ఒక భర్త ప్రాణాలను హరించింది. తెలంగాణలోని కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఈ ఘటన జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన ఐలవేని సంపత్(45), రమాదేవి భార్యాభర్తలు. వీరికి ఇరవైఏళ్ల వయసు నిండిన కుమారుడు, కుమార్తె ఉన్నారు. సంపత్ కరీంనగర్‌లోని గ్రంథాలయంలో స్వీపర్‌గా పనిచేస్తున్నాడు. రమాదేవి సర్వపిండి విక్రయిస్తోంది. ఆమె వద్ద కరీంనగర్‌కే చెందిన కర్రె రాజయ్య (50) తరచూ సర్వపిండి కొనేవాడు. ఇద్దరి మధ్య ఈ పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసింది. అప్పటికే భర్త మద్యానికి పూర్తిగా బానిసై తనను శారీరకంగా హింసిస్తుండటం, మరో వ్యక్తితో తనకు అనుబంధం ఏర్పడటంతో సంపత్‌ను అడ్డు తొలగించుకోవాలని రమాదేవి పథకం వేసింది. ప్రియుడు రాజయ్య, తన దూరపు బంధువు, కరీంనగర్ రూరల్ ఖాదర్‌గూడేనికి చెందిన కీసరి శ్రీనివాస్ (35)తో కలిసి భర్త హత్యకు పథకం వేసింది. ఎవరి చెవుల్లోనైనా పురుగుల మందు పోస్తే ఆ వ్యక్తి చనిపోతాడనే విషయాన్ని గతంలో యూట్యూబ్ ద్వారా తెలుసుకున్న రమాదేవి అదే పద్ధతిలో భర్తను చంపాలని రాజయ్య, శ్రీనివాస్‌కు చెప్పింది. ఆ ఇద్దరు కలిసి పార్టీ చేసుకుందాం అంటూ జూలై 29న సంపత్‌కు ఆఫర్ చేశారు. అదే రోజు బొమ్మకల్ ఫ్లైఓవర్ వద్దకు రావాలని వారు చెప్పడంతో సంపత్ అక్కడికి వెళ్లాడు. అక్కడ ముగ్గురు కలిసి మద్యం తాగారు. మత్తు ఎక్కువై సంపత్ తూలుతూ కింద పడిపోగానే.. రాజయ్య, శ్రీనివాస్ కలిసి అతడి చెవుల్లో అప్పటికే వెంటతెచ్చుకున్న గడ్డిమందును పోశారు. కొద్దిసేపటికి సంపత్ చనిపోయాడు. ఆ మర్నాడు.. భర్త కనిపించడం లేదంటూ రమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంపత్ ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నట్లుగా రమాదేవి, రాజయ్య, శ్రీనివాస్ నటించారు. ఆగస్టు 1న మృతదేహాన్ని గుర్తించినట్లు వారే పోలీసులకు సమాచారమిచ్చారు. రమాదేవి కాల్‌డేటా, ఫోన్ లొకేషన్, సీసీ ఫుటేజీ ఆధారంగా విచారణ జరిపి.. ఆమెను, రాజయ్య, శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకొని ప్రశ్నించడంతో తామే హత్యచేసినట్లు అంగీకరించారు. ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.


కూల్‌డ్రింక్స్‌తో డిమెన్షియా ముప్పు!

డైట్ సోడాతోనూ అంతే నష్టం



న్యూఢిల్లీ, ఆగస్టు 5: రోజూ శీతల పానీయాలు తాగడం వల్ల పక్షవాతం, డిమెన్షియా వచ్చే అవకాశం ముడింతలు పెరుగుతుందని, డైట్ సోడాతోనూ అంతే ప్రమాదమని తాజా అధ్యయనాలు వెల్లడించాయి. అమెరికన్ హార్ట్ అసోసియేషన్ మాస పత్రికలో ఈ అధ్యయన నివేదిక ప్రచురితమయింది. అధ్యయనకారులు 45 ఏళ్లు దాటిన 2,800 మందిని పదేళ్లపాటు పరిశీలించారు. వారి పరిశోధనలో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెల్లడయ్యాయి. "కూల్ డ్రింక్ తాగిన ఒక గంటలో మన శరీరంలో 10 టీ స్పూన్ల షుగర్ డంప్ అవుతుంది. 20 నిమిషాల్లో రక్తంలో షుగర్ శాతం పెరుగుతుంది. భారీగా పెరిగిన ఇన్సులిన్‌కు అనుగుణంగా మన శరీరం స్పందిస్తుంది. సుమారు 40 నిమిషాలకు కెఫిన్ మన రక్తంలోకి పూర్తిగా ఇంకుతుంది. ఇది మన రక్తపోటును (బీపీ) పెంచుతుంది. లివర్‌ను ట్రిగ్గర్ చేయడంతో రక్తంలోకి మరింత షుగర్ విడుదల అవుతుంది. బ్రెయిన్‌లోని సంతోష కేంద్రాలను డొపమైన్ ఉత్తేజపరుస్తుంది. 60 నిమిషాల తరువాత కాల్షియం, మరికొన్ని కీలక లవణాలతో కలసి ఫాస్ఫారిక్ యాసిడ్ మన పేగుల్లో అట్టకడుతుంది. మూత్రవిసర్జన అవసరాన్ని కెఫిన్ ప్రేరేపించడంతో అవి మూత్రం ద్వారా బయటకు వెళ్లడం ప్రారంభమవుతుంది" అని ఆ అధ్యయనం వివరించింది. "డైట్ సోడాలు తాగేవాళ్లకు వాటిలోని కృత్రిమ స్వీట్నర్లతో పక్షవాతం, డిమెన్షియా వచ్చే ప్రమాదం మూడింతలు పెరుగుతుంది" అని తెలిపింది. శీతల పానీయాలు/డైట్ సోడాలతో నేరుగా ప్రమాదం జరుగుతుందని చెప్పలేం కానీ, ప్రమాద ఉత్ప్రేరకాలుగా పనిచేస్తాయని మాత్రం చెప్పవచ్చని అమెరికన్ హార్ట్ అసోసియేషన్ మాస పత్రికలో ప్రచురితమైన వ్యాసం పేర్కొంది.

ఉత్తరాఖండ్‌లో జలప్రళయం



కొండల్లో నుంచి ఇళ్ల మీదకు దూసుకువస్తున్న వరదనీళ్లు



వరదలో చిక్కుకున్న బాధితుడిని రక్షిస్తున్న సైనికులు

(మొదటి పేజీ తరువాయి)

సైతం నుగ్గునుగ్గు చేస్తూ దూసుకొచ్చిన ఆ వెల్లువ ధాటికి గ్రామంలోని ఇళ్లు, పెద్ద పెద్ద భవనాలు పేకమేడల్లా నేలకూలాయి. గుండెలదిరేలా హోరుమనే శబ్దంతో కమ్ముకొస్తున్న జల ప్రళయం నుంచి తప్పించుకునేందుకు.. ప్రజలు ప్రాణాలు అరచేత పెట్టుకుని.. పెద్దపెట్టున ఆర్తనాదాలు చేస్తూ పరుగులు తీశారు! కానీ.. కన్నుమూసి తెరిచేంతలోనే వరద బురద వారిని ముంచెత్తిన దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి. మొదటి మేఘ విస్ఫోటం జరిగిన రెండు గంటల వ్యవధిలోనే.. అదే ప్రాంతంలోని సుఖీ పర్వతప్రాంతంపై మరో మేఘవిస్ఫోటం జరిగింది. దీంతో మరోసారి కొండలమీద నుంచి నీరు ధరాలీ గ్రామాన్ని ముంచెత్తింది. అధికారిక సమాచారం ప్రకారం ఈ విలయంలో ఇప్పటిదాకా నలుగురు మరణించగా.. 11 మంది సైనికులు సహా యాభై మందికి పైగా గల్లంతయ్యారు! అయితే.. మృతుల సంఖ్య భారీగా ఉండొచ్చని స్థానికులు చెబుతున్నారు. ప్రవాహంలో 20-25 హోటళ్లు కొట్టుకుపోయాయని రాజేశ్ పన్వర్ అనే స్థానికుడు తెలిపారు. "చూస్తూండగానే ఇళ్లు, మార్కెట్లు, హోటళ్లు తుడిచిపెట్టుకుపోయాయి. ఇలాంటి విలయాన్ని నేను ఇంతకు ముందెన్నడూ చూడలేదు" అని మరో ప్రత్యక్షసాక్షి తెలిపారు. వరదనీరు, విరిగిపడ్డ కొండచరియల కారణంగా ఆ ప్రాంతంలోని ఐదు జాతీయరహదారులు, ఏడు రాష్ట్ర రహదారులు సహా మొత్తం 163 రహదారుల్లో రాకపోకలు నిలిచిపోయాయి. కాగా.. వరద చుట్టుముట్టిన పదినిమిషాల వ్యవధిలోనే సమీపంలో ఇండియన్ ఆర్మీ రంగంలోకి దిగింది. ధరాలీకి 4-5 కిలోమీటర్ల దూరంలో ఉన్న హర్షిల్ క్యాంప్ నుంచి నుంచి 150 మంది సైనికులు అక్కడికి చేరుకుని విపత్తు స్పందన చర్యలు చేపట్టారు. ముంపులో చిక్కుకుపోయిన స్థానికులను కాపాడి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఆ తర్వాత కొద్దిసేపటికి.. ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) బృందాలు చేరుకున్నాయి. ఉత్తరాఖండ్ రాష్ట్ర విపత్తు స్పందన దళాలు, జాతీయ విపత్తు స్పందన దళాలు, ఉత్తరకాశీ జిల్లా యంత్రాంగం.. అంతా కలిపి 400 మందికి పైగానే సహాయకచర్యల్లో పాల్గొంటున్నారు. క్యాంపు దెబ్బతిని, 11 మంది సైనికులు గల్లంతైన క్లిష్టపరిస్థితుల్లోనూ మన సైనికులు ఎలాంటి ఒత్తిడికీ లోనుకాకుండా, దృఢనిశ్చయంతో సహాయకచర్యల్లో పాల్గొనడం వారి నిబద్ధతకు, ధైర్యానికి నిదర్శనం అని ఆర్మీ ఒక ప్రకటన ద్వారా తెలిపింది. మరోవైపు.. ధరాలీ ప్రాంతంలో మంగళవారం ఒక్కరోజే 21 సెం.మీ.వాన కురవడంతో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. రానున్న 2-3 రోజుల్లో భారీ వర్షాలు కురిసే ... హెచ్చరించింది. దీంతో స్థానికులంతా బిక్కుబిక్కుమంటున్నారు. వర్షాలు, వరదల ముప్పు నేపథ్యంలో.. డెహ్రాడూన్, హరిద్వార్ సహా ఉత్తరాఖండ్‌లోని పలు జిల్లాల్లో పాఠశాలల మూసివేతకు అధికారులు ఆదేశాలిచ్చారు. ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో జూన్ నుంచి సెప్టెంబర్ దాకా భారీ వర్షాలు సహజమేగానీ.. ఇటీవలికాలంలో కొండలను నాశనం చేసి పెద్దఎత్తున కట్టడాలు నిర్మించడంతో పర్యావరణం దెబ్బతింటోందని, దాని ఫలితమే ఫ్లాష్ ఫ్లడ్స్ సంఖ్య, తీవ్రత పెరుగుతోందని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు.

గంగోత్రికి దగ్గర్లోనే..

చార్‌ధామ్ యాత్రలో భాగంగా.. గంగానది పుట్టిన చోటు అయిన గంగోత్రికి కేవలం 20 కిలోమీటర్ల దూరంలో ఈ ధరాలీ గ్రామం ఉంది. హృషీకేశ్ నుంచి బయల్దేరే యాత్రికులు ఉత్తరకాశీ, హర్షిల్, ధరాలీ మీదుగా గంగోత్రికి చేరుతారు. అలకనంద నది ఒడ్డున.. అద్భుతమైన ప్రకృతి సౌందర్యంతో విరాజిల్లే ఈ గ్రామంలోని ఇళ్లు, హోటళ్లు, ఆశ్రమాల్లో చాలా మంది యాత్రికులు బస చేస్తారు. వారికోసం అక్కడ పెద్ద సంఖ్యలో రెస్టారెంట్లు కూడా ఉంటాయి. ఈ గ్రామానికి పై నుంచి ప్రవహించే ఖీర్ గంగ (ఇది గంగానదికి ఉపనది. పాల నురగలా తెల్లగా ఉంటుందని అలా పిలుస్తారు) పరీవాహక ప్రాంతంలోనే మేఘవిస్ఫోటం జరిగి కుంభవృష్టి కురవడంతో ఈ ప్రళయం సంభవించింది. దీంతో ధరాలీ గ్రామం పూర్తిగా నీటమునిగింది. గంగోత్రికి రోడ్డు సంబంధాలు తెగిపోయాయి. కాగా.. ఈ విలయంలో చనిపోయిన, గల్లంతైన వారి కుటుంబాలకు ప్రధాని మోదీ సంతాపం తెలిపారు. బాధితులను తాము అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామీతో మాట్లాడి.. సహాయక చర్యల నిమిత్తం ఏడు బృందాలను అక్కడికి పంపారు.

ఏమిటీ క్లౌడ్‌బరస్ట్

కేవలం 20-30 కిలోమీటర్ల పరిధిలో.. గంట వ్యవధిలో.. కుంభవృష్టి (10 సెంటీమీటర్లు అంతకన్నా ఎక్కువ) కురిస్తే దాన్ని క్లౌడ్‌బరస్ట్ అంటారు. ఎక్కువగా కొండప్రాంతాల్లో జరిగితే ఈ మేఘ విస్ఫోటం ప్రభావం చాలా ఎక్కువ ఉంటుంది. మంగళవారం ధరాలీని ముంచెత్తిన మెరుపువరదలే ఇందుకు రుజువు.

గంగమ్మ దర్శనంతోనే స్వర్గ ప్రాప్తి!

వరద బాధితులతో యూపీ మంత్రి దారుణ వ్యాఖ్యలు

వరద ముంపులో సర్వం కోల్పోయిన బాధితులు ఆశించేది.. ప్రభుత్వం నుంచి కాస్తంత భరోసా, బాధ్యతాయుత ప్రవర్తన! కానీ.. ఉత్తరప్రదేశ్‌లో వరదబాధితులను పరామర్శించడానికి వెళ్లిన మంత్రి అందుకు విరుద్ధంగా ప్రవర్తించారు. "మంత్రిగారూ మా ప్రాంతమంతా నీళ్లల్లో మునిగిపోయింది. మా ఇళ్లు కూలిపోయాయి. ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నాం.. మమ్మల్ని ఆదుకోండి" అని వారు వేడుకుంటే.. "గంగమ్మ తల్లి తన పిల్లల పాదాలు కడగడానికి వస్తుంది. ఆ తల్లి దర్శనంతోనే పిల్లలు నేరుగా స్వర్గానికి వెళ్లిపోతారు" అంటూ సందర్భం లేకుండా ఏదేదో మాట్లాడారు. ఆయన మాటలు విని.. బాధితులు నివ్వెరపోయారు. "అసలా మంత్రిగారికి తాను యమునానది ఒడ్డున ఉన్న గ్రామాలను అనే విషయం కూడా తెలియదు" అని వాపోయారు.

లోకం తీరు



జమ్ముకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ కన్నుమూత



న్యూఢిల్లీ, ఆగస్టు 5: జమ్ముకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ కన్నుమూశారు. దీర్ఘకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ఢిల్లీలోని రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందారు. గోవా, బిహార్, మేఘాలయ, ఒడిశా రాష్ట్రాలకు గవర్నర్‌గా సేవలందించిన ఆయన లోక్‌సభ, రాజ్యసభ సభ్యుడిగా కూడా తన రాజకీయ జీవితంలో అనేక పదవులు నిర్వహించారు. ఆర్టికల్ 370 రద్దు జరిగిన సమయంలోనూ.. పుల్వామా ఉగ్రదాడి జరిగిన సమయంలోనూ ఆయనే జమ్ముకశ్మీర్ గవర్నర్‌గా ఉన్నారు. పదవిలో ఉన్న సమయంలోనే.. పలు అంశాలపై కేంద్ర ప్రభుత్వ విధానాలను తరచూ విమర్శిస్తూ వార్తల్లో నిలిచారు. వ్యవసాయ చట్టాలపై మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను తీవ్రంగా వ్యతిరేకించారు. అలాగే పుల్వామా ఉగ్రదాడి, ఆర్టికల్ 370 రద్దు వంటి కీలక ఘటనలపై మాలిక్ చేసిన వ్యాఖ్యలతో బీజేపీ ప్రభుత్వానికి, ఆయనకు మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. జమ్ముకశ్మీర్ గవర్నర్‌గా ఉన్న సమయంలో.. రూ. 2200 కోట్ల జలవిద్యుత్ ప్రాజెక్టు కాంట్రాక్టుల విషయంలో అవినీతికి పాల్పడ్డారంటూ సత్యపాల్ మాలిక్‌పై ఆరోపణలు వచ్చాయి. ఈ కేసు విచారణలో భాగంగా ఇటీవలే ఆయన ఇంట్లో సోదాలు జరిపిన సీబీఐ.. మాలిక్‌తో పాటు మరో ఐదుగురి పేర్లను చార్జిషీట్‌లో ప్రస్తావించింది. ఆ సమయంలోనే ఆయన అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరినట్లు తెలుస్తోంది. సత్యపాల్ మాలిక్ మృతి పట్ల ప్రధాని మోదీ సంతాపం వ్యక్తం చేశారు.

అమెరికాను చమురు

బేహారిగా మార్చేందుకే!

భారత్‌పై ట్రంప్ చింతనిప్పులు అందుకే

- రష్యాను కాదని, అమెరికా చమురు కొంటే భారత్‌కు 11 బిలియన్ డాలర్ల నష్టం

న్యూఢిల్లీ/వాషింగ్టన్, ఆగస్టు 5: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌ను పదే పదే ఎందుకు బెదిరిస్తున్నారు? సుంకాల మీద సుంకాలు బాదుతానని ఎందుకు ప్రకటనలు చేస్తున్నారు?? ఈ ప్రశ్నలకు భారత్‌కు చమురు అమ్మేందుకే ట్రంప్ ఈ ఎత్తుగడలు వేస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వ్యూహాత్మకంగా భారత్‌పై ఒత్తిడి పెంచి.. తన దారికి తెచ్చుకోవాలనే ఉద్దేశంతోనే ట్రంప్ ప్రకటనలు కనిపిస్తున్నాయి. అమెరికాలోని చమురు లాబీకి మద్దతివ్వడంతోపాటు.. అంతర్జాతీయ ఇంధన వ్యాపారాన్ని తనవైపు మళ్లించుకోవాలనే ఉద్దేశంతో ట్రంప్ ఓ లెక్కతో ముందుకు సాగుతూ.. 'వ్యూహాత్మక మిత్ర దేశాల'పై ఆర్థిక ఒత్తిడిని పెంచుతున్నారు. భారత్ ప్రస్తుతం తన అవసరాల్లో 40% చమురును రష్యా నుంచి కొనుగోలు చేస్తోంది. రష్యా చమురు చవకగా లభించడమే కాకుండా.. అమెరికా డాలర్లలో కాకుండా.. భారతీయ రూపాయల్లోనే కొనుగోళ్లకు అవకాశముండడమే ఇందుక్కారణం..! రష్యా నుంచి ఈ ఏడాది జనవరి నుంచి రోజుకు సగటున 17.5 లక్షల బ్యారెళ్ల మేర ముడి చమురు భారత్‌కు దిగుమతి అవుతోంది. నిజానికి రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలైనప్పుడు అమెరికా ప్రభుత్వమే.. అంతర్జాతీయంగా చమురు ధరలను స్థిరంగా ఉంచేందుకు మాస్కో నుంచి చమురు కొనాలని భారత్‌ను కోరింది. ఇటీవల ట్రంప్ వ్యూహాత్మకంగా భారత్‌ను టార్గెట్‌గా చేసుకుంటూ రావడానికి కూడా ఓ లెక్క ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా డాలర్‌ను బలహీనపరిచేందుకు బ్రిక్స్ దేశాలు ప్రయత్నిస్తున్నాయని ఇటీవల ఆరోపించారు. రష్యా చమురును రూపాయల్లో కొనుగోలు చేయడం కూడా ఇందులో భాగమేనని అమెరికా భావిస్తోంది. అమెరికాను ప్రపంచ చమురు బేహారిగా మార్చాలని ట్రంప్ కంకణం కట్టుకున్నారు. అందుకే.. అమెరికా చమురు సంస్థలకు 18 బిలియన్ డాలర్ల(రూ.1.5 లక్షల కోట్లు) మేర ప్రోత్సాహకాలను ప్రకటించారు. భారత్ లాంటి అతి పెద్ద చమురు వినియోగ దేశాలను తనవైపు తిప్పుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

అమెరికా నుంచి ఎంత?

నిజానికి ఈ ఏడాది ప్రథమార్థంలో అమెరికా నుంచి కొనే చమురును భారత్ 50% పెంచింది. అయినా.. భారత అవసరాల్లో ఇది కేవలం 8% మాత్రమే..! భారత్ కనీసం తన చమురు అవసరాల్లో 20% అమెరికా నుంచి కొనుగోలు చేస్తే.. ఈ రంగంలో అమెరికా ప్రాబల్యం పెరుగుతుంది. అందుకే ట్రంప్ బెదిరింపుల్లా కాకుండా.. భారత్‌పై ఒత్తిడి పెంచేలా.. వ్యూహాత్మకంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. తాజా సుంకాల పెంపుతో.. భారత్‌కు ఏటా 18 బిలియన్ డాలర్ల(రూ.1.5 లక్షల కోట్లు) మేర నష్టం వాటిల్లే ప్రమాదముంది. అయితే.. రష్యాను కాదని, అమెరికా వద్ద ఎక్కువ ధరకు చమురు కొనుగోలు చేస్తే.. 11 బిలియన్ డాలర్ల(రూ.91,500 కోట్లు) చేతిచమురు తప్పదు. ఈ రెండింటినీ బేరీజు వేసి చూస్తే.. అమెరికాతో చమురు ఒప్పందాలు చేసుకుంటే.. భారత్‌కు 7 బిలియన్ డాలర్ల(రూ.58 వేల కోట్లు) మేర మిగులు ఉంటుందనేది ట్రంప్ లెక్కగా తెలుస్తోంది.

అమెరికాపై భారత సైన్యం వ్యంగ్యాస్త్రాలు

ట్రంప్ బెదిరింపులపై భారత సైన్యం వ్యంగ్యాస్త్రాలను సంధించింది. *1971 ఆగస్టు 5* నాటి ఓ పేపర్ క్లిప్పింగ్‌ను షేర్ చేస్తూ.. అమెరికా తీరును ఎండగట్టింది. ఆ క్లిప్పింగ్ ప్రకారం భారత్-పాకిస్థాన్ యుద్ధానికి ముందు.. పాకిస్థాన్‌కు అమెరికా ఆయుధాలను సరఫరా చేసింది. దీనిపై అప్పటి రక్షణ ఉత్పత్తుల శాఖ మంత్రి వీసీ శుక్లా రాజ్యసభలో ఓ ప్రకటన చేశారు. "ఆయుధాల కోసం నాటో, సోవియట్ యూనియన్లతో పాకిస్థాన్ సంప్రదింపులు జరిపింది. అయితే.. ఆ దేశాలు నో చెప్పాయి. కానీ, అమెరికా మాత్రం పాకిస్థాన్‌కు మద్దతిస్తూ.. ఆయుధాలను సరఫరా చేస్తూనే ఉంది" అని వ్యాఖ్యానించినట్లు ఆ పేపర్ క్లిప్పింగ్ స్పష్టం చేస్తోంది. 'ఇప్పుడు కూడా ట్రంప్ పాకిస్థాన్‌పై దయ చూపుతున్నారా? వారిపై టారిఫ్‌లను *19శాతానికి* తగ్గించారు" అని భారత సైన్యం పేర్కొంది.

మరో 24 గంటల్లో..

భారత్‌పై భారీగా సుంకాలు

(మొదటి పేజీ తరువాయి)



వాణిజ్య భాగస్వామి కాదు. వాళ్లు అమెరికాతో చాలా వ్యాపారం చేస్తారు. కానీ అధిక సుంకాల కారణంగా భారత్‌తో అమెరికా పెద్దగా వ్యాపారం చేయలేదు. అందుకే భారత్‌పై 25శాతం సుంకాలు విధించాం. వచ్చే 24 గంటల్లో ఈ సుంకాలను మరింత భారీగా పెంచబోతున్నాను. రష్యా నుంచి భారత్ చమురు కొంటుండటమే దీనికి కారణం. దీనితో ఉక్రెయిన్‌పై యుద్ధం కోసం రష్యాకు అవసరమైన నిధులు అందుతున్నాయి. ఇది నాకు ఇష్టం లేదు." అని ట్రంప్ పేర్కొన్నారు. నిజానికి భారత్ తమ టారిఫ్‌లను సున్నాకు తగ్గించినా కూడా సరిపోదని.. వారు చమురు విషయంలో చేస్తున్న పని సరికాదని వ్యాఖ్యానించారు. రష్యా చమురు కొనుగోళ్ల అంశంలో అమెరికా, యూరోపియన్ యూనియన్ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నాయంటూ భారత్ ఎండగట్టిన తర్వాత కూడా ట్రంప్ తాజా వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

వాణిజ్య భాగస్వామిని ఎంచుకునే హక్కు భారత్‌కు ఉంది

రష్యా నుంచి చమురు కొనుగోలు చేయవద్దంటూ భారత్‌పై అమెరికా చేస్తున్న ఒత్తిడి సరికాదని, నచ్చిన వాణిజ్య భాగస్వామిని ఎంచుకునే హక్కు భారత్‌కు ఉందని రష్యా స్పష్టం చేసింది. "సార్వభౌమ దేశాలకు వారి వాణిజ్య భాగస్వాములను ఎంచుకునే హక్కు ఉంటుంది. ఆర్థికపరంగా, వాణిజ్యపరంగా తమ ప్రయోజనాలకు అనుగుణంగా సొంతంగా నిర్ణయాలు తీసుకునే హక్కు ఉంటుంది.." అని రష్యా అధ్యక్ష కార్యాలయం అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ పేర్కొన్నారు. మరోవైపు అమెరికా పెత్తనాన్ని చూపుకొనేందుకు దక్షిణ ప్రాంత దేశాలపై వలసవాద విధానాలు రుద్దుతోందని రష్యా విదేశాంగ శాఖ ప్రతినిధి మరియా జఖరోవా మండిపడ్డారు.

రష్యాలో పర్యటించనున్న దోవల్

భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ రష్యాలో పర్యటించనున్నట్టు తెలిసింది. ఇరు దేశాల మధ్య ఇంధన, రక్షణ బంధాలను మరింత బలోపేతం చేసుకునే దిశగా చర్చలు జరపనున్నట్టు సమాచారం. ఈ పర్యటన ముందే ఖరారైనా... రష్యా నుంచి చమురు కొనుగోలు చేయవద్దంటూ భారత్‌పై అమెరికా తీవ్ర ఒత్తిడి చేస్తున్న నేపథ్యంలో చర్చనీయాంశంగా మారింది.

ట్రంప్‌తో 'దోస్త్ దోస్త్ నా రహా'!

భారత్‌పై అదనపు సుంకాలు వేస్తానన్న ట్రంప్ ప్రకటన నేపథ్యంలో.. ప్రధాని మోదీని ఉద్దేశించి కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పించింది. ట్రంప్, మోదీ స్నేహం ముగిసిపోయిందని పేర్కొంది. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రఖ్యాత హిందీ పాటను ప్రస్తావిస్తూ.. "దోస్త్ దోస్త్ నా రహా, ప్యార్ ప్యార్ నా రహా, ట్రంప్ తుమే తేరా ఐత్‌బార్ నా రహా (నా స్నేహితుడు ఇప్పుడు స్నేహితుడు కాదు. నా ప్రేమ ఇప్పుడు ప్రేమ కాదు. ట్రంప్ నీ మీద మా నమ్మకం పోయింది). మంచి మిత్రులుగా చెప్పుకొనే మోదీ, ట్రంప్‌ల మధ్య స్నేహం పూర్తిగా కుప్పకూలిపోయినట్టే.." అని వ్యాఖ్యానించారు. ఇన్నాళ్లూ మనకు పాకిస్థాన్, చైనాలతో సమస్య ఉందని, కానీ ఇలా అమెరికాతో సంబంధాలు క్షీణిస్తాయని అనుకోలేదని చెప్పారు.

ఎన్డీయే సహజ కూటమి!

- మిత్రపక్షాల కలివిడి అద్భుతం
- సుదీర్ఘకాలం కలిసి పనిచేద్దాం
- ఎన్డీయే ఎంపీల భేటీలో మోదీ



న్యూఢిల్లీ, ఆగస్టు 5: "ఎన్డీయే సహజ కూటమి. మిత్రపక్షాల సామూహిక గుర్తింపునకు ఇది ప్రాతిపదిక. 1998 నుంచి ఈ కూటమి అనేక విజయాలు దక్కించుకుంది. అయితే.. చేయాల్సిన పనులు, సాధించాల్సిన విజయాలు చాలానే ఉన్నాయి." అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. దాదాపు ఏడాది తర్వాత ఎన్డీయే కూటమి పార్టీల ఎంపీలతో ప్రధాని మోదీ మంగళవారం సమావేశమయ్యారు. 2024, జూలై 2న తొలిసారి భేటీ అయిన ఆయన.. మళ్లీ మంగళవారమే ఎన్డీయే ఎంపీలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా 'ఆపరేషన్ సిందూర్‌'ను 'అసాధారణ నాయకత్వం'తో విజయవంతం చేశారని ప్రశంసిస్తూ.. ఎన్డీయే మిత్రపక్షాల పార్లమెంటు సభ్యులు ప్రధానిని ఘనంగా సత్కరించారు. అదేవిధంగా భారత భద్రతా దళాలు ఆపరేషన్ సిందూర్, ఆపరేషన్ మహాదేవ్‌లను అచంచల నిబద్ధతతో విజయవంతం చేశాయని పేర్కొంటూ ఓ తీర్మానాన్ని వెలువరించారు. అనంతరం మోదీ మాట్లాడుతూ.. బీజేపీ సహా మిత్రపక్షాల సభ్యులు కలివిడిగా ఉన్నారని, ఈ కలివిడి మరింతగా పెరగాలని సూచించారు. "మనం సుదీర్ఘకాలం కలిసి నడవాల్సి ఉంది. సమన్వయం, సహకారంతో ముందుకు సాగుదాం" అని వ్యాఖ్యానించారు. పహల్గాం ఉగ్రదాడి, దీనికి భారత సైన్యం దీటుగా స్పందించిన తీరుపై పార్లమెంటులో చర్చ చేపట్టాలని కోరిన ప్రతిపక్షం.. తర్వాత చింతించే పరిస్థితి వచ్చిందని మోదీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. రాహుల్‌గాంధీపై విమర్శలు గుప్పించారు. "భారత భూభాగం, భద్రతపై అవగాహన, ఆధారాలు లేకుండా ఆయన(రాహుల్) పిల్ల చేష్టలకు పోయారు. అందుకే కోర్టు ఆయనకు మొట్టికాయలు వేసి తగిన గుణపాఠం చెప్పింది." అని ఎద్దేవా చేశారు. పంద్రాగస్టును పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహించే తిరంగా ర్యాలీలో ఎన్డీయే ఎంపీలు ఉత్సాహంగా పాల్గొనాలని మోదీ సూచించారు.

అమిత్‌షా అరుదైన రికార్డు!

కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అరుదైన ఘనత సాధించారు. అత్యధిక కాలం దేశ హోంమంత్రిగా పనిచేసిన నేతగా గుర్తింపు పొందారు. వాజపేయి హయాంలో బీజేపీ అగ్రనేత అడ్వాణీ *2,256 రోజులు (ఆరేళ్ల 64 రోజులు)* హోంమంత్రిగా పనిచేయగా.. మంగళవారంనాటికి *2,258 రోజుల(ఆరేళ్ల 66 రోజులు)*తో షా ఆయన్ను అధిగమించారు. అమిత్ షా *2019 మే 20న* కేంద్ర హోం మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అదే పదవిలో కొనసాగుతున్నారు.



ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుమలలో పవిత్రోత్సవాలు ప్రారంభం

తిరుమల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఉదయం పవిత్ర ప్రతిష్ఠ, మధ్యాహ్నం స్వామి, అమ్మవార్లకు విశేష సమర్పణ నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి యాగశాలలో వైదిక కార్యక్రమాలు జరిగాయి. మూడు రోజులపాటు ఈ ఉత్సవాలు జరుగుతాయి. ఈ కార్యక్రమంలో జీయర్ స్వాములు, డిప్యూటీ ఈవో లోకనాథం, పేష్కార్ రామకృష్ణ పాల్గొన్నారు.

తిరుమలలో అన్నదానానికి మరో భోజనశాల

తిరుమలలో తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద వితరణ కేంద్రానికి అనుబంధంగా విశాలమైన మరొక భవనాన్ని నిర్మించాలని టీటీడీ భావిస్తోంది. ప్రస్తుతం ఒకేసారి 4 వేల మంది భోజనం చేసేలా నాలుగు డైనింగ్ హాళ్లు అన్నప్రసాద కేంద్రంలో ఉన్నాయి. రోజుకు 70 నుంచి 75 వేల మంది ఇక్కడ భోజనం చేస్తుంటారు. రద్దీ రోజుల్లో ఈ సంఖ్య లక్ష దాటుతుంది. ఇటువంటి సమయాల్లో ఈ కేంద్రం వద్ద భారీగా క్యూ లైన్లు ఉంటున్నాయి. దీంతో వెయ్యి మంది ఒకేసారి భోజనం చేసేలా మరొక హాలు అవసరమని టీటీడీ అధికారులు అంచనా వేశారు. వెంగమాంబ అన్నప్రసాద వితరణ కేంద్రానికి సమీపంలోని గ్యాస్ ప్లాంట్‌ను గోగర్భం డ్యాం వద్దకు తరలిస్తున్నందున, ఈ ప్రదేశంలో కొత్త భవనం నిర్మించాలని నిర్ణయించినట్టు తెలిసింది. టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, అన్నప్రసాద విభాగం అధికారులతో కలిసి సోమవారం ఆ ప్రదేశాన్ని పరిశీలించారు.

నెరవేరిన 'యువగళం' పాదయాత్ర హామీ

» కర్నూలులో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ



కర్నూలులో నిరుపేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న టీజీ భరత్, కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ ఇచ్చిన హామీ నెరవేరింది. 30 ఏళ్ల పేదల స్వప్నం నెరవేరింది. రూ.లక్షల విలువైన స్థలం సొంతం కావడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. వివరాలివీ.. కర్నూలు రైల్వే స్టేషన్ వెనుక, అశోక్ నగర్ పంప్‌హౌస్ వద్ద 150 మంది కుటుంబాలకు చెందిన నిరుపేదలు ప్రభుత్వ స్థలంలో పూరి గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారు. 30 ఏళ్లుగా వారు అక్కడే ఉంటున్నారు. ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగం వారిని ఖాళీ చేయించడానికి ప్రయత్నాలు చేసిందే తప్ప, ఉన్నచోటే పట్టాలివ్వాలన్న వారి గోడును ఎవరూ పట్టించుకోలేదు. ఎన్నికల ముందు 'యువగళం' పాదయాత్రలో భాగంగా నారా లోకేశ్ కర్నూలుకు వచ్చారు. ఈ సందర్భంగా పేదలంతా అప్పటి టీడీపీ ఇన్‌చార్జి టీజీ భరత్ చొరవతో నారా లోకేశ్‌ను కలసి తమ గోడు వెల్లబోసుకున్నారు. అధికారం వచ్చిన తక్షణమే పట్టాలిస్తానని లోకేశ్ స్పష్టమైన హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్.. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. 2025 జనవరిలో తీసుకొచ్చిన జీవో నంబరు 30 మేరకు మంగళగిరిలో ఇలాంటి పేదలకు పట్టాలు ఇవ్వగా, అదే జీవో ఆధారంగా కర్నూలులో పేదలకు తాజాగా రూ.కోట్ల విలువైన స్థలాన్ని అప్పగిస్తూ పట్టాలిచ్చారు. తన జన్మదినం సందర్భంగా మంత్రి టీజీ భరత్ మంగళవారం వారికి పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేసీ బి.నవ్య తదితరులు పాల్గొన్నారు.

ఏపీ నిట్‌కు నీరేది?

» 10 ఏళ్ల క్రితం హామీ ఇచ్చిన ప్రభుత్వం.. ఇప్పటికీ హామీ అమలు కాని వైనం



తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఏపీ నిట్ ఏర్పాటై 10 ఏళ్లు పూర్తి అయ్యింది. రోజూ 10 లక్షల లీటర్ల మంచినీరు అందిస్తామని అప్పట్లో ప్రభుత్వం భరోసా ఇచ్చింది. కానీ ఇప్పటివరకు ఆ హామీ నెరవేరలేదు. భూగర్భ జలాలపైనే ఏపీ నిట్ విద్యార్థులు ఆధారపడుతున్నారు. గతంలో మంచి నీరు కొనుగోలు చేసే దుస్థితి నెలకొనడంతో.. రోజూ లక్ష లీటర్ల నీటిని మున్సిపాలిటీ నుంచి అందిస్తున్నారు. ప్రభుత్వ హామీ మేరకు మంచి నీరు సరఫరా చేయాలంటే తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో నీటి శుద్ధి ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలి. వైసీపీ ప్రభుత్వంలో ప్లాంట్ నిర్మాణం కోసం సుమారు రూ.5 కోట్లు నిధులు మంజూరు చేసారు. అప్పట్లోనే కాంట్రాక్టర్ పనులు ప్రారంభించినా సుమారు రూ.3 కోట్ల బిల్లు పెండింగ్ పెట్టడంతో నీటి శుద్ధి ప్లాంట్ నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. ప్రభుత్వం బిల్లు మంజూరు చేస్తేనే నిర్మాణం ముందుకు సాగుతుంది. స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఇటీవల కాంట్రాక్టర్‌తో సంప్రదింపులు జరిపారు. బిల్లు మంజూరు చేస్తేనే పనులు ప్రారంభిస్తానని ఆయన స్పష్టంచేశారు. ఫలితంగా నీటిశుద్ధి ప్లాంట్ ఏర్పాటు ముందుకు సాగడం లేదు. అది పూర్తయితే అదనంగా రోజూ కోటి లీటర్ల మంచినీటిని శుద్ధి చేసి పట్టణ ప్రజలకు అందజేసే అవకాశం ఉంటుంది. అందులో నుంచి 10 లక్షల లీటర్ల నీటిని ఏపీ నిట్‌కు ఇవ్వాలని అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

అక్కాతమ్ముళ్లను కలిపిన 'ఆంధ్రజ్యోతి'

» అనారోగ్యంతో అపస్మారక స్థితిలో సోదరుడు

» తిరుపతిలో ఫుట్‌పాత్‌పై నెలన్నరగా అచేతనావస్థ

» 'ఆంధ్రజ్యోతి' చొరవతో నెల్లిమర్లలోని అక్కకు సమాచారం

» ఎంపీ కలిశెట్టి సహకారంతో కారులో నెల్లిమర్లకు పయనం

నెల్లిమర్ల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వర స్వామి దర్శనం కోసం తిరుమల వెళ్లిన విశాఖకు చెందిన భక్తుడు కోరుమల్లి వెంకటరావు అనారోగ్యంతో దిక్కుతోచని స్థితిలో నెలన్నర నుంచి తిరుపతిలో ఫుట్ పాత్ పైనే కాలం గడిపారు. అతడి దీనావస్థపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతోపాటు, 'ఆంధ్రజ్యోతి' బృందం నేరుగా విజయనగరం జిల్లా నెల్లిమర్లలో ఉంటున్న అతడి అక్కను కలసి సమాచారం అందించింది. మరోవైపు ఎంపీ కలిశెట్టి వాహనం సమకూర్చడంతో తిరుపతి నుంచి క్షేమంగా నెల్లిమర్లకు బయలుదేరారు. వివరాలివీ.. విశాఖకు చెందిన వెంకటరావు హార్డ్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేసేవారు. భార్యా పిల్లలు లేరు. ఒక్కడే తిరుపతి దర్శనానికి వెళ్లారు. అనారోగ్యంతో కుప్పకూలి ఆసుపత్రిలో చేరారు. తన వివరాలు సరిగా చెప్పలేక పోవడంతో రెండు రోజుల్లో డిశ్చార్జి అయ్యారు. అప్పటి నుంచి తిరుపతిలోని అలిపిరి సమీపంలోని పేవ్‌మెంట్ మీద పడిఉన్న ఆయన్ను చూసి స్థానికంగా ఉన్న సామాజిక సేవకురాలు సుజాత చలించిపోయారు. ఆయనకు సపర్యలు చేస్తూ తిండి పెడుతున్నారు. ఎట్టకేలకు ఆయన పూర్తి స్థాయి స్పృహ వచ్చి తన అక్క విజయనగరం జిల్లా నెల్లిమర్లలోని బృందావన్ వ్యాలీలో నివాసం ఉంటోందని, తన విషయం ఆమెకు తెలియజేయాలని కోరారు. దీనిపై 'అక్కా.. వచ్చి నన్ను తీసుకెళ్లు' శీర్షిన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. మరోవైపు 'ఆంధ్రజ్యోతి' బృందం కూడా నేరుగా నెల్లిమర్ల సమీపాన సారిపల్లి రోడ్డు బృందావన్ వ్యాలీలో నివాసం ఉంటున్న కోరుమల్లి వెంకటరావు.. అక్క అరుణా పాఠక్ ఇంటికి చేరుకుని అతడి పరిస్థితిని వివరించింది. అలాగే, 'ఆంధ్రజ్యోతి' చొరవతో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు స్పందించారు. అరుణా పాఠక్‌తో ఫోన్‌లో మాట్లాడి ఆమెకు ధైర్యం చెప్పారు. వెంకటరావును తిరుపతి నుంచి నెల్లిమర్ల తరలించేందుకు ప్రత్యేక వాహనం సమకూర్చారు. దీంతో వెంకటరావును తీసుకొద్దామని బయలుదేరిన అరుణా పాఠక్ కుటుంబీకులు తిరుపతి ప్రయాణాన్ని విరమించుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు తిరుపతి నుంచి వెంకటరావు కారులో బయలుదేరినట్లు ఇక్కడికి సమాచారం అందింది. బుధవారం ఆయన నెల్లిమర్ల చేరుకునే అవకాశముంది.



ఎంపీ కలిశెట్టి ఏర్పాటు చేసిన కారులో తిరుపతి నుంచి బయలుదేరిన వెంకటరావు

'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపిన అరుణా పాఠక్

పాఠక్, అరుణా పాఠక్ దంపతులు ఉద్యోగ రీత్యా ఢిల్లీలో ఉండేవారు. పాఠక్ ఉద్యోగ విరమణ అనంతరం నెల్లిమర్లలో ఇల్లు నిర్మించుకుని ఉంటున్నారు. సోదరుడు వెంకటరావు విశాఖలో ఉంటున్నారు. వెంకటరావు దీన స్థితి గురించి 'ఆంధ్రజ్యోతి'లో వార్త ప్రచురితమైన విషయం తెలుసుకుని తీవ్ర ఆవేదన చెందారు. తన సోదరుడి పరిస్థితిని తెలియజేసిన 'ఆంధ్రజ్యోతి'కి, ప్రత్యేక వాహనంతో తన సోదరుడ్ని నెల్లిమర్ల తరలించేందుకు ఏర్పాట్లు చేసిన ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకు రుణపడి ఉంటామని అరుణా పాఠక్, ఆమె భర్త పాఠక్ కన్నీళ్లతో కృతజ్ఞతలు తెలిపారు.



బాలాత్రిపుర సుందరి ఆలయం వద్ద సంచరిస్తున్న చిరుత

తిరుమలలో చిరుత సంచారం

తిరుమల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తిరుమలలో సోమవారం రాత్రి ఓ చిరుతపులి పిల్లిమీద దాడి చేసింది. స్థానికులు నివసించే బాలాజీనగర్‌లోని బాలాత్రిపుర సుందరి ఆలయం వద్దకు రాత్రి 9.41 గంటల సమయంలో చిరుత వచ్చింది. అక్కడ నిద్రిస్తున్న పిల్లిపై దాడి చేసింది. ఈ దృశ్యాలన్నీ అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో రికార్డయ్యాయి.

25 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

డిపోలు నిర్ణీత వేళల్లో తెరిచిఉంచాలి
అదనంగా వసూలుచేస్తే ఊరుకోవద్దు

» దుకాణాల వద్ద డిజిటల్ చెల్లింపులు

» మంత్రి నాదెండ్ల మనోహర్



విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పండుగ వాతావరణంలో ఈనెల 25వ తేదీ నుంచి స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రేషన్ డిపోలు నిర్ణీత సమయాలలో తెరిచి ఉంచాలని, సరుకుల వివరాలు తెలిపే బోర్డులు ఉండాలన్నారు. క్యూఆర్ కోడ్‌తో ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి అదనంగా ఒక్క రూపాయి కూడా డీలర్లు వసూలు చేయకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. డిపోల వద్ద డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించాలన్నారు. మంగళవారం విశాఖ కలెక్టరేట్‌లో ఉత్తరాంధ్ర జిల్లాల జాయింట్ కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖాధికారులతో నిర్వహించిన సదస్సులో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజల మన్ననలు పొందేలా సేవలు అందించాలని, వారి సంతృప్తే కొలమానంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని అన్నారు. గ్యాస్ సబ్సిడీపై వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. రైతుల ప్రయోజనం కోసం గత సీజన్‌లో పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేసి రూ.12 వేల కోట్లు చెల్లించామన్నారు. స్థానికంగా పండే ధాన్యాన్ని మధ్యాహ్న భోజన పథకంలో వినియోగించేందుకు ప్రతిపాదనలు పంపాలని శ్రీకాకుళం, విజయనగరం జేసీలను ఆదేశించారు. వలసదారులకు రేషన్ సరుకుల పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. పౌర సరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్‌గౌర్ మాట్లాడుతూ తూనికలు, కొలతలు, ఆహార భద్రతా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపామని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి మనోహర్ చెప్పారు. దీనికి సంబంధించి చట్టంలో మార్పులు తీసుకొచ్చామన్నారు. విజిలెన్స్ తనిఖీలు పెంచామని వివరించారు. అధికారుల సదస్సు అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంతో పోల్చితే బియ్యం అక్రమ రవాణా తగ్గిందన్నారు. పోర్టులపై నిఘా ముమ్మరం చేశామని, అక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విశాఖ పోర్టులో త్వరలో చెక్‌పోస్టు వస్తుందన్నారు. ప్రజా పంపిణీలో సంస్కరణల అమలులో భాగంగా పైలట్ ప్రాజెక్టు కింద ఎన్టీఆర్ జిల్లాలో గ్యాస్ సబ్సిడీకి డిజిటల్ వాలెట్ విధానం తీసుకువస్తున్నామని మంత్రి తెలిపారు.



విద్యార్థికి గోల్డ్ మెడల్ అందజేస్తున్న సమీర్ సోమయ్య, ఝిల్లు సింగ్ యాదవ్, శాంతను భట్టాచార్య

వ్యవసాయ రంగం అభివృద్ధికి యువ శాస్త్రవేత్తలు కృషిచేయాలి: సమీర్ సోమయ్య

» ఘనంగా తిరుపతి ఐసర్ 6వ స్నాతకోత్సవం

ఏర్పేడు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మట్టిలోని జీవ కణాలు, కార్బన్ మీద దృష్టి తగ్గిపోతున్న క్రమంలో వ్యవసాయ రంగంతో కలిసి యువ శాస్త్రవేత్తలందరూ పనిచేయాలని గోదావరి బయో రిఫైనరీస్ లిమిటెడ్ ఛైర్మన్, సోమయ్య విద్యావిహార్ విశ్వవిద్యాలయ ఛాన్సలర్ సమీర్ సోమయ్య పిలుపునిచ్చారు. తిరుపతి సమీపంలోని ఐసర్(భారతీయ విజ్ఞాన శిక్షణ, పరిశోధన సంస్థ)లో మంగళవారం జరిగిన ఆరవ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తాము రైతులతో కలిసి పనిచేస్తామన్నారు. పంచగవ్య, జీవామృతం వంటి సాంప్రదాయక విధానాలను పరిశీలించి, శాస్త్రీయంగా పరిశోధించి వాటిని ఆధునిక పద్ధతులతో మిళితం చేయడం ప్రారంభించామన్నారు. ఈ కృషి ఫలితంగా ఉత్తర కర్ణాటకలోని ఓ రైతు సగటున 30 టన్నులకు బదులుగా 120 టన్నుల చెరకు దిగుబడి సాధించారన్నారు. అంతకుముందు ఐసర్ బోర్డు ఆఫ్ గవర్నర్స్ ఛైర్‌పర్సన్ ఝిల్లు సింగ్ యాదవ్ మాట్లాడుతూ.. విద్యార్థులు మార్పు కోసం మార్గనిర్దేశకులుగా మారాలన్నారు. వ్యవసాయం, సస్టైనబుల్ కెమిస్ట్రీ, సెమీకండక్టర్, ఎంజైమ్ తయారీ రంగాల్లో పరిశోధనలు చేయాలని ప్రోత్సహించారు. ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్తగా రెండేళ్ల మాస్టర్ బై రీసెర్చ్(ఎంఎస్-ఆర్) కోర్సును ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. అంతకుముందు రిజిస్ట్రార్ ఇంద్రదీత్ సింగ్ కోహ్లీ అధ్యక్షతన 2025కి గాను 225 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు.

అంబులెన్స్ ఢీకొని ఇద్దరు మృతి

» ఏలూరులో రైతు, రైతు కూలీ విషాదాంతం



శ్రీరామమూర్తి, పెంద్ర చిరంజీవి

ఉంగుటూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రాణాలను రక్షించాల్సిన అంబులెన్స్ మృత్యు శకటమైంది. వ్యవసాయ పనులకు వెళ్తున్న ఇద్దరిని ఢీకొట్టడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం చేబ్రోలు ఎస్ఐ సూర్యభగవాన్ కథనం ప్రకారం.. హైదరాబాద్ నుంచి తణుకు పట్టణానికి మంగళవారం ఉదయం ఓ అంబులెన్సు రోగిని తీసుకువస్తోంది. మార్గమధ్యంలో ఉంగుటూరు మండలం కైకరం వద్ద జాతీయ రహదారిపై, అదుపుతప్పిన అంబులెన్సు.. బైకుపై పొలం పనులకు వెళ్తున్న రైతు గున్ను శ్రీరామ్మూర్తి(70), వ్యవసాయ కూలీ పెంద్ర చిరంజీవిని ఢీకొట్టడంతో వారు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. శ్రీరామ్మూర్తికి భార్య, కుమారుడు ఉన్నారు. చిరంజీవికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

27 నుంచి కాణిపాక వరసిద్ధుడి బ్రహ్మోత్సవాలు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్నాయి. ఆరోజు వినాయక చవితితో ఉత్సవాలు ప్రారంభమవుతాయి.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

చమురు సెగలు

రష్యా నుంచి చమురు కొనుగోలుచేయడం మీద భారత విదేశాంగ శాఖ సోమవారం విడుదల చేసిన ప్రకటన ఎన్నడూ లేనంత స్పష్టంగా, నిర్దిష్టంగానే కాక, అమెరికా వీరంగాన్నీ, ఆ దేశాధ్యక్షుడి హెచ్చరికలనూ బేఖాతరుచేస్తున్న సందేశమూ అందులో అంతర్లీనంగా ఉంది. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మొదలైన ఈ మూడేళ్ళలో, పలుమార్లు రష్యాచమురు మీద మనకు అమెరికానుంచి హెచ్చరికలు వచ్చినప్పటికీ, ఇంత గట్టిగా జవాబు ఇవ్వడం ఇదే తొలిసారి కావచ్చు. దేశప్రయోజనాలు, అవసరాలను పరిరక్షించుకోవడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామని, ఎటువంటి నిర్ణయానికైనా సిద్ధపడతామని ఈ ప్రకటన స్పష్టం చేస్తోంది. రష్యా చమురు బూచిని చూపి పాతికశాతం సుంకాలనుంచి మించి భారత్‌ను బాదేయాలని ట్రంప్ సిద్ధపడుతున్న నేపథ్యంలో, భారత్ తన వైఖరిని ఇలా స్పష్టపరిచి, దేనికైనా సిద్ధమన్న సందేశాన్నిచ్చినట్టు కనిపిస్తోంది.

అమెరికా అధ్యక్షుడికి రష్యా చమురు ఇప్పుడు నెత్తురులాగా ఎర్రగా కనిపిస్తోంది. ఒక మహాయుద్ధానికి కందెనలాగా ఉపకరిస్తున్నదని ఇప్పుడు అనిపిస్తోంది. రష్యా యుద్ధకండూతికి, ఊచకోతకు ఉక్రెయిన్‌లో వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నా భారత్‌కు ఎంతమాత్రం పట్టడం లేదనీ, రష్యానుంచి చవుక చమురు కొని, బహిరంగమార్కెట్‌లో అమ్ముకుంటూ భారీగా లాభాలు పోగేసుకుంటున్నదని ట్రంప్ ఆగ్రహిస్తున్నారు. పాతికశాతంతో సరిపెట్టకుండా మరింత భారీగా మనలను సుంకాల మీద సుంకాలతో దెబ్బతీయడానికి ఆయన సిద్ధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో భారత్ కూడా దీటుగానే జవాబు ఇచ్చింది. రష్యా చమురుతో వ్యాపారం చేస్తున్న ఇక్కడి కంపెనీలమీద ఇప్పటికే ఈయూ ఆంక్షలు విధించిన నేపథ్యంలో, తనను అమెరికా, ఈయూలు అకారణంగా లక్ష్యం చేసుకున్నాయంటూ విమర్శ లాంటి వివరణ ఒకటి భారత్ విడుదల చేసింది. రష్యానుంచి అమెరికా ఇప్పటికీ దిగుమతి చేసుకుంటున్నవేమిటో, ఈయూ కొనుగోలుచేస్తున్నవి ఎంతో ఆ ప్రకటన వివరించింది. భారత్‌కంటే రష్యాతో ఇప్పటికీ యూరోపియన్ యూనియన్ (ఈయూ) అత్యధికవాణిజ్యం చేస్తున్నది.

ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధం మొదలుకాగానే, ప్రపంచ ఇంధనమార్కెట్లు కల్లోలంలోకి జారుకుంటున్న తరుణంలో ఈ దిగుమతులను అమెరికా స్వయంగా ప్రోత్సహించింది. రష్యా ముడిచమురులో 80శాతం భారతదేశానికే చేరి, ఇక్కడ శుద్ధిచేసినదానిలో అధికశాతం తిరిగి యూరప్‌కే ఎగుమతి అవుతోంది. ఇలా, శుద్ధిచేసిన రష్యన్ చమురు విదేశాలకే తరలిపోతున్నా, సదరు దిగుమతులు మనదేశ ప్రజల ప్రయోజనార్థం జరుగుతున్నట్టుగా మంత్రులు చెబుతూంటారు. భారత్ నుంచి ఈయూకు శుద్ధిచేసిన పెట్రోలియం ఎగుమతులు ఏటా రెట్టింపవుతున్నాయి. ఉక్రెయిన్–రష్యా యుద్ధానికి ముందు భారత్ మొత్తం చమురు దిగుమతుల్లో రష్యా వాటా ఒకశాతం కంటే లేదు. కానీ, ఈ యుద్ధం అందించిన ప్రయోజనంతో భారతదేశంలోని కంపెనీలు తాము లబ్ధి పొందుతూ, ఈయూను వెలిగిస్తూవచ్చాయి. యుద్ధాన్ని రష్యా అంతేబలంగా ఇప్పటికీ కొనసాగిస్తున్న నేపథ్యంలో, ఆయిల్ మీద ఆంక్షలతో రష్యాను బలహీనపరచాలన్న ప్రయత్నాలు బలంగా సాగుతున్నాయి. మనను బెదిరిస్తున్న ఈయూ దేశాలు రష్యానుంచి ఒకపూట దిగుమతి చేసుకుంటున్న చమురు ఉత్పత్తులు మన మూడునెలల దిగుమతులతో సమానమని చమురుమంత్రి హర్‌దీప్ పురి ఇటీవల వ్యాఖ్యానిస్తూ ఈయూదేశాలు రష్యా నుంచి కొనుగోలు చేస్తున్న చమురు ఉత్పత్తుల లెక్కలను విప్పిచెప్పారు.

ట్రంప్ తొలివిడత పాలనలో బెదిరింపులకు లొంగి వెనెజువెలా, ఇరాన్‌ల నుంచి చవుకైన చమురు దిగుమతులను వదులుకున్నట్టుగా, ఇప్పుడు రష్యా నుంచి చమురు దిగుమతులు ఆపేయడానికి భారత్ సిద్ధపడకపోవచ్చు. ప్రత్యామ్నాయ మార్గాలతో ప్రజాప్రయోజనాలను ఎట్టిపరిస్థితుల్లో కాపాడుకుంటామన్న మన విదేశాంగశాఖ వ్యాఖ్యలో అమెరికాకు అంతర్లీనంగా ఓ హెచ్చరిక కూడా ఉన్నది. డ్రిల్ బేబీ డ్రిల్ అంటూ తమ చమురుకంపెనీలను ఇబ్బడిముబ్బడిగా చమురు తోడిపోసుకోమంటున్న ట్రంప్ ఇలా మనలను బెదిరిస్తూ, అమెరికా చమురు అమ్మకానికి మార్గం సుగమం చేసుకుంటున్నారు. హెచ్చిన అమెరికా సుంకాలనూ, రష్యా చమురు దిగుమతులనూ బేరీజు వేసుకొని ఏది కావాలో, ఏది వదులుకోవాలో తేల్చుకోవాలన్నది ట్రంప్ బెదిరింపుల సారాంశం. అంతిమంగా ఏ నిర్ణయాలు తీసుకున్నప్పటికీ, మై ఫ్రెండ్..ఇండియాస్ ఫ్రెండ్ అంటూ ట్రంప్‌ను ఘనంగా కీర్తించిన ఒకప్పటి ఆప్తమిత్రుడు నరేంద్రమోదీ, ట్రంప్ మారిన వైఖరితో ఇంటాబయటా ఇబ్బందిలో పడినమాట వాస్తవం. ఎంతోకాలం తరువాత మోదీనోట స్వదేశీ మాట వినిపించడం వెనుక కొత్త విధానం కంటే ఈ విరక్తి ఎక్కువగా పనిచేసివుండవచ్చు.

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అగ్రనాయకులు తరుచు దుబాయి పర్యటనలకు వస్తున్నా, స్థానికంగా ఉన్న తమ పార్టీ మద్దతుదారులను కనీసం కలవడానికి కూడా ఇష్టపడరు. వారిని వీలయినంత దూరంగా ఉంచుతారు. నాయకుల ఇటువంటి వైఖరి వల్లే ప్రజలూ పార్టీలను అధికారం నుంచి దూరంగా ఉంచుతున్నారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తమ జనహిత యాత్రలో ఈ సత్యాన్ని గ్రహిస్తే చాలు.

జనహిత యాత్ర పరమార్థమేమిటి?

భారత జాతీయ కాంగ్రెస్ అధికారంలో ఉన్న అతి కొద్ది రాష్ట్రాలలో తెలంగాణ ఒకటి. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వ పని తీరును ఆ రాష్ట్ర ప్రజలే కాకుండా ఆసేతు హిమాచలం సమస్త ప్రజలతో పాటు ప్రవాస భారతీయులు సైతం నిశితంగా గమనిస్తున్నారు. భారతదేశ వ్యవహారాలపై ఆసక్తి చూపే విదేశీ మేధావులు, దౌత్యవేత్తలు కూడా తెలంగాణ ప్రభుత్వ పనితీరుతో పాటు అక్కడ అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ విధానాలు ఏమిటని శ్రద్ధగా ఆరా తీస్తున్నారు. హైదరాబాద్‌లో పర్యటించి వచ్చిన పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు కూడా తమ సమావేశాలలో ఏ మంత్రి ఏ విధంగా, కుర్చీపై రెండు కాళ్లు వేసుకుని కూర్చున్నారు అనే విషయంతో సహా వివిధ విశేషాలపై చలోక్తులు విసురుతుంటారు.

గల్ఫ్ లేఖ

ప్రభుత్వ విధానాలను ప్రజలలోకి ప్రభావశీలంగా తీసుకువెళ్లేందుకు అధికార పార్టీ అంకితభావంతో కృషి చేస్తేనే రాజకీయ ప్రయోజనాలు సమకూరుతాయి. తెలంగాణలో ప్రభుత్వం సమర్థంగా పనిచేస్తున్నా అందుకు తగినట్లుగా ప్రజాదరణ పొందలేకపోతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో జనహిత యాత్ర పేరిట కాంగ్రెస్ నాయకత్వం ప్రజల మధ్యకు వెళ్లేందుకు పూనుకోవడం ముదావహం. జిల్లాలలో పార్టీ స్థానిక నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధుల మధ్య సమన్వయాన్ని పెంపొందించేందుకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించి, ఆ తరువాత క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితిని బేరీజు వేసేందుకు పీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి పల్లెలు, పట్టణాలలో పర్యటిస్తే ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ తరహా కసరత్తు ఏమీ లేకుండా తెలంగాణ పీసీసీ వ్యవహారాల ఇన్‌ఛార్జీ మీనాక్షి నటరాజన్ చేపట్టిన జనహిత యాత్ర జన సమస్యల పరిష్కారానికి చేసే మేలు ఏమోగానీ కనీసం పార్టీ ఆత్మావలోకనం చేసుకోవడానికీ అయినా ఎంత వరకు దోహదం చేస్తుందో తెలియదు. అధికారిక లావాదేవీలు (పైరవీలు అని చెప్పడం సబబుగా లేదు) చేసేవారు పెరిగిపోయి నిజమైన



పార్టీ నాయకులు దాదాపుగా కరువైపోయిన రోజులివి. పార్టీ గురించి చిత్తశుద్ధితో పట్టించుకునేవారు అసలు ఉన్నారా? బహుశా, ఈ కారణానే కాబోలు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి చేపట్టిన కొన్ని సాహసోపేత చర్యలు, అమలుపరిచిన పథకాల గురించి జనాలలో ఆశించిన స్థాయిలో స్పందన లేదు.

దేశంలో ఇప్పటి వరకు కేరళతో సహా ఏ ఇతర రాష్ట్రం కూడ గల్ఫ్ దేశాలలో మరణించిన మృతులకు రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందించలేదు. ఒక్క తెలంగాణలో మాత్రమే అనేక మందికి ఇటువంటి సహాయం అందింది. అయితే గ్రామాలలో ఈ ప్రజాహిత చర్యకు సరైన ప్రచారం లభించలేదు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని కొద్ది కాలం క్రితం కలిసినప్పుడు ఈ విషయమై ప్రశ్నించాను. ప్రభుత్వాధినేతగా తాను అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజలలోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ నాయకులదని ఆయన మందహాసంతో సమాధానమిచ్చారు. ఇది ఆయన మనోగతాన్ని కొంతవరకు విశదీకరించింది.

విదేశాలలో మంచి స్థితిలో ఉన్న ప్రవాసుల కంటే స్వదేశంలో వారిపై ఆధారపడి ఉన్న కుటుంబాలు లక్ష్యంగా బీజేపీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. భారత్‌లో యూరియా, ఇతర ఎరువుల కొరత దృష్ట్యా వాటి దిగుమతి తీరును పరిశీలించడానికి సౌదీ అరేబియాకు వచ్చిన (బీజేపీ అధ్యక్షుడు కూడా అయిన) కేంద్ర ఎరువుల మంత్రి జె.పి.నడ్డాకు ఒక నిమిషం కూడ తీరిక లేదు. అయినా ఆయన తన పార్టీ మద్దతుదారుల కొరకు కొంత సమయాన్ని కేటాయించారు. అంతకు ముందు వ్యక్తిగత పని నిమిత్తం దుబాయి పర్యటనకు వచ్చిన నితిన్ గడ్కరీ, బీజేపీకి మద్దతునిచ్చే ప్రవాస ప్రముఖులు అందరినీ విందుకు ఆహ్వానించారు. ధర్మపురి అర్వింద్ వచ్చినప్పుడల్లా కార్యకర్తలను ఉత్తేజపరుస్తారు. కాంగ్రెస్ విషయానికి వస్తే, కేరళ ముఖ్యనాయకులు అందరూ తరుచుగా సందర్శిస్తూ తమ పార్టీ ప్రవాస విభాగాన్ని పటిష్ఠ వ్యవస్థగా తీర్చిదిద్దారు. గల్ఫ్‌లోని పార్టీ నాయకులతో సంప్రదింపులలో ఉండే పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ త్వరలో పార్టీ కార్యక్రమం ఒకదానిలో పాల్గొనేందుకు కువైత్‌కు రానున్నారు. తెలంగాణ ప్రభుత్వం గల్ఫ్ మృతులకు అందించిన ఆర్థిక సహాయంపై వివరాలతో వెళ్ళి ప్రజలకు తెలియజేసే ప్రయత్నం చేసిన ఒక ప్రవాస కాంగ్రెస్ నాయకుడిని నిజామాబాద్ జిల్లాలో ప్రతిపక్ష భారాస కార్యకర్తలు బట్టలు విప్పి కొట్టారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆ ప్రవాస నాయకుడిని కనీసం పరామర్శించే తీరిక కూడ తెలంగాణ పీసీసీ నాయకులకు లేకుండా పోయింది.

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అగ్రనాయకులు తరుచు దుబాయి పర్యటనలకు వస్తున్నా, స్థానికంగా ఉన్న కాంగ్రెస్ మద్దతుదారులను కనీసం కలువడానికి కూడా ఇష్టపడరు. వారిని వీలయినంత దూరంగా ఉంచుతారు. నాయకుల ఇటువంటి వైఖరి వల్లే ప్రజలూ పార్టీలనూ అధికారం నుంచి దూరంగా ఉంచుతున్నారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తమ జనహిత యాత్రలో ఈ సత్యాన్ని గ్రహిస్తే చాలు.

■ **మొహమ్మద్ ఇర్ఫాన్**
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ప్రశ్నార్థకమవుతున్న ఈసీ విశ్వసనీయత



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'భారతదేశంలో ఎన్నికల కమిషన్ (ఈసీ) చచ్చిపోయింది..' అని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. 2024 ఎన్నికల్లో ఒక లోక్‌సభ నియోజకవర్గంలో 1.5 లక్షల మంది నకిలీ ఓటర్లు ఉన్నారని తమ దర్యాప్తులో తేలిందని, ఈ విషయాన్ని సాక్ష్యాధారాలతో సహా త్వరలో నిరూపిస్తామని ఆయన ప్రకటించారు. అనేక విషయాల్లో రాహుల్‌గాంధీ అడపాదడపా చేసే ఆరోపణలు సంచలనాత్మకంగా ఉంటున్నాయి. అవి, కొన్నిసార్లు న్యాయస్థానం విమర్శలకు గురైనప్పటికీ ఎన్నికల కమిషన్‌పై ఆయన చేసిన వ్యాఖ్యలు సర్వత్రా చర్చనీయాంశమవుతున్నాయి. ఇదే సమయంలో బిహార్‌లో ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) జరుగుతున్న తీరుపై కొద్ది రోజులుగా పార్లమెంట్ ఉభయ సభలు స్తంభించిపోయాయి. ఎన్నికల కమిషన్ పనితీరుపై పార్లమెంట్‌లో చర్చించడం సంప్రదాయాలకు విరుద్ధమని, గతంలో బలరాం జాఖడ్ స్పీకర్‌గా ఉన్నప్పుడు ఈ మేరకు రూలింగ్ ఇచ్చారని ఉభయ సభల అధిపతులు వాదిస్తున్నారు. అయినప్పటికీ బిహార్‌లో జరుగుతున్న ఎస్ఐఆర్‌ను ప్రతిపక్షాలు అంత సులభంగా వదిలిపెట్టే అవకాశాలు కనిపించడం లేదు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తులు కూడా ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కేసుపై విచారణలో ఎస్ఐఆర్ జరుగుతున్న తీరుపై పలు ప్రశ్నలు లేవనెత్తారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఎన్నికల గుర్తింపు కార్డు మొదలైన వాటిని పరిగణనలోకి తీసుకోకుండా ఎన్నికల కమిషన్ ఓటర్ల పౌరసత్వంపై దృష్టి కేంద్రీకరించడం, కొత్త ఓటర్లను చేర్చుకోవడం కాకుండా ఉన్న ఓటర్లను జాబితా నుంచి తొలగించడంపై సుప్రీంకోర్టు సందేహాలు వ్యక్తం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రకారం ఎన్నికల జాబితాలో నమోదు చేసుకోవాలంటే ఒక వ్యక్తికి భారతీయ పౌరసత్వం ఉండాలని, కేవలం భారతీయ పౌరులనే ఓటర్లుగా చేర్చుకోవడం తమ బాధ్యత అని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. ఓటర్లుగా నమోదు కావాలంటే 11 డాక్యుమెంట్లు సమర్పించాలని, 1987 నుంచి 2004 మధ్య పుట్టినవారు తమ తల్లిదండ్రుల్లో ఒకరి డాక్యుమెంట్‌ను, 2004 తర్వాత పుట్టినవారు తల్లి, తండ్రి ఇరువురి డాక్యుమెంట్లనూ సమర్పించాలని చెబుతోంది. కేంద్రం జారీ చేసిన ఆధార్, తాము జారీ చేసిన ఎన్నికల గుర్తింపు కార్డులను కూడా ఈసీ పరిగణనలోకి తీసుకోవడం లేదు.

పౌరసత్వం ఆధారంగా ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయడం పేరుతో ఎన్నికల కమిషన్ అధికార పార్టీని గెలిపించేందుకు ప్రయత్నిస్తోందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. పౌరసత్వ సర్టిఫికెట్ జారీ చేయడం ఎన్నికల కమిషన్ పని కాదని, ఎన్నికలను పర్యవేక్షించే, నిర్వహించే రాజ్యాంగ బాధ్యత మాత్రమే కమిషన్‌కు ఉన్నదని మాజీ ఎన్నికల కమిషనర్ అశోక్ లావాసా కూడా వాదిస్తున్నారు. నిజానికి 2025లో ఓటర్ల జాబితా ప్రకటించేందుకు ముందే ఓటర్ల జాబితా సమగ్ర సవరణ చేసి ఉంటే ఎన్నికల కమిషన్ ఇంత వివాదంలో ఇరుక్కునేది కాదు. బిహార్‌లో ఎన్నికలు సరిగ్గా రెండు మూడు నెలల్లో జరుగుతాయనగా ఆగమేఘాలపై కేవలం నెలలోపు ఈ సవరణ చేసేందుకు పూనుకోవడమే కమిషన్ నిజాయితీని శంకించేలా చేస్తోంది.

ఒక రాజ్యాంగ సంస్థ అయిన ఎన్నికల కమిషన్ దేశంలో చాలా కాలంగా వివాదంలో ఉంటూనే వస్తోంది. 1990లో టీఎన్ శేషన్ ప్రధాన ఎన్నికల కమిషనర్ అయిన తర్వాత ఎన్నికల వ్యవస్థలో ఎన్నో కీలక మార్పులు తీసుకువచ్చారు. డబ్బు, మద్యం పంపిణీ, ఓటర్లను ప్రలోభపెట్టడం, గోడలపై రాతల్ని రాయడంతో పాటు ఎన్నికల ప్రసంగాల్లో మతాన్ని ఉపయోగించడాన్ని కట్టుదిట్టంగా అరికట్టారు. ఓటర్ల ఐడీ కార్డులను, ప్రవర్తనా నియమావళిని ప్రవేశపెట్టారు. ఎన్నికల ఖర్చులపై పరిమితిని విధించారు. ఎన్నికలకు ఎన్ని వాహనాలు ఉపయోగించారో కూడా అభ్యర్థులు లెక్క చెప్పాల్సి వచ్చేది. రిటర్నింగ్ అధికారులు ఈ వాహనాల మీటర్లను చెక్ చేసి ఎన్నికల ఖర్చులపై రోజువారీ లెక్కలతో సరిపోల్చేవారు. ఎన్నికల ముందు యూపీతో పాటు అనేక రాష్ట్రాల్లో 3లక్షల మందికి పైగా రౌడీషీటర్లని ముందస్తు అరెస్టులు చేయించిన శేషన్ ఒక దశలో ఓటర్లను ప్రలోభపెట్టినందుకు ఇద్దరు కేంద్రమంత్రులను తొలగించాల్సిందిగా ప్రధానమంత్రికే తాఖీదు పంపారు. శేషన్ హయాంలో పోలింగ్ బూత్‌ల స్వాధీనం, ఎన్నికల సంబంధిత దాడులు, దొమ్మీలు, హత్యలు 90 శాతం పైగా తగ్గిపోయాయి. ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాలన్న విషయంపై ఆయనే స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకున్నారు. 'ఇప్పటి వరకూ రాజకీయ నాయకులు చాలా చెత్తపనులన్నీ చేశారు. నేను ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా ఉన్నంతకాలం ఎన్నికలు ఎలా నిర్వహించాలో నేనే నిర్ణయిస్తాను..' అని శేషన్ ప్రకటించారు. 'ఈ శేషన్ ఘటోత్కచుడిలా ఉన్నాడే..' అని మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కూడా ఒక సందర్భంలో వ్యాఖ్యానించారు. ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో ఎన్నికల వ్యవస్థకు విశ్వసనీయత సాధించినందుకు ఆయనకు రామన్ మెగసెసే అవార్డు లభించింది.

కాని శేషన్ అనంతరం మళ్లీ పరిస్థితులు క్రమంగా మొదటికి రావడం ప్రారంభమైంది. యూపీఏ ప్రభుత్వ హయాంలోనూ నవీన్ చావ్లా వంటి అస్మదీయులను కమిషనర్లుగా నియమించారు. శేషన్ ప్రవేశపెట్టిన సంస్కరణలు, కట్టుదిట్టంగా అమలు చేసిన నిబంధనలన్నీ ఇప్పుడు నీరుకారినట్లు అనిపిస్తున్నాయి. అన్ని వ్యవస్థల మాదిరే ఎన్నికల కమిషన్ విశ్వసనీయత కూడా ప్రశ్నార్థకంగా కనిపిస్తోంది. డబ్బు, మద్యం, రెచ్చగొట్టే ఉపన్యాసాలతో పాటు అనేక అవలక్షణాలు ఎన్నో మళ్లీ ప్రవేశించాయి. అధికారంలో ఉన్న రాజకీయనాయకుల ఆగడాలపై శీతకన్ను వేసే పరిస్థితి స్పష్టంగా కనపడుతోంది.

గత కొన్నేళ్లుగా ఎన్నికల కమిషన్‌పై రకరకాల ఆరోపణలు వస్తున్నాయి. పోలైన ఓట్ల శాతాన్ని ప్రకటించడంలో విపరీతమైన ఆలస్యం చేయడం, అంచనాలను అధిగమించి అత్యధిక ఓట్లు పోలయ్యాయని ప్రకటించడం, లెక్కపెట్టిన ఓట్లు, పోలైన ఓట్లకు పొంతన లేకపోవడం, ఓటర్ల జాబితాలో పేర్లు మాయం కావడం లాంటి అనేక ఆరోపణలు వచ్చాయి. 2014 నుంచీ ఇప్పటి వరకూ ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అంతర్గత కారణాల వల్ల కమిషన్‌కు రాజీనామా చేసి వెళ్లడం కూడా కొట్టిపారేయదగిన విషయం కాదు. 2018లో మధ్యప్రదేశ్‌లోను, 2024లో మహారాష్ట్రలోనూ భారీ ఎత్తున బోగస్ ఓటర్లను చేర్చారన్న ఆరోపణలు వచ్చాయి. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూడా అక్రమాలు జరిగాయని రాహుల్‌గాంధీ ఇప్పుడు ఆరోపిస్తున్నారు. బిహార్‌లో ఎస్ఐఆర్‌ను నిర్వహిస్తున్న వేలాది మంది స్థానిక ఈఆర్‌ఓలు, క్రింది స్థాయి సిబ్బంది ఓటర్ల జాబితాలో చేసే మార్పులపై ఇప్పుడు ప్రతిపక్షాలు దృష్టి సారిస్తున్నాయి. ఎన్నికల కమిషన్ విశ్వసనీయత మాట అటుంచితే తాము ఓడిపోయినందుకు కారణాలు వెతుక్కోవడం ప్రతిపక్షాల నైజం. గతంలో బీజేపీ కూడా ఓడిపోయినప్పుడల్లా ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించేది. అదే సమయంలో తాము గెలిచిన నియోజకవర్గాల్లో అక్రమాలు జరిగాయని ఏ పార్టీ ఆరోపించదనేది సత్యం.



బిహార్‌లో 2025 జనవరిలో ప్రకటించిన జాబితా ప్రకారం 7.80కోట్లుగా ఉన్న ఓటర్లు, ఆగస్టు 1న ప్రకటించిన ఎస్ఐఆర్ తొలి జాబితా ప్రకారం 7.24 కోట్లకు తగ్గిపోయారు. సెప్టెంబర్ 1న ప్రకటించే మలి జాబితాలో ఇప్పుడున్న ఓటర్లలో ఎంతమంది అదృశ్యమవుతారో?! ఎన్నికల వ్యవస్థలో అక్రమాలు సంభవించకుండా చూడవల్సిన ఎన్నికల కమిషన్ స్వయంగా వివాదాలకు గురైతే ప్రజాస్వామ్యం పై ప్రజలకు నమ్మకం పోదా?

ఎన్నికల్లో ఒక పార్టీ ఓడిపోవడానికి ప్రజా వ్యతిరేకత ప్రధాన కారణం. ప్రజా వ్యతిరేకత ఏ మాత్రం ఉన్నా మిగతా కారణాలు కూడా ఆ పార్టీ ఓటమిని మరింత బలపడేలా చేస్తాయి. చాలా చోట్ల ప్రజలు తమ వ్యతిరేకతను పైకి వ్యక్తం చేయరు. 'నా నియోజకవర్గంలో ఒక గ్రామంలో నేను ఎప్పుడు వెళ్లినా నన్ను ప్రేమగా బిడ్డా అని పలకరించే ఒక వృద్ధురాలు ఈ సారి నన్ను చూడగానే ముఖం తిప్పుకుంది. దీనితో నేను ఓడిపోతానని అర్థమైంది' అని సీనియర్ కాంగ్రెస్ నేత జైపాల్‌రెడ్డి ఒక సందర్భంలో చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాయలసీమలో కూడా వైసీపీ తుడిచిపెట్టుకుపోవడం ప్రజా వ్యతిరేకతకు నిదర్శనం. ప్రజా వ్యతిరేకత తీవ్రంగా ఉంటే సామాజిక వర్గాలు, ప్రలోభాలు, అధికార దుర్వినియోగం, మతతత్వ పోకడలు కాపాడలేవనేది సత్యం.

ఆగస్టు 1న ప్రకటించిన బిహార్ ఓటర్ల ముసాయిదా జాబితాలో 66 లక్షల మందిని తొలగించారు. వారిలో ఫారాలు సమర్పించనివారు, మరణించినవారు, వలస వెళ్లినవారు, డూప్లికేట్ ఓటర్లు ఉన్నారు. బిహార్‌లో బంగ్లాదేశీయులు, రోహింగ్యాలు, నేపాలీ చొరబాటుదారులు ఎంత మంది ఉన్నారో ఎన్నికల కమిషన్ ప్రకటించలేదు. దేశంలో ఎక్కడైనా 18 సంవత్సరాలు దాటినవారు ప్రతిసారీ పెద్ద ఎత్తున ఓటర్ల జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకుంటారు. అయితే బిహార్‌లో మాత్రం ప్రతి ఎన్నికలకూ ఓటర్ల సంఖ్య పెరుగుతూ ఉంటే ఈసారి ఓటర్ల సంఖ్య తగ్గినట్లు స్పష్టమవుతోంది. 2025 జనవరిలో ప్రకటించిన జాబితా ప్రకారం 7.80కోట్ల ఓటర్లు ఉంటే ఇప్పుడు ప్రకటించిన ఎస్ఐఆర్ తొలి జాబితా ప్రకారం 7.24 కోట్ల మందికి తగ్గిపోయారు. సెప్టెంబర్ 1న ప్రకటించే మలి జాబితాలో ఇప్పుడున్న ఓటర్లలో ఎంతమంది అదృశ్యమవుతారో చెప్పలేం. బిహార్ ఎస్ఐఆర్ చిలికిచిలికి గాలివానగా మారి దేశ రాజకీయాలను తీవ్రంగా ప్రభావితం చేసే అవకాశాలు లేకపోలేదు.

ఎన్నికల వ్యవస్థలో అక్రమాలు సంభవించకుండా చూడవల్సిన బాధ్యత ఉన్న ఎన్నికల కమిషన్ స్వయంగా వివాదాలకు గురైతే దేశంలో ప్రజాస్వామ్యంపై ప్రజల నమ్మకం పోతుంది. గత ఏడాది చండీగఢ్‌లో ఒక రిటర్నింగ్ అధికారి మేయర్ ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించి పట్టుబడ్డారు. అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ ఈ రిటర్నింగ్ అధికారి క్షమాపణతో సంతృప్తి చెంది శిక్ష విధించకుండా వదిలిపెట్టారు. ఆ అధికారే మళ్లీ నామినేటెడ్ కౌన్సిలర్‌గా ఆరు నెలల్లో మున్సిపల్ కార్పొరేషన్‌లో అడుగుపెట్టారు. తెలంగాణలో ఒక సీఈఓ హయాంలో మిస్సింగ్ ఓట్లు, పోలయిన ఓట్ల విషయంలో రెండుసార్లు తీవ్ర ఆరోపణలు వస్తే ఆయన క్షమాపణలు చెప్పి ఊరుకున్నారు. ఆధునిక భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఇలాంటి ప్రహసనాలు మనకెన్నో ఎదురవుతాయి.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ఇప్పుడు గద్దర్ ఉండాల్సింది!

ఆపదలో అయినవాళ్లు యాదికొస్తారంటారు. నేడు తాము ఎదుర్కొంటున్న విపత్కర పరిస్థితులలో తాడిత పీడిత ప్రజలు, మరీ ముఖ్యంగా ఆదివాసులు, ఇప్పుడు గద్దర్ ఉంటే ఏమి చేసేవాడు అని తమవైన అనుభవాల్లోంచి ఊహించుకుంటున్నారు. ఏడాది కాలంగా గద్దర్ ఫౌండేషన్ కార్యకలాపాలలో భాగంగానూ, ఎన్‌కౌంటర్లలో అమరులైన వారి కుటుంబాలను పరామర్శిస్తూనూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అనేక గ్రామాలు తిరిగాను. ఎక్కడికి వెళ్లినా– పాలక ప్రభుత్వాల అమానవీయ చర్యలను ప్రజలు నిరసిస్తున్నారు. గద్దర్ ఉంటే ఇలా ఉండేది కాదంటున్నారు.

ఇలా గద్దర్ లేని లోటు కొంచెం కొంచెంగా ప్రజలకు, ముఖ్యంగా సామాజిక కార్యకర్తలకు, అనుభవంలోకి వస్తున్నది.

ఈ దేశ ప్రజా సంస్కృతిపై ఒక కళాకారుడిగా గద్దర్ వేసిన ప్రభావం ఎనలేనిది, మరొకరు పూడ్చలేనిది. ప్రజా కళాకారుడిగా ఆడి పాడటమే కాదు, తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర సాధన తర్వాతి కాలంలో కూడా సామాజిక సమస్యలను, విషయాలను పట్టించుకొని, పాలకుల అపసవ్య విధానాలకు వ్యతిరేకంగా తాను కదలటమే గాక మొత్తం సమాజాన్ని కదిలించాడు. సామాజిక చారిత్రక సందర్భానుసారంగా కలిసి వచ్చే శక్తులను, వ్యక్తులను ఏకం చేసి అనేక ఐక్య ఉద్యమాలను నిర్మించాడు. పార్టీలను, ప్రజా సంఘాలను ఏకతాటి మీదికి తెచ్చి ప్రజాస్వామిక విలువల కోసం నిరంతరం ఉద్యమించాడు.



ఈ మధ్యన మావోయిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి నంబాళ్ల కేశవరావు ఒక ఎన్‌కౌంటర్‌లో చనిపోతే ఆయన మృతదేహాన్ని ఇవ్వకుండా ప్రభుత్వాలు అమానవీయంగా వ్యవహరించాయి. బతికి ఉన్నప్పుడు ప్రభుత్వాల దృష్టిలో అతను ఏమైనా కావచ్చు, చనిపోయిన తర్వాత ఆ శవాన్ని వారి కుటుంబీకులకు అప్పగించి సంప్రదాయబద్ధంగా దహన సంస్కారాలు చేసుకునేందుకు వీలు కల్పించటం కనీస మానవీయత. దాన్ని కూడా పాటించకుండా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న గడ్డు కాలం ఇది. గద్దర్ ఉన్నప్పుడు ఎన్‌కౌంటర్లలో చనిపోయిన విప్లవకారుల మృతదేహాలను కుటుంబాలకు చేర్చటానికి ఎంతో కృషి చేశాడు. ఆ క్రమంలో పోలీసులతో, ప్రభుత్వాధినేతలతో తీవ్రంగా ఘర్షణపడ్డాడు. ప్రజాస్వామికవాదులు అందరినీ ఏకం చేసి శవాల స్వాధీన కమిటీ పేర గొప్ప మానవీయ కార్యాన్ని నెరవేర్చాడు.

నేడు ఆదివాసులు గతంలో ఎన్నడూ లేని విధంగా కష్టనష్టాల పాలవుతున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ కగార్ పేరుతో, మావోయిస్టుల ఏరివేత అంటూ ఆదివాసులపై యుద్ధం ప్రకటించాయి. అడవులను ఆక్రమిస్తూ ఆదివాసులకు నిలువ నీడ లేకుండా చేస్తున్నాయి. లక్షల మంది పోలీసులు, పారా మిలిటరీ బలగాలతో ఆదివాసీ ప్రాంతాలను చెరబట్టి అమాయక ఆదివాసులను అక్రమంగా జైళ్లలో నిర్బంధిస్తున్నారు. ఎదురుకాల్పుల పేరిట హత్య చేస్తున్నారు. గద్దర్ జీవితాంతం ఆదివాసుల హక్కుల కోసం పోరాడారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై, దోపిడీ పీడనలపై పాటలు రాశాడు. ఆదివాసుల సంస్కృతి, జీవనం, వారిపై అమలవుతున్న అణచివేతలపై ఓ బ్యాలే రాశాడు. అడవిపై ఆదివాసులది జన్ మహక్కు అని చాటి చెప్పాడు. నేడు ఈ మానవ హనన కాలంలో నేడు గద్దర్ ఉండివుంటే సమాజాన్నంతా కదిలించి ప్రజలకు అండగా నిలిచేవాడంటూ ప్రజలు గద్దర్ లేని లోటును చూస్తున్నారు, అనుభవిస్తున్నారు.

మునుపెన్నడూ లేని స్థాయిలో ఇవ్వాళ పౌర ప్రజాస్వామిక హక్కులకు ప్రమాదం ఏర్పడింది. సర్వత్రా రాజ్యాంగ స్ఫూర్తి, విలువలు తుంగలో తొక్కబడుతున్నాయి. ఈ నేపథ్యంలోంచే గద్దర్ రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమాన్ని చేపట్టాల్సి వచ్చింది. కాబట్టి ప్రజాస్వామ్య ప్రేమికులారా గద్దర్ ఆశయాల వెలుగులో పయనిద్దాం. రాజ్యాంగ విలువల పరిరక్షణకై ఉద్యమిద్దాం. ఆదివాసులపైనా, ప్రజలపైనా కొనసాగుతున్న అన్ని రకాల అణచివేతలను నిరసిద్దాం.

■ **సూర్యకిరణ్**
గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి

(నేడు గద్దర్ ద్వితీయ వర్ధంతి)

మానవత్వానికి మచ్చ చుండూరు ఘటన!


ప్రపంచ చరిత్రలో మానవత్వానికి మచ్చగా చెప్పే ఘటనల్లో చుండూరు ఒకటి. మనుషుల్ని దారుణంగా చంపి, గోనెసంచిలో కట్టి నీళ్ళలో విసరడం, అగ్రకులం వారి అధికార అహంకారానికి నిదర్శనం. ఆ మారణకాండ జరిగిన రోజు 1991 ఆగస్టు 6.

గుంటూరు జిల్లా, తెనాలి మండలంలో ఒక అభివృద్ధి చెందిన గ్రామం చుండూరు. అక్కడ, దాని పరిసర ప్రాంతాలలో రెడ్ల ఆధిపత్యం అధికంగా ఉండేది. అక్కడ మాలలు బాగా చదువుకుని, రైల్వే మొదలైన ప్రభుత్వ సంస్థలలో పాటు, మార్కెట్ ప్రాంతమైన తెనాలిలో చిన్న చిన్న ఉద్యోగాలు సంపాదించుకుని గౌరవప్రదమైన జీవితాలు గడుపుతూ ఉండేవారు. అగ్రవర్ణాల మీద ఆధారపడే అవసరం లేకపోవడంతో, వీరి మీద అజమాయిషీ చెలాయించే అవకాశం లేక ఆ అగ్రకులస్థుల అహంకారం దెబ్బతిన్నది.

అప్పటికే మాలల సామాజిక చైతన్యాన్ని చూసి ఓర్వలేకపోతున్న అగ్రకులస్థులు, రవి అనే ఒక దళిత పోస్ట్‌గ్రాడ్యుయేట్ యువకుడు చూపించిన ఆత్మాభిమానాన్ని జీర్ణించుకోలేకపోయారు. 1991 జూలై 7న సినిమా హాలులో పొరపాటున కుర్రి శ్రీనివాస్‌రెడ్డి అనే యువకుడి కాలుకి రవి కాలు తగిలింది. పొరపాటున జరిగిందని చెబుతున్నా వినకుండా, "మీకు కొంచెం చదువు అబ్బగానే కళ్లు నెత్తికొచ్చాయి" అంటూ దూషించడంతో, రవి ఎదురు తిరిగి ఘర్షణ పడ్డాడు. ఆ గొడవలో శ్రీనివాస్‌రెడ్డిని రవి కొట్టాడు. అహం దెబ్బతిన్న అగ్రకులస్థులంతా కలిసి మాలలను సాంఘికంగా బహిష్కరించాలని తీర్మానం చేసి, వారి భూముల్లో ఆ ఊరి దళితులను పనిచేయనివ్వరాదని నిర్ణయించారు. పైగా దళితులను వారి నివాస ప్రాంతాల్లో రోడ్ల మీద నడవడాన్ని కూడా నిషేధించారు.

జూలై 12న చుండూరు అగ్రకులస్థులు మోదుకూరు, దండిపాలెం, వలివేరు మొదలైన గ్రామాల వారిని కలుపుకుని మాలపల్లిపై దాడి చేశారు. ఆ దాడిని తిప్పికొట్టడంతో అగ్రకులాలు చెల్లాచెదురై పారిపోయాయి. దీంతో కండబలంతో మాలలను ఎదుర్కోలేమని గ్రహించి, పోలీసుల సాయంతో పథకం వేశారు. ఆగస్టు 4న రాజాబాబు అనే కుర్రాడు టీ కొట్టు దగ్గర పేపరు చదువుతుండగా, తమ అమ్మాయిలను ఏడిపించాడనే నెపం వేసి, తీవ్రంగా కొట్టి, తిరిగి వాళ్ళే పోలీసు రక్షణ కోరి మాలపల్లెని పోలీసు నిర్బంధంలో ఉండేలా చేశారు. అదే అదునుగా భావించి ముందుగా అనుకున్న పథకం ప్రకారం పోలీసు వారి సాయంతో చుండూరు, మోదుకూరు మొదలైన గ్రామాల అగ్రకులస్థులు బృందాలుగా ఏర్పడి, ఇనుపరాడ్లు, కత్తులు, గొడ్డళ్ళతో సిద్ధంగా ఉన్న చోటికే దళితులను తరిమారు. ఈ విషయం తెలియక, అటువైపే పరుగులు తీసి వారికి దళితులు చిక్కారు.

కొత్త కాల్వకట్ట మీద దళితులను తరుముకుంటూ వెళ్ళిన హంతక మూకకు ఒకటో నెంబరు పిల్ల కాల్వ వద్ద మంద్రు రమేష్ దొరికాడు. అతడిని దారుణంగా హత మార్చి మృతదేహాన్ని పిల్లకాల్వలో పడేశారు. తర్వాత రెండు హంతక మూకలూ మోదుకూరు రైల్వేగేటు దగ్గర కలుసుకున్నాయి. అక్కడ వారు జాలాది ఇస్సాకు, అంగలకుదురు రాజమోహన్, సంకురు సంసోను, దేవరపల్లి జయరాజ్‌లను చుట్టు ముట్టి హతమార్చారు. శవాలను దగ్గరలోనే ఉన్న ఒక పశువుల కొట్టంలోకి ఈడ్చుకెళ్ళారు, గోతాల్లో కుక్కి కట్టేశారు. నాలుగు శవాలనూ వేర్వేరు చోట్ల కాల్వల్లో పడేశారు.



మిగతావారు తప్పించుకుని పారిపోయి ఉంటారనుకున్నా, ఆగస్టు 8న అంగలకుదురు జాలాది ముత్తయ్య శవం ఉన్న గోతాం తుంగభద్ర కాలువలో దొరకడంతో, అనుమానం వచ్చి మిగతావారి కోసం వెతకగా, కొంచెం దూరంలో మల్లెల సుబ్బారావు శవం ఉన్న మూట దొరికింది. అక్కడి నుంచి పది మీటర్ల దూరంలో ఉన్న ఇంటూరి లాకుల వద్ద జాలాది ఇమ్మాన్యుయేల్, మంద్రు రమేష్ మృతదేహాలున్న మూటలు, ఇంకొంచెం దూరంలో మోదుకూరు–ఆలపాడు రోడ్డు దగ్గర ఒక పంట కాలువలో సంకూరు సాంసోను శవం ఉన్న గోనెసంచి దొరికాయి.

చుండూరు ఘటన ఎన్నటికీ చెరగని గాయం. దళితజాతికి వ్యథను మిగిల్చిన ఆ ఘటన సాక్షిగా దళితులంతా మరింత చైతన్యవంతం కావాలి. నాటి త్యాగాల స్ఫూర్తితో సమైక్యంగా ముందుకు సాగాలి.

● **బత్తుల వీరాస్వామి**
రాష్ట్ర అధ్యక్షులు, అంబేద్కర్ యువజన సంఘం



కలెక్టరే కర్షకుడై..

నిత్యం సమీక్షలు, సమావేశాలతో బిజీగా గడిపే కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం కర్షకుడి అవతారమెత్తారు. తలకు పాగా చుట్టి, పంట పొలంలోకి దిగి, రైతులతో ముచ్చట్లాడుతూ వరినాట్లు వేశారు. గుంటుపల్లిలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం జరగ్గా, ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. సాగుపరంగా ఎలాంటి ఇబ్బంది ఉన్నా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ 9154970454 నెంబరు అందుబాటులో ఉంటుందని రైతులకు భరోసా ఇచ్చారు. అనంతరం రైతు జి.రవీంద్రనాథ్ ఠాగూర్ పొలంలో నాట్లు వేశారు. - ఇబ్రహీంపట్నం



సంజీవనికి జీవం

మల్లవల్లి పారిశ్రామికవాడలో సిద్ధమవుతున్న 104 వాహనాలు

పేదలకు 47 రకాల సేవలు అందించేలా రూపకల్పన



మల్లవల్లి పారిశ్రామికవాడలో రూపుదిద్దుకుంటున్న సంజీవని వాహనాలు

(ఆంధ్రజ్యోతి, హనుమాన్‌జంక్షన్ రూరల్): పల్లెల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. గత వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన 108, 104 వాహనాలకు జీవం పోసేందుకు సిద్ధమైంది. సంజీవని పేరుతో ప్రజల వద్దకు 104 వాహనాలను తీసుకురానుంది. దీనికి సంబంధించిన ప్రక్రియ మల్లవల్లి పారిశ్రామికవాడలో చురుగ్గా జరుగుతోంది. ప్రకాశవంతమైన పసుపు, ఎరుపు రంగుల్లో ఆకర్షణీయంగా సంజీవని వాహనాలను తయారు చేస్తున్నారు. విజయవాడకు చెందిన భవ్య హెల్త్ కేర్ సర్వీసెస్ వారి ఆధ్వర్యంలో సంజీవని వాహనాలు నూతన రూపు సంతరించు కుంటున్నాయి. 104 వాహనంలో 47 రకాల రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించేలా అత్యాధునిక సాంకేతిక పరికరాలను కూడా అమరుస్తున్నారు. ఆరోగ్య సమాచారం, తల్లీబిడ్డ ఆరోగ్య సంరక్షణ వంటి వైద్య సేవలతో పాటు తాగునీటి పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన వ్యవస్థను కూడా సిద్ధం చేస్తున్నారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, సత్యకుమార్ చిత్రాలతో కూడిన సంజీవని వాహనాలు త్వరలో ప్రజాసేవ చేసేందుకు గ్రామాలకు రానున్నాయి.

ఐతవరం-అంబారుపేట ట్రాఫిక్ సమస్యకు చెక్

బైపాస్ నిర్మాణానికి కేంద్రం హామీపై హర్షాతిరేకాలు

- హైదరాబాద్-విజయవాడ ఎన్‌హెచ్ 65 విస్తరణలో భాగం
- ఇక మునేటికి భారీ వరద వచ్చినా ఇబ్బంది ఉండదు



కీసర వంతెన-ఐతవరం జాతీయ రహదారిపై మునేరు ప్రవాహం (ఫైల్)

(ఆంధ్రజ్యోతి, కంచికచర్ల) : నందిగామ మండలం ఐతవరం, అంబారుపేట గ్రామాల మధ్య బైపాస్ రోడ్డు విస్తరణకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఏటా మునేటికి వరద వచ్చినప్పుడల్లా ఈ గ్రామాల మధ్య జాతీయ రహదారి మునిగి పోతోంది. ప్రమాదకరంగా మారుతోంది. ట్రాఫిక్ భారీగా స్తంభిస్తోంది. తాజాగా ఇక్కడ బైపాస్ రోడ్డు నిర్మాణానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఈ సమస్యలకు చెక్ పడినట్టు అయ్యింది. కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవలే హైదరాబాద్-విజయవాడ ఆరు వరసల విస్తరణ గురించి మిగతా 6లో..

విస్తరణతో సమస్యకు పరిష్కారం

తాజాగా హైదరాబాదు-విజయవాడ మధ్య 65వ నెంబరు జాతీయ రహదారి అభివృద్ధికి కేంద్రం పచ్చజెండా ఊపింది. ఇప్పుడున్న నాలుగు వరసల రోడ్డును ఆరు వరసలుగా విస్తరించనున్నారు. ఈ జాతీయ రహదారి ఐతవరం, అంబారుపేట గ్రామాల మీదుగా వెళ్తుంది. విస్తరణలో భాగంగా ఈ రెండు గ్రామాల వద్ద బైపాస్ రోడ్డును నిర్మించనున్నారు. రెండు రోజుల క్రితం మంగళగిరిలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి గడ్కరీ ఈ బైపాస్ రోడ్డు గురించి ప్రస్తావించారు. ఈ బైపాస్ రోడ్డు నిర్మిస్తే మునేటికి ఎంత వరద వచ్చినా ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

రూ.500 దర్శనం రద్దు చేద్దామా?



- మేము హైదరాబాద్ నుంచి వచ్చాం. రూ.500 టికెట్ తీసుకుంటే అమ్మవారి దర్శనం త్వరగా అవుతుందని చెప్పారు. ఇప్పటికి క్యూలోకి వచ్చి మూడు గంటలు అవుతుంది. మాకు దుర్గమ్మ దర్శనం కాలేదు. ఇతర క్యూల్లో వచ్చిన భక్తులు దర్శనం చేసుకుని వెళ్లిపోతున్నారు. గత శరన్నవరాత్రుల్లో ఇంద్రకీలాద్రిపై భక్తులు వ్యక్తం చేసిన ఆగ్రహం ఇది.
- 'ఈవో డౌన్‌డౌన్..' అంటూ భక్తుల నినాదాలు. 2023 శరన్నవరాత్రుల్లో రూ.500 క్యూలో భక్తులు చేసిన నిరసన ఇది.
- గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని.. ఏటా దసరా ఉత్సవాల్లో వస్తున్న ఇబ్బందులను గమనంలో పెట్టుకుని.. ఈసారి వేడుకల్లో రూ.500 టికెట్ దర్శనం రద్దు చేసే ఆలోచనలను అధికారులు చేస్తున్నారు.

దసరా ఉత్సవాల్లో ఇబ్బందులు లేకుండా చూసే యోచన

రూ.500 టికెట్ దర్శనం రద్దుచేసే దిశగా ఆలోచనలు

- ఏటా ఉత్సవాల్లో భక్తుల నుంచి వస్తున్న వ్యతిరేకతే కారణం
- **ఉచిత, రూ.100, రూ.300 దర్శనాల్లో త్వరగా దుర్గమ్మ దర్శనం**
- రూ.500 లైన్ మాత్రం గంటల తరబడి కదలని వైనం
- సహనం నశిస్తున్న భక్తులు.. అధికారులపై నినాదాలు
- ఈ ఉత్సవాల్లో ఆ పరిస్థితి లేకుండా చూడాలనే యోచనలు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : గత రెండు మూడేళ్ల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో రూ.500 దర్శనాలను తాత్కాలికంగా నిలుపుదల చేయాలన్న యోచనలో అధికారులు ఉన్నట్టు తెలిసింది. శరన్నవరాత్రుల్లో అంతరాలయం దర్శనం ఉండదు కాబట్టి.. ఈ క్యూకు ఉత్సవాలు ముగిసే వరకు ఫుల్‌స్టాప్ పెడితే ఎలా ఉంటుందా.. అని ఆలోచన చేస్తున్నారు. దీనిపై మరింత కసరత్తు చేశాక తుది నిర్ణయం తీసుకోవాలని అధికారులు భావిస్తున్నారు.



రూ.500 దర్శనం లైన్‌లో అవస్థలు

ఏటా శరన్నవరాత్రుల్లో ఐదు క్యూలైన్లు ఏర్పాటు చేస్తారు. వీటిలో ఉచిత దర్శనం చేసుకునే భక్తుల కోసం రెండు క్యూలైన్లు ఉంటాయి. ఈ రెండూ వినాయకుడి ఆలయం నుంచి మొదలై ఘాట్‌రోడ్డు మీదకు వస్తాయి. ఇవికాకుండా రూ.100, రూ.300, రూ.500 క్యూలను ఏర్పాటు చేస్తారు. రూ.500 క్యూలైన్ ఓం మలుపు వద్ద నుంచి ప్రారంభమవుతుంది. ఈ టికెట్ కొన్న భక్తులు ఇక్కడి నుంచే దర్శనానికి వెళ్లాల్సి ఉంటుంది. ఇదే క్యూలైన్‌కు అనుబంధంగా మీడియా పాయింట్ సమీపాన మరో క్యూ ఉంటుంది. వాస్తవానికి రూ.500 టికెట్లు తీసుకున్నవారు, ప్రొటోకాల్ జాబితాలోని వ్యక్తుల సిఫార్సులతో వచ్చే వీఐపీలు ఓం మలుపు నుంచి దర్శనానికి వెళ్లాలి. రూ.500 టికెట్లు తీసుకున్న భక్తులు మాత్రమే ఇక్కడి నుంచి దర్శనానికి వెళ్తున్నారు. సిఫార్సు లేఖలతో వచ్చినవారు నేరుగా చినరాజగోపురం వద్దకు వచ్చి అక్కడ ఉన్న క్యూలోకి వెళ్తున్నారు. దీనివల్ల ఓం మలుపు వద్ద నుంచి క్యూలోకి మిగతా 6లో..



ఎరువు.. బరువు

పెరుగుతున్న కాంప్లెక్స్ ఎరువుల ధరలతో రైతుల అవస్థలు

మూడేళ్లుగా పెంపు.. బస్తాకు రూ.250 వరకు అదనపు ఖర్చు

(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం) : ఏటా పెరుగుతున్న కాంప్లెక్స్ ఎరువుల ధరలు రైతులకు అదనపు భారమవుతున్నాయి. మూడేళ్లుగా ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ఉమ్మడి కృష్ణాజిల్లాలో సుమారు లక్షన్నర ఎకరాల్లో వరి, వేలాది ఎకరాల్లో పత్తి, ఇతర పంటలు సాగవుతున్నాయి. ఇప్పటికే 60 శాతం వరినాట్లు పూర్తిచేశారు. దీంతో పంటకు కావాల్సిన ఎరువుల కొనుగోళ్లు వేగం పుంజుకున్నాయి. అయితే, పెరిగిన కాంప్లెక్స్ ఎరువుల ధరలతో రైతులు బెంబేలెత్తుతున్నారు. ధరలు ఏకంగా బస్తాకు రూ.100 నుంచి రూ.250 మేర పెరగడం రైతులకు భారంగా మిగతా 6లో..

అదనపు భారమే..

ఎకరం వరి కలుపుతీత, పొట్టదశ తదితర సమయాల్లో యూరియా కాకుండా మూడు దఫాలుగా మరో మూడు బస్తాల వరకు కాంప్లెక్స్ ఎరువులు వేస్తారు. పెరిగిన ధరలను బట్టి చూస్తే ఒక్కో ఎకరాకు రూ.1,200 వరకు అదనపు భారం తప్పదు. జిల్లా మొత్తంగా సాగైన వరి, పత్తి విస్తీర్ణాన్ని బట్టి చూస్తే రైతులపై అదనంగా రూ.10 కోట్ల భారం పడుతుంది.

జల జగడం

ఇబ్రహీంపట్నం హెడ్ వాటర్ వర్క్సులో వివాదం

బిల్లులు ఇవ్వలేదంటున్న కాంట్రాక్టర్

- సరఫరా చేయని నీటికి ఎలా ఇస్తామంటున్న అధికారులు
- పనివారికి జీతాలు నిలుపుదల చేసిన కాంట్రాక్టర్
- 4 నెలల జీతాలు రాకపోవడంతో కార్మికుల ఆందోళన
- 120 గ్రామాల పరిధిలో 3 లక్షల మందికి మంచినీటి ఇక్కట్లు

సరఫరా చేసిన మంచినీటికి బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్.. సరఫరా చేయని నీటికి బిల్లులు ఎందుకు ఇస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల మధ్య వాదన జల జగడాన్ని సృష్టిస్తోంది. వర్కర్లకు కాంట్రాక్టర్ వేతనాలు నిలుపుదల చేయడంతో వారంతా విధులు బహిష్కరించి ఆందోళనకు దిగారు. ఇబ్రహీంపట్నం హెడ్ వాటర్ వర్క్స్ పరిధిలోని ఈ వివాదం కారణంగా 120 గ్రామాల పరిధిలోని 3 లక్షల మంది మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు.



ఇబ్రహీంపట్నం హెడ్ వాటర్ వర్క్స్ వద్ద అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కార్మికులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఇబ్రహీంపట్నం హెడ్‌వాటర్ వర్క్స్ పరిధిలోని ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, మైలవరం, రెడ్డిగూడెం, ఏ.కొండూరు మండలాలకు చెందిన మొత్తం 120 గ్రామాలకు రక్షిత మంచినీరు అందుతోంది. ఈ హెడ్ వాటర్ వర్క్స్ కాంట్రాక్టును ఓ ప్రైవేట్ సంస్థకు ఓఅండ్ఎం కింద అప్పగించారు. ఈ కాంట్రాక్టు సంస్థ నాలుగు నెలలుగా తమ దగ్గర పనిచేసే పనివారికి జీతాలు ఇవ్వట్లేదు. దీంతో కార్మికులంతా సోమవారం మెరుపు సమ్మెకు దిగారు. హెడ్ వాటర్ వర్క్స్ వద్ద ధర్నా చేపట్టారు. అక్కడే బైఠాయించి నిరవధిక ఆందోళన చేపట్టారు. దీంతో హెడ్‌వాటర్ వర్క్స్ పరిధిలోని గ్రామాల మిగతా 6లో..

ఆర్‌డబ్ల్యూఎస్ వాదన ఇలా..

కార్మికుల ఆందోళనతో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటర్ ఆడిటింగ్ నిర్వహిస్తోంది. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మంచినీటి పంపిణీలో జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. ఇబ్రహీంపట్నం హెడ్ వాటర్ వర్క్స్ పరిధిలో రికార్డు చేయని వాటికి కూడా కాంట్రాక్టు సంస్థ బిల్లులు అడుగుతోందని ఆర్‌డబ్ల్యూఎస్ అధికార వర్గాలు చెబుతున్నాయి. నిర్దేశిత లక్ష్యంలో 20 గ్రామాలకు మంచినీటిని సరఫరా చేయకుండానే.. సరఫరా చేసినట్టుగా చెబుతున్నారని, వీటికి ఎలాంటి రికార్డులు లేకుండా బిల్లులు చేయటం అసాధ్యమని అంటున్నారు.

బకింగ్‌హాంపేట పోస్టాఫీసులో ఖాతాదారుల క్యూ



సర్వర్ సమస్య

నిలిచిన తపాలా సేవలు

- కొత్త సాఫ్ట్‌వేర్‌తో అవస్థలు
- విజయవాడ రీజియన్‌లో మొదలైన కాసేపటికే డౌన్
- నగరంలోని పోస్టాఫీసుల్లో ఖాతాదారుల అగచాట్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సర్వర్లు మొరాయించటంతో ఉమ్మడి కృష్ణాజిల్లావ్యాప్తంగా మంగళవారం తపాలా సేవలు నిలిచిపోయాయి. ఈ సమస్య మరో పది రోజులకు పైగా ఉండొచ్చని తపాలా శాఖ అధికార వర్గాలు చెబుతున్నాయి. జూన్ 25న దేశవ్యాప్తంగా నూతన మిగతా 6లో..

తిరువూరుకు మినీ ట్యాంక్‌బండ్!

- చారిత్రక 'దేవసముద్రం' చెరువు ఆధునికీకరణకు ప్రతిపాదనలు



- మధిర మెయిన్ రోడ్డు పక్కనే పర్యాటకంగా అలరారుతున్న ప్రాంతం
- ప్రతిపాదనలకు రూపకల్పన చేస్తున్న ఎమ్మెల్యే 8

ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోండి
- నాన్ అప్రూవ్డ్ లే అవుట్లకు మంచి అవకాశం
- దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించిన సీఆర్‌డీఏ


6

ఘాట్‌రోడ్డులో కొండకు ఐరన్ మెష్ పనులు వేగవంతం
- దసరా ఉత్సవాల నాటికి పూర్తిచేసేందుకే..

6

పన్ను కట్టకుంటే కఠిన చర్యలు
- కలెక్టర్ ఆదేశాలతో పన్నుల వసూళ్లకు ప్రత్యేక టీమ్‌లు

8



విజయవాడ కొత్త ప్రభుత్వాసుపత్రిలో మహిళలకు ఈసీజీ పరీక్షలు నిర్వహిస్తున్న పురుష టెక్నీషియన్

టెక్నీషియన్లేరీ?

- అత్మాభిమానాన్ని చంపేస్తున్నారు!
- బెజవాడ కొత్త ప్రభుత్వాసుపత్రిలో పురుష సిబ్బందితో మహిళలకు ఈసీజీ, 2డి ఎకో పరీక్షలు
- కార్పొరేట్ వైద్యం కొనలేక.. ఇక్కడ సిగ్గుతో చచ్చిపోతున్నాం
- తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్న మహిళలు
- దారుణంపై మచిలీపట్నంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితురాలు
- 'ఆంధ్రజ్యోతి విజిట్'లో వెలుగు చూసిన దయనీయ దుస్థితి

ఆంధ్రజ్యోతి విజిట్

హృద్రోగ సమస్యల ధ్రువీకరణ కోసం ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో నిర్వహించే ఈసీజీ, 2డి ఎకో పరీక్షలు పేద, మధ్య తరగతి మహిళల ఆత్మాభిమానాన్ని చంపేస్తున్నాయి. పురుష సిబ్బంది ఎదుట జాకెట్ విప్పి ఛాతిని చూపాల్సి రావటం అత్యంత దారుణం. ఖరీదైన వైద్యాన్ని అందుకోలేక.. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లలేక ప్రభుత్వాసుపత్రులకు వచ్చే మహిళలు సిగ్గు విడవాల్సి వస్తోంది. ఇక్కడి సిబ్బందిని కూడా నిందించలేని పరిస్థితి. పరీక్షలు నిర్వహించే వారికి.. చేయించుకునే వారికి నిత్య సంకటంగా మారుతోంది. విజయవాడ నగరంలో న్యూ జీజీహెచ్, మచిలీపట్నం జీజీహెచ్‌లలో ఈ దారుణాలు చోటు చేసుకుంటున్నాయి. మచిలీపట్నం ఆసుపత్రిలో జరుగుతున్న దారుణాన్ని ఓ మహిళ ధైర్యంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో, ప్రభుత్వ ఆసుపత్రుల్లో 'ఆంధ్రజ్యోతి విజిట్' నమ్మలేని నిజాలు వెలుగుచూశాయి.



మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రి పరీక్షా కేంద్రంలో రోగులు

విజయవాడ/ప్రభుత్వాసుపత్రి/మచిలీపట్నం టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : కోస్తా జిల్లాలకే తలమానికంగా నిలుస్తున్న కొత్త ప్రభుత్వ ఆసుపత్రి రోజురోజుకు తీవ్ర విమర్శలను ఎదుర్కొంటోంది. పలు విభాగాల్లో మహిళా రోగులకు వైద్య పరీక్షలను పురుష సిబ్బందే నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా 2డి ఎకో, ఈసీజీ టెస్టులను పురుష సిబ్బంది నిర్వహిస్తుండటంతో మహిళలు చెప్పలేని మానసిక వేదన ఎదుర్కొంటున్నారు. ఈ పరీక్షల కోసం జిల్లాతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు వస్తుంటారు. వీరిలో సగానికిపైగా మహిళలు ఉంటున్నారు. వీరికీ పురుష సిబ్బందే వైద్య పరీక్షలు చేస్తుండడంతో మహిళలు తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారు. సిబ్బందికి తమ బాధను చెప్పుకోలేక, అలాగని పరీక్షలు చేయించుకోలేక ఎంతోమంది సతమతమౌతున్నారు.

పరీక్షల సమయంలో మహిళల ఇబ్బందులు

ఎకో, ఈసీజీ పరీక్షలు నిర్వహించే సమయంలో కొన్ని సందర్భాల్లో తీవ్ర అసౌకర్యానికి మహిళలు గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో పై వస్త్రాలు తీసివేసి స్కానింగ్ చేయాల్సి ఉంటుంది. పురుష సిబ్బందే స్కానింగ్ తీయాల్సిన పరిస్థితిలో రోగులు అసౌకర్యానికి గురవుతున్నారు.

ఇద్దరు మహిళలు.. ఐదుగురు పురుష టెక్నీషియన్లు

కొత్త ఆసుపత్రిలో కొన్ని విభాగాల్లో సిబ్బంది కొరతతో ఉన్నవారిపైనే పనిభారం పెరుగుతోంది. ఆసుపత్రిలో ఎకో, ఈసీజీ పరీక్షా కేంద్రాల వద్ద ఇద్దరు మహిళా సిబ్బంది ఉన్నారు. వారిలో ఒకరు సూపర్ బ్లాక్‌లో ఉంటే మరొకరు జీజీహెచ్‌లో ఉంటారు. సూపర్‌బ్లాక్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తారు. జీజీహెచ్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తారు. ఉదయం షిఫ్ట్‌లో పనిచేసే మహిళా సిబ్బంది మధ్యాహ్నానికి అందుబాటులో ఉండరు. మధ్యాహ్నం పురుష సిబ్బంది తీయాల్సిన పరిస్థితి. దీంతో పురుష సిబ్బంది మహిళలకు పరీక్షలు చేసే సమయంలో తమ మీద ఎలాంటి ఆరోపణలు వస్తాయోనన్న భయంతో రోగులకు సంబంధించి సహాయకులు పక్కన ఉంటేనే పరీక్షలు నిర్వహిస్తామంటున్నారు. సహాయకులు అందుబాటులో లేని మహిళా రోగులకు పరీక్షలు ఆలస్యమౌతున్నాయి. దీంతో అటు రోగులు, ఇటు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

మచిలీపట్నంలో పరీక్షలపై యువతి ఆగ్రహం

మహిళలకు పురుష టెక్నీషియన్లు 2డి ఎకో టెస్టులు చేస్తుంటే ఆత్మాభిమానం చంపుకోవాల్సి వస్తోంది. సిగ్గు విడిచి ఛాతీ చూపించాల్సి వస్తోందని కొందరు యువతులు మండిపడుతున్నారు. కృష్ణాజిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మహిళలకు పురుష టెక్నీషియన్లు 2డి ఎకో టెస్టులు పరీక్షలు చేస్తుండటంపై పలు అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. తమ శరీరాన్ని 2డి పరీక్షల సమయంలో పురుషుల ముందు ప్రదర్శించాల్సిన దుస్థితి ఏర్పడిందంటూ కొందరు మహిళలు మీడియా ఎదుట వాపోయారు. 2డి పరీక్షలకు మహిళా టెక్నీషియన్లను నియమించాలంటూ బాధితులు గగ్గోలు పెట్టారు. అధికారులకు ఫిర్యాదు చేశారు.

సిబ్బంది కొరతతోనే..

- సూపరింటెండెంట్ డాక్టర్ ఆశాలత

మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో 2డి ఎకో టెస్ట్ రిక్రూట్‌మెంట్ సమయంలో మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి ఇద్దరు పురుష టెక్నీషియన్లు మాత్రం ఇచ్చారు. మహిళా టెక్నీషియన్లను ఇవ్వలేదు. దీంతో ఈ పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఒక నర్సును 2డి ఎకో టెస్ట్ సమయంలో ఉంచుతున్నాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మహిళా టెక్నీషియన్‌ను నియమించేందుకు కృషి చేస్తాం.



మచిలీపట్నం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో 2డి ఎకో పరీక్షల కేంద్రం, పరీక్షా కేంద్రంలో పురుష సిబ్బంది

దుర్గమ్మ సేవలో మంత్రి అచ్చెన్న దంపతులు



ఇంద్రకీలాద్రి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు మంగళవారం సతీమణితో కలిసి విజయవాడ ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఈవో వీకే శీనానాయక్, సిబ్బంది, అర్చకులు వారికి సాదర స్వాగతం పలికారు. మంత్రి అచ్చెన్నాయుడు దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానంతరం వారికి వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు. అనంతరం లడ్డూ ప్రసాదం, అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

బస్‌స్టేషన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని తిరువూరు, జగ్గయ్యపేట, విజయవాడ, గవర్నర్‌పేట 1, గవ్నర్‌పేట 2, ఇబ్రహీంపట్నం, ఆటోనగర్, విద్యాధరపురం డిపోలలో రోజువారీ వేతనంపై ఆన్‌కాల్ డ్రైవర్లుగా పనిచేసేందుకు ఆసక్తి గల డ్రైవర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.వై.దానం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులకు హెవీ డ్రైవింగ్ లైసెన్స్, ఏడాదిన్నర పాటు హెవీ వెహికల్ నడిపే అనుభవం, 59 సంవత్సరాల లోపు వయస్సు ఉండాలని తెలిపారు. అసిస్టెంట్ మెకానిక్, శ్రామికులుగా పనిచేసేందుకు ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా నియామకాలు జరుగుతాయన్నారు. శ్రామిక ఉద్యోగాలకు డీజిల్, మెకానిక్ ట్రేడ్‌లో ఐటీఐ పాసై, అప్రంటీస్ చేసి ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో గాని, డిపోల మేనేజర్లు, కార్యాలయాల్లో గాని సంప్రదించవచ్చునని తెలిపారు. పీవో ఆఫీసు 9959225453 ఆటోనగర్ డిపో మేనేజర్ 9959225463, జగ్గయ్యపేట డిపో మేనేజర్ 9959225460, గవర్నర్‌పేట 2 డిపో మేనేజర్ 9959225456, విద్యాధరపురం డిపో మేనేజర్ 9959225458, విజయవాడ డిపో మేనేజర్ 9959225459, తిరువూరు డిపో మేనేజర్ 9959225465, గవర్నర్‌పేట 1 డిపో మేనేజర్ 9959225455, ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ 9959225457లలో సంప్రదించవచ్చునని ఆయన సూచించారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వ పథకాలు వర్తింపచేయాలి

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు రంగనాయకులు

విజయవాడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వ పథకాలు వర్తింపచేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎ.రంగనాయకులు తెలిపారు. మంగళవారం సీడీఎంఏ పి.సంపత్‌కుమార్‌ను కలిసి కార్మికుల సమస్యలపై లేఖను అందజేశారు. కార్మికుల రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరినట్టు తెలిపారు. కార్మికులకు ప్రభుత్వం ఇన్సూరెన్స్ పాలసీ చేయించి యాక్సిడెంట్‌లో చనిపోయిన వారికి రూ.20 లక్షలు, సాధారణంగా మరణించిన వారికి రూ.2 లక్షలు వచ్చేలా చేస్తామన్నారని రంగనాయకులు తెలిపారు. ప్రమాదానికి గురైనా కార్మికుల పిల్లల చదువుల కోసం రూ.8 లక్షలు వచ్చేలా ఇన్సూరెన్స్ అమలు చేస్తామన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకోండి

- వెబ్‌సైట్ ద్వారా అవకాశం కల్పించిన సీఆర్‌డీఏ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) పరిధిలోని నగరాలు, పట్టణాలు, గ్రామాల పరిధిలో నాన్ అప్రూవ్డ్ లే అవుట్ల క్రమబద్ధీకరణకు రంగం సిద్ధమైంది. ఆన్‌లైన్ దరఖాస్తు విధానాన్ని కల్పిస్తూ మంగళవారం సీఆర్డీఏ అధికారులు చర్యలు చేపట్టారు. అధికారిక వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తులకు ఆప్షన్ ఇచ్చారు. సీఆర్‌డీఏ పరిధిలోని ఉమ్మడి కృష్ణా ప్రాంతాలైన విజయవాడ రూరల్, అర్బన్, ఇబ్రహీంపట్నం, పెనమలూరు, గన్నవరం, ఉంగుటూరు, కంకిపాడు, వుయ్యూరు, జీ కొండూరు, కంచికచర్ల, వీరులపాడు మండలాల నాన్ అప్రూవ్డ్ లే అవుట్ నిర్వాహకులు దరఖాస్తు చేసుకోవటానికి అవకాశం కల్పించారు. పెనుగంచిప్రోలు మండలం శనగపాడు గ్రామానికి మాత్రకే దరఖాస్తు చేసుకోవటానికి అవకాశం ఉంది. నందిగామ, చందర్లపాడు, మైలవరం, బాపులపాడు, నూజివీడు, మొవ్వ, చల్లపల్లి, ఘంటసాల, పామర్రు, గుడివాడ, గుడ్లవల్లేరు, నందివాడ, మోపిదేవి మండలాలలో కొన్ని గ్రామాలే సీఆర్‌డీఏ పరిధిలో ఉండటంతో వాటి పరిధిలోనే దరఖాస్తు చేసుకోవటానికి అవకాశం ఉంది. ఆగిరిపల్లి, పమిడిముక్కల, పెదపారుపూడి, తోట్లవల్లూరు మండలాలు పూర్తిగా , అర్బన్ ప్రాంతాలతో సహా క్రమబద్దీకరణకు దరఖాస్తు చేసుకోవటానికి అవకాశం కల్పించటం జరిగింది. బేసిక్ పీనలైజేషన్, ప్రస్తుత భూమి విలువను అనుసరించి పీనలైజేషన్ ఛార్జీలను నిర్ణయించారు. ప్రస్తుత భూమి ధరల ప్రకారం చూస్తే .. జూన్ 30, 2025 నాటి వరకు 3 వేల చదరపు గజాల ప్లాట్‌కు 20 శాతం పీనలైజేషన్ ఛార్జీగా నిర్ణయించారు. 3 వేల నుంచి 5 వేల చదరపు గజాల వరకు 30 శాతం, 5001 నుంచి 10 వేల చదరపు గజాల వరకు 40 శాతం, 10,001 నుంచి 20 వేల చదరపు గజాల వరకు 50 శాతం, 20,001 నుంచి 30,000 వరకు 60 శాతం, 30,001 నుంచి 50 వేల చదరపు గజాల వరకు 80 శాతం, 50 వేల చదరపు గజాల పైన అయితే 100 శాతం పీనలైజేషన్ ఛార్జీలను చెల్లించాల్సి ఉంటుంది. పీనలైజేషన్ ఛార్జీలతో పాటు దరఖాస్తుదారులు ప్లాట్ వాల్యూలో 14 శాతం రుసుము చెల్లించాల్సి ఉంటుంది.

ఉప్పుతో ముప్పే..



మాట్లాడుతున్న ప్రముఖ కిడ్నీ వైద్యుడు రాజేంద్ర

- చిన్నారులు అతి తక్కువ మోతాదులో వాడాలి
- మార్కెట్లో దొరికే పలు కంపెనీల సాల్ట్ కంటే సాధారణ ఉప్పు మంచిది
- ప్రముఖ కిడ్నీ వైద్యుడు రాజేంద్ర

విజయవాడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఆహార పదార్థాల్లో వాడాల్సిన దానికంటే ఎక్కువస్థాయిలో ఉప్పు వాడితే తీవ్ర అనారోగ్యాన్ని కొనితెచ్చుకున్నట్టేనని ప్రముఖ కిడ్నీ వైద్యుడు రాజేంద్ర అన్నారు. నగరంలోని ఐఎంఏ హాల్‌లో మంగళవారం చెన్నైకి చెందిన సేపియన్స్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆహారంలో ఉప్పు తగ్గింపుపై వర్క్‌షాపు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, రక్తపోటు పెరగడానికి ఉప్పు ప్రధాన కారణమన్నారు. ప్రపంచంలో భారత్ ఉప్పు ఎక్కువగా వాడితే, ఆంధ్రప్రదేశ్ ప్రజలు 30 శాతం అధికంగా ఉప్పు వాడుతున్నారని ఆయన తెలిపారు. సాధారణంగా రోజుకు 5 గ్రాముల ఉప్పు మాత్రమే వాడాలన్నారు. ముఖ్యంగా 12 నెలల చిన్నారులకు రోజుకు 1 గ్రాము, ఒకటి నుంచి 3 సంవత్సరాల చిన్నారులకు 2 గ్రాములు, 4-5 సంవత్సరాల పిల్లలకు 3 గ్రాములు, ఏడేళ్ల పైబడిన పిల్లలకు రోజుకు 5 గ్రాముల ఉప్పు మాత్రమే వాడాలన్నారు. ఉప్పు అధికంగా తీసుకోవడం వల్ల కిడ్నీలు పాడవడం, గుండె సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. మార్కెట్లో దొరికే పలు రకాల సాల్ట్‌ల కన్నా సాధారణ ఉప్పు మేలని ఆయన అన్నారు. నగరానికి చెందిన కార్డియాలజీ వైద్యుడు కార్తీక్ మాట్లాడుతూ, రాష్ట్రంలో రాయలసీమ జిల్లాల ప్రజలు ఉప్పు ఎక్కువగా తినడం వల్ల బీపీ రోగులు ఎక్కువగా ఉన్నారన్నారు. ఉప్పు అధికంగా తీసుకుంటే మెదడుపై ప్రభావం చూపుతుందన్నారు. ఉప్పులో ఉండే సోడియం శరీరంలోని నీరు బయటకు పోకుండా చేసి ఉబకాయానికి దారి తీస్తుందన్నారు. అదే కోస్తాంధ్ర జిల్లాల ప్రజలు రైస్ తినడం వల్ల షుగర్ వచ్చి హార్ట్‌స్ట్రోక్‌కు గురవుతున్నారన్నారు. రుచి, మెరుగైన ఆరోగ్యం గురించి చెప్పే ఆరోగ్య నిపుణులు ఉప్పు వాడద్దనే సూచిస్తారన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు నందగోపాల్, సెక్రటరీ బోస్, డాక్టర్ ఎర్విన్, సురేందరం తదితరులు పాల్గొన్నారు.

సర్వర్ సమస్య

(5వ పేజీ తరువాయి)

సాఫ్ట్‌వేర్‌ను అమల్లోకి తీసుకొచ్చారు. దశలవారీగా అన్ని పోస్టాఫీసుల్లోనూ ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. మంగళవారం నుంచి విజయవాడ రీజియన్ పరిధిలో కూడా అమలు చేశారు. అయితే, ఈ నూతన సాఫ్ట్‌వేర్‌లో సాంకేతిక సమస్యలు ఏర్పడ్డాయి. సర్వర్ మొరాయించింది. నెట్‌వర్క్ సరిగ్గా పనిచేయలేదు. నగరంలోని బకింగ్‌హాంపేట హెడ్‌పోస్టాఫీసు నిత్యం రద్దీగా ఉంటుంది. ఉదయం నుంచి సేవలు నిలిచిపోవటంతో తపాలా ఖాతాదారులు ఇబ్బందులు పడ్డారు. పోస్టల్ ఇన్సూరెన్స్ స్కీమ్‌లు, పోస్టల్ డిపాజిట్స్ స్కీమ్‌లు, పోస్టల్ సేవింగ్స్ స్కీమ్‌లు, సుకన్య సమృద్ధి యోజన, ఇతర అనేక సేవింగ్స్ స్కీమ్‌లకు సంబంధించి లావాదేవీలు, నగదు విత్‌డ్రా చేయడానికి పెద్ద ఎత్తున పోస్టాఫీసుకు సందర్శకులు వస్తుంటారు. సాఫ్ట్‌వేర్, నెట్‌వర్కింగ్, సర్వర్ సమస్యల కారణంగా రోజంతా ఇబ్బందులు పడ్డారు. అత్యవసర లావాదేవీల కోసం వచ్చినవారు మాత్రం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వేచి చూశారు. బకింగ్‌హాం పోస్టాఫీసు, వన్‌టౌన్ , గాంధీనగర్ పోస్టాఫీసుల్లో ఖాతాదారులు ఇబ్బందులు పడ్డారు.

రూ.500 దర్శనం రద్దు చేద్దామా?

(5వ పేజీ తరువాయి)

వచ్చిన భక్తులు అమ్మవారి గోపురం వద్దకు చేరుకోవడానికి గంటల సమయం పడుతుంది. ఉచిత దర్శనం, రూ.100, రూ.300 క్యూల్లోని భక్తులకు దర్శనం వేగంగా జరుగతోంది. దీంతో రూ.500 క్యూలో ఉన్న భక్తులు అసహనానికి గురవుతున్నారు.

గత అనుభవాల నేపథ్యంలో..

దుర్గగుడి ఈవో శీనానాయక్ దేవస్థానానికి సంబంధించిన వివిధ విభాగాల అధికారులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. రెండు, మూడేళ్ల ఉత్సవాలను ప్రామాణికంగా తీసుకుని నాటి పరిస్థితుల గురించి తెలుసుకుంటున్నారు. రూ.500 క్యూలోనే భక్తులు దర్శనం విషయంలో అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని ఆయా విభాగాల అధికారులు వివరించినట్టు తెలిసింది. ఏటా శరన్నవరాత్రుల్లో మొదటి ఐదు రోజులు టికెట్లను భక్తులు తీసుకుంటారు. మూల నక్షత్రం రోజున వేలమంది అమ్మవారి దర్శనానికి వస్తారు. ఆరోజు అన్ని క్యూల్లో ఉచిత దర్శనం అమలు చేస్తారు. అయితే, ప్రతి దసరా ఉత్సవాల్లో రూ.500 టికెట్లు కొన్న భక్తులు మాత్రం దర్శనం ఆలస్యం కావడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భక్తుల నుంచి నిరసనలు పెరుగుతున్న తరుణంలో శరన్నవరాత్రుల్లో అసలు రూ.500 టికెట్ క్యూను రద్దుచేస్తే బాగుంటుందన్న అభిప్రాయంలో అధికారులు ఉన్నారు. ప్రస్తుతం జిల్లాస్థాయి అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం మాత్రమే జరిగింది.

జల జగడం

(5వ పేజీ తరువాయి)

పరిధిలో మంచినీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తాయి. ఈ గ్రామాల పరిధిలో నివసించే 3 లక్షల మంది ప్రజలు ఇప్పటికే మంచినీటి కోసం కష్టాలు పడుతున్నారు. కార్మికుల ఆందోళనలు కొనసాగితే మాత్రం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. జీతాలిచ్చే వరకు తాము పనిచేసేది లేదని కార్మికులు చెబుతున్నారు. తమకు బిల్లులు రానందున జీతాలు ఇవ్వలేమని కాంట్రాక్టు సంస్థ చెబుతోంది.

కాంట్రాక్టు సంస్థ సమాధానం ఇలా..

ఇబ్రహీంపట్నం, కవులూరు, జి.కొండూరు గ్రామాలకు ఇవ్వాల్సిన మంచినీటి పరిమాణం కంటే ఎక్కువగా పంపిణీ చేశామని కాంట్రాక్టు సంస్థ చెబుతోంది. అయితే, దానికి సంబంధించి కూడా ఎలాంటి రికార్డులు లేవని తెలుస్తోంది. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు బిల్లులకు ఒప్పుకోవట్లేదని సమాచారం. వైసీపీ హయాంలో జరిగిన ఈ కాంట్రాక్టు సంస్థ బాగోతాల సమాచారం ప్రస్తుత కూటమి ప్రభుత్వం వద్ద ఉంది. దీంతో రికార్డుల్లేని మంచినీటి పంపిణీకి సంబంధించి ప్రస్తుతం బిల్లులు రాయటానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సాహసించట్లేదు.

గతంలోనూ వివాదం

ప్రస్తుత కాంట్రాక్టు సంస్థపై ఇంతకుముందు కూడా పలు ఆరోపణలు వచ్చాయి. గతంలో రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ ఆ కాంట్రాక్టు సంస్థకు రూ.2 కోట్ల జరిమానా కూడా విధించారు. గతంలో మొత్తం 95 మంది పనివారు ఉండాల్సి ఉండగా, కేవలం 48 మందినే విధుల్లో ఉంచారని, మరమ్మతుల సమయంలో కూడా మంచినీటిని పంపిణీ చేసినట్టు రికార్డు చేశారని ఆయన గుర్తించారు. క్లోరినేషన్ పరిమాణానికి లెక్కలు లేవని, హెడ్ వాటర్ వర్క్స్ స్థలంలో భారీగా పిచ్చి మొక్కలు పెరిగిపోయి ఉండటాన్ని ఆయన గమనించారు. కాంట్రాక్టు సంస్థ బాధ్యతారాహిత్యాన్ని దృష్టిలో ఉంచుకుని, తప్పుడు రికార్డులను చూపినందుకు ఆయన ఆ జరిమానా విధించారు. నాటి ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, డీఈఈ, ఏఈలపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కిందటి వైసీపీ హయాంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. జరిమానా సొమ్మును కూడా వసూలు చేయలేదు.

ఎరువు.. బరువు

(5వ పేజీ తరువాయి)

మారింది. మూడు దశాబ్దాల క్రితం ఎకరా పంట సాగుకు, కౌలుకు, కూలీలకు, ఎరువులకు, ఇతర పురుగుల మందుల వాడకానికి అయిన ఖర్చులతో పోలిస్తే ఇప్పుడయ్యే ఖర్చు ఐదు రెట్లు పెరిగింది. అప్పట్లో రూ.250 (50 కిలోల బస్తా) ఉన్న డీఏపీ బస్తా ఇప్పుడు రూ.1,350 ఉంది. అప్పట్లో కాంప్లెక్స్ ఎరువులు రూ.250 ఉండేవి. ఇప్పుడు ఏకంగా రూ.1,500 దాటి పోయాయి. పంటలకు నానో ఎరువులు వాడాలని ప్రభుత్వం చెబుతున్నా.. సేంద్రియ వ్యవసాయంపై దృష్టిసారించి కాంప్లెక్స్ ఎరువుల వినియోగం తగ్గించాలని వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నా.. రైతులు మాత్రం కాంప్లెక్స్ ఎరువులనే వాడుతున్నారు. ఈ పరిణామం కూడా ఎరువుల ధరల పెరుగుదలకు కారణమవుతోంది.

సబ్సిడీలు తగ్గడం వల్లే..

ఏటా కేంద్ర ప్రభుత్వం ఎరువుల తయారీ కంపెనీలకు ఇచ్చే రాయితీని తగ్గిస్తూ రావడం వల్లే ధరలు పెరుగుతున్నాయి. ప్రభుత్వ సబ్సిడీ లభించకపోవడంతో కంపెనీలు ఎరువుల ధరలను అమాంతం పెంచేస్తున్నాయి. ఈ క్రమంలో మూడేళ్లుగా ధరలు పెరుగుతూ వస్తున్నాయి. అంతేకాకుండా దేశీయంగా లభించని కాంప్లెక్స్ ఎరువులైన పొటాష్, పాస్పరస్ వంటివి ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. వీటి ధరలు భారీగా పెరగడం వల్ల ఆ ప్రభావం అన్ని ఎరువులపై పడుతోంది. అయితే, యూరియాకు మాత్రమే 83.5 శాతం కేంద్రం రాయితీ ఇవ్వడంతో దాని ధరలు పెరగలేదు.

మూడేళ్లలో కాంప్లెక్స్ ఎరువుల ధరల పెరుగుదల (50 కిలోల బస్తా రూ.ల్లో)

ఎరువుల రకాలు	2023	2024	2025	పెరుగుదల (గత ఏడాది కంటే)
ఎంవోపీ	1,400	1,550	1,800	250
10-26-26	1,375	1,720	1,850	130
16-16-16	1,250	1,475	1,600	125
14-35-14	1,450	1,800	1,900	100
20-20-0-13	1,175	1,300	1,400	100

అదనపు ధరలకు అమ్మితే చర్యలు

పెరిగిన ఎరువుల ధరలు రైతులకు భారమయ్యాయి. ఈ క్రమంలో ఏ డీలర్ అయినా ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్మినట్లు ఫిర్యాదులు వస్తే తప్పక చర్యలు ఉంటాయి. రైతులకు ఎక్కడా ఇబ్బంది లేకుండా చూస్తున్నాం.

- రజని, ఏవో, ఇబ్రహీంపట్నం

ట్రాఫిక్ సమస్యకు చెక్

(5వ పేజీ తరువాయి)

ప్రకటించారు. హైదరాబాద్ ఓఆర్ఆర్ నుంచి విజయవాడలోని పున్నమిఘాట్ వరకు జాతీయ రహదారి-65ని ఆరు వరసలుగా విస్తరించనున్నారు. ఈ భారీ ప్రాజెక్టులో భాగంగా 'ఐతవరం-అంబారుపేట' బైపాస్ రోడ్డును నిర్మించనున్నారు.

ఏళ్ల తరబడి ట్రాఫిక్ సమస్య

తెలంగాణాలోని ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురిసినపుడు మునేరుకు భారీ వరద వస్తోంది. కీసర వంతెన దాటాక ఐతవరం వద్ద మునేరు రోడ్డెక్కుతుండటంతో ఎంతో ప్రాధాన్యత కలిగిన జాతీయ రహదారిపై తరచూ వాహనాల రాకపోకలు స్తంభిస్తున్నాయి. 2004లో నాలుగు లైన్లుగా జాతీయ రహదారిని అభివృద్ధి చేసినప్పటికీ ఈ సమస్య వెంటాడుతూనే ఉంది. దీంతో మునేటికి భారీ వరద వచ్చిన ప్రతిసారీ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. 2005 వరదల సమయంలో రెండు రోజులకుపైగా ట్రాఫిక్ నిలిచిపోయింది. 2023 వరదలప్పుడు 26 గంటలసేపు కంచికచర్ల-నందిగామ మధ్య జాతీయ రహదారి బంద్ అయ్యింది. 15 కార్లు, ఐదు ఇతర వాహనాలు కొట్టుకుపోయాయి.

వంశీ అనుచరులకు

ముందస్తు బెయిల్

విజయవాడ సిటీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులు ఓలుపల్లి మోహనరంగారావు, అనగాని రవికి కోర్టులో ఊరట లభించింది. వారిపై నమోదైన కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరైంది. గన్నవరం గాంధీ బొమ్మ సెంటర్‌లోని సుంకర సీతామహాలక్ష్మి స్థలం కబ్జా చేశారనే అభియోగంపై నమోదైన కేసులో మోహనరంగారావు, రవి ఏ2, ఏ3గా ఉన్నారు. ఈ కేసులో పోలీసులు అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కొద్దిరోజుల క్రితం వారు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు ముగియడంతో విజయవాడ 12వ ఏడీజే కోర్టు న్యాయాధికారి ఎం.సునీల్‌కుమార్ మంగళవారం ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ తీర్పును ఇచ్చారు. అదేవిధంగా 9.02 ఎకరాల భూమిని కబ్జా చేశారని ఆత్కూరు పోలీస్ స్టేషన్‌లో అనగాని రవిపై నమోదైన కేసులోనూ అతనికి ముందస్తు బెయిల్ మంజూరైంది.

ఘాట్‌రోడ్డులో కొండకు ఐరన్ మెష్

పనులు వేగవంతం



కొండకు ఐరన్ మెష్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానం ఘాట్ రోడ్డులో భక్తుల భద్రత నిమిత్తం అధికారులు చేపట్టిన కొండకు ఐరన్ మెష్ ఏర్పాటు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. వర్షాలకు కొండ ప్రాంతం తడిసి బండరాళ్లు జారి ఘాట్ రోడ్డులో పడకుండా ఉండేందుకు భక్తుల భద్రతలో భాగంగా అధికారులు కొండకు ఐరన్ మెష్ ఏర్పాటు పనులు గత కొన్ని నెలల నుంచి ప్రారంభించారు. ఘాట్ రోడ్డు రెండవ మలుపు నుంచి చైనావాల్ వరకు సుమారు 120 మీటర్ల పొడవు, 100 అడుగుల ఎత్తు వరకు కొండ రాళ్లు జారిపడకుండా ఉండేందుకు దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు సుమారు రూ.2కోట్లతో ఐరన్ మెస్ ఏర్పాటు పనులు చేపట్టారు. ఈ పనులను దసరా ఉత్సవాల లోపే పూర్తి చేయాలనే ప్రయత్నంలో ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు. కాగా, ఘాట్ రోడ్డు మొదటి మలుపు వద్ద కొండకు సుమారు 15 ఏళ్ల క్రితం ఐరన్ మెష్ ఏర్పాటు చేశారు. భారీగా కురిసిన వర్షాలకు కొండరాళ్లు జారి ఐరన్ మెష్‌లోనే కొన్ని రాళ్లు నిలిచిపోయాయి. ఎక్కువ సంవత్సరాలు కావటం వలన ఆ కొండ ప్రాంతంలో కూడా మళ్లీ ఐరన్ మెష్ ఏర్పాటు చేస్తే భక్తులకు మరింత భద్రత ఏర్పడుతుంది. ఆ దిశగా సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

దేశానికే దిక్సూచి చంద్రబాబు సంక్షేమ పాలన : గద్దె క్రాంతికుమార్

రామలింగేశ్వరనగర్ ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న సంక్షేమ పాలన దేశానికే దిక్సూచిగా నిలుస్తుందని టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్ పడవల రేవు ఏరియాలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో గద్దె క్రాంతికుమార్ పాల్గొని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం వైద్య ఖర్చుల నిమిత్తం కొట్టావు రాంబాబుకు రూ. 10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో చిన్నం ఈశ్వరరావు, గాదిరెడ్డి అమ్ములు, చెరుకూరి మురళి, సింగంశెట్టి రమేష్, పాల్గొన్నారు.

వైభవంగా మంగళగౌరీ వ్రతం



మంగళగౌరీ వ్రతంలో పాల్గొన్న మహిళా భక్తులు

పటమట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పటమట దర్శిపేటలో ఉన్న శ్రీరాజరాజేశ్వరీ లలితా పరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో ఆవుల నాసరయ్య అధ్యక్షతన జరిగిన మంగళగౌరీ వ్రతంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. 300 మంది ముత్తాయిదువులు కుంకుమ పూజ నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పంచహారతులు, సాయంత్రం సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. శ్రావణమాసం నెలరోజులు భక్తుల గోత్రనామాలతో పూజలు నిర్వహిస్తున్నామని ఆలయ నిర్వాహకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి పోతంశెట్టి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఆవుల వీరయ్య, కోశాధికారి శివన్నారాయణ, రాజరాజేశ్వరీ మహిళా మండలి భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భారతీనగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రింగ్‌రోడ్డు సెక్షన్ పరిధిలోని విద్యుత్‌లైన్లు మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళానగర్, నలంద స్కూల్ ఏరియా, మున్సిపల్ ఎంప్లాయిస్ కాలనీ, బందర్ రోడ్ పరిసర ప్రాంతాలలో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు. **మాచవరం:** విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఏలూరు రోడ్డు శివాలయం నుంచి రామవరప్పాడు రింగ్ వరకు బుధవారం ఉదయం 8 గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



భారతీనగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నాల్గో డివిజన్ పరిధిలోని పలు కాలనీలలోని వీఎంసీ పార్కులను నగర పాలన సంస్థ అధికారులు ప్రాజెక్ట్ ఈఈ చంద్రశేఖర్, ఏఈ మునీంద్ర , డివిజన్ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు సమక్షంలో మంగళవారం పర్యటించి పార్కుల్లోని వసతులను పరిశీలించారు. కనకదుర్గా గజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ, కమర్షియల్ టాక్సీస్ కాలనీ, భారతీనగర్ కాలనీ 5,9,11ఎ రోడ్లోని పార్కులను, వెటర్నరీ కాలనీ, సెంట్రల్‌ఎక్సైజ్ కాలనీ, వెంకటేశ్వరనగర్, తదితరల పలు కాలనీలోని వీఎంసీ పార్కులను పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు మాట్లాడుతూ పార్కుల్లో స్థానికంగా ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. పార్కుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను రూపొందించామని తెలిపారు. త్వరలో అన్ని పార్కులను సుందరంగా తీర్చిద్దితామని ఆయన తెలిపారు.

శ్రీవారి ఆలయంలో సౌభాగ్యం కార్యక్రమం 8న



సౌభాగ్యం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీటీడీ అధికారులు

లబ్బీపేట, ఆగస్టు 5 (ఆంధ్ర జ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం, హిందు ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శ్రావణ మాసంలో వరలక్ష్మీవ్రతాన్ని పురస్కరించుకొని శుక్రవారం (ఈనెల 8న) టీటీడీ కల్యాణ మండపంలోని శ్రీవారి ఆలయంలో సౌభాగ్యం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీటీడీ దేవాలయాల పర్యవేక్షణ అధికారి మల్లికార్జునరావు తెలిపారు. మంగళవారం శ్రీవారి ఆలయ ప్రాంగణంలో సౌభాగ్యం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వరలక్ష్మీవ్రతం రోజు టీటీడీ ఆధ్వర్యంలో ఉన్న 60 దేవాలయాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ రోజు దర్శనానికి వచ్చిన మహిళలకు పసుపు కుంకుమ, గాజులు, కంకణములు, పసుపుతాడు, అమ్మవారి పుస్తక ప్రసాదం అందజేయడం జరుగుతుందని తెలిపారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలిత రమాదేవి మాట్లాడుతూ ఆలయంలో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి స్వామి కి విశేషార్చన నిర్వహించి పూజించిన సౌభాగ్య ద్రవ్యాలను భక్తులకు వితరణ చేస్తామని తెలిపారు. ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ సి.వి.కె ప్రసాద్, కృష్ణా పాల్గొన్నారు.





విరిగిపోయిన సిమెంట్ బెంచీలు

పార్కులో పెరిగిన పచ్చగడ్డి



తుప్పు పట్టిన ఇనుప బెంచీలు

ఆహ్లాదానికి ఆమడదూరంలో...

- దొంతిరెడ్డి మల్లేశ్వరి నగరపాలక సంస్థ పార్కులో సౌకర్యాల లేమి
- విరిగిన సిమెంట్ బెంచీలు, తుప్పు పట్టిన ఇనుప బెంచీలు
- దోమలకు ఆవాసంగా పెరిగిన గడ్డి
- పేరుకున్న వ్యర్థాలు
- ఉద్యాన శాఖ సిబ్బంది నిర్లక్ష్యం

పటమట, ఆంధ్రజ్యోతి: పదుగురికి పచ్చదనంతో ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కు ఉద్యాన శాఖ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా శిథిలావస్థకు చేరింది. 11వ డివిజన్ పీఅండ్‌టీ కాలనీలో దొంతిరెడ్డి మల్లేశ్వరీ నగరపాలక సంస్థ ఉద్యానవన పార్కులో కనీస వసతులు లేక పార్కు పూర్తిగా మూలనపడింది. వర్షం పడితే పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయి ఆప్రాంతం అంతా చిత్తడి చిత్తడిగా ఉంటుంది. పార్కులో ఉన్న విద్యుత్ దీపాలు వెలగవు. విరిగిపోయిన సిమెంట్ బెంచీలు, రంగు పూర్తిగా పోయి ఇనుప బెంచీలు తుప్పు పట్టిపోయాయి. పార్కు మొత్తం పచ్చగడ్డి ఏపుగా పెరిగి బీడుగా మారింది. నెలల తరబడి వ్యర్థాల గుట్టను తొలగించకపోవడంతో పార్కు దోమలకు ఆవాసంగా మారింది. సంబంధిత ఉద్యాన శాఖ అధికారులు స్పందించి పార్కులో కనీస సౌకర్యాలు కల్పిస్తే కాలనీవాసులకు ఉదయం, సాయంత్రం ఆహ్లాదంగా గడపడానికి అవకాశం ఉంటుందని స్థానికులు కోరుకుంటున్నారు.

వారం రోజుల్లో పార్కును శుభ్రం చేయిస్తాం

సిబ్బంది కొరత నెలకొంది. వారం రోజుల్లో పార్కును శుభ్రం చేయించి వినియోగంలోకి తీసుకువస్తాం.

- చంద్రశేఖర్, ఏడీహెచ్

రాష్ట్రంలో వాట్సాప్ గవర్నెన్స్ అమలు : ఎమ్మెల్యే గద్దె



వాట్సాప్ గవర్నెన్స్ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే తొలిసారిగా మన రాష్ట్రంలో వాట్సాప్ గవర్నెన్స్‌ను అమలు చేస్తున్నామని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. తూర్పు పరిధి 3వ డివిజన్‌లోని శ్రీరామచంద్రనగర్ కాలనీలో వాట్సాప్ గవర్నెన్స్ ప్రచార కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ వాట్సాప్ గవర్నెన్స్ పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల చేతిలో ప్రభుత్వాన్ని పెట్టారన్నారు. ప్రభుత్వం నుంచి అవసరమైన సుమారు 500కు పైగా సేవలను 9552300009కు వాట్సాప్ చేయడం ద్వారా పొందవచ్చునని తెలిపారు. ప్రజల సమస్యలను సైతం ఈ నెంబరుకు ఫొటోతో పాటుగా సమస్య వివరాలు పంపితే వెంటనే ఆ సమస్యను పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్స్‌ను సైతం ఈ నెంబరుకు సందేశం పంపడం ద్వారా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లకుండానే వాట్సాప్ ద్వారా పొందవచ్చునని తెలిపారు. ఈ వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ప్రతి నెల 5న విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. అధికారులు, కార్యకర్తలు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

శ్రీరామచంద్రనగర్‌లో సుపరిపాలనలో తొలి అడుగు

3వ డివిజన్‌లోని శ్రీరామచంద్రనగర్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను అందజేశారు. అనంతరం డివిజన్‌లో మరమ్మతులకు గురైనా తాగునీటి సరఫరా పైపుల ప్రాంతాన్ని పరిశీలించి వాటిని త్వరగా మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం డివిజన్‌లోని ఐదుగురు నిరుపేద కుటుంబాలకు కేఎస్ఎన్ ప్రసాద్ సహకారంతో రూ.69వేలు విలువ చేసే ఆర్థిక సహాయాలను అందజేశారు. పార్టీ సీనియర్ నాయకులు బొప్పన భవకుమార్, డివిజన్ నాయకులు, కాలనీ అధ్యక్షులు పి. సీతారామయ్య, దాడి సుబ్బారావు, పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న వైద్యులు

క్యాన్సర్ స్క్రీనింగ్‌పై జిల్లాస్థాయి శిక్షణ

మాచవరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ప్రభుత్వ సిద్దార్థ మెడికల్ కాలేజీలో జిల్లా స్థాయిలో ఎన్‌సీడీ 4.0 క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ శిక్షణకు ప్రభుత్వ మెడికల్ కాలేజీలోని ఎనిమిది విభాగాల స్పెషలిస్టులు శిక్షకులుగా వ్యవహరించారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ విధానాలు, గుర్తింపు మార్గాలు, చికిత్సకు ముందు చర్యలు, రోగులకు మానసికంగా ధైర్యం చెప్పే పద్ధతులు, తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవై రావు, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ గోవింద్, సర్జరీ విభాగాధిపతి పద్మశ్రీ, గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ కేశవచంద్ర, ఈఎన్‌టి విభాగాధిపతి డాక్టర్ రవి, ఓఎంఎఫ్ఎస్ ప్రొఫెసర్ డాక్టర్ సుధాకర్, ప్రివెంటివ్ అంకాలజీ విభాగ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఆశా, జిల్లా ఆరోగ్య కార్యాలయ ప్రతినిధిగా డాక్టర్ మాధవిలు హాజరై ప్రసంగించారు. క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడం వలన చికిత్సకు సులభంగా జరిగే అవకాశాలు పెరుగుతాయని వివరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద, మండలస్థాయి ఆసుపత్రుల వద్ద స్క్రీనింగ్ టెస్టులు ఎలా నిర్వహించాలో వివరించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	105,113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 475

పరిశ్రమల స్థాపనకు దరఖాస్తుల ఆహ్వానం

ఆటోనగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు జిల్లాలో అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ ఖాదీ, గ్రామీణ పరిశ్రమల మండలి జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.ఆనంద్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన ఆటోనగర్‌లోని తన కార్యాలయంలో 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వశాఖ, ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం అమలవుతుందన్నారు. జిల్లాలో ఈపథకం కింద ఈ ఆర్థిక సంవత్సరానికి కనీసం 31 యూనిట్‌లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు. ఈఏడాది ఏప్రిల్ నుంచి ఈపథకం కింద ఆరు యూనిట్‌లకు బ్యాంక్ రుణాలు మంజూరు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. 18ఏళ్ల వయస్సు పైబడిన వారు దీనికి అర్హులని, కనీసం 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని ఏడీ ఆనంద్ కుమార్ సూచించారు.డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కేవీఐసీ ఆన్‌లైన్.జీవోవీ. ఇన్/పీఎంఈజీపీఈ పోర్టల్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.



రెండుగా విరిగిపోయిన రబ్బరు స్పీడ్ బ్రేకర్, స్పీడ్ బ్రేకర్ నుంచి బయటపడ్డ ఇనుప బోల్టు

రబ్బరు స్పీడ్ బ్రేకర్‌లతో అవస్థలు

పటమట, ఆంధ్రజ్యోతి: నగరపాలక సంస్థ అధికారులు నగరంలో వివిధ కూడళ్లల్లో ఏర్పాటు చేసిన రబ్బరు స్పీడ్ బ్రేక్‌లు వాహనచోదకులను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నాయి. పలు ప్రాంతాల్లో రబ్బరు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసినప్పటికీ అనతికాలంలోనే పూర్తిగా విరిగిపోయి పైకి లేచాయి.

పైకి లేవడంతో వాటికింద ఏర్పాటు చేసిన ఇనుప బోల్టులు బయటపడ్డాయి. వాటి వల్ల ద్విచక్ర వాహనదారుల టైర్లు తరచూ పంచర్లు పడుతున్నాయి. కొందరు అదుపుతప్పి పడిపోయి ప్రమాదాల బారినపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

బస్టాప్‌లు లేక ప్రయాణికుల బాధలు

భారతీనగర్, ఆంధ్రజ్యోతి: ప్రధాన సెంటర్‌లో బస్టాప్‌లు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రమేష్ ఆసుపత్రి నుంచి రామవరప్పాడు సెంటర్ వరకు ఏలూరు జాతీయ రహదారి వెంబడి ప్రధాన సెంటర్లు మహానాడు జంక్షన్ సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రి, రమేష్ ఆసుపత్రి సెంటర్ వద్ద బస్టాప్‌లు లేకపోవడంతో ప్రయాణికులు చెట్ల క్రింద, ఫ్లై ఓవర్ కింద నిలబడుతున్నారు. సమయానికి బస్సు రాకపోవడంతో ఎండకు, వానకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ప్రభుత్వ ఆసుపత్రి వద్ద చెట్టు కింద , రమేష్ ఆసుపత్రి సెంటర్ వద్ద ఫ్లై ఓవర్ కింద నిలబడిన ప్రయాణికులు



ఆర్థికసాయం అందజేస్తున్న ధనేకుల రవీంద్రనాథ్ ఠాగూర్

ఘనంగా ధనేకుల 86వ జన్మదిన వేడుకలు

పెనమలూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గంగూరు ధనేకుల ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్, ప్రముఖ పారిశ్రామికవేత్త ధనేకుల రవీంద్రనాథ్ ఠాగూర్ 86వ జన్మదిన వేడుకలను కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు ప్రముఖులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గెట్ టు గెదర్‌లో పలువురు వక్తలు మాట్లాడుతూ అనేక విధాలుగా సమాజాభివృద్ధిలో పాలుపంచుకొంటున్న ఠాగూర్ జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. కళాశాలకు చెందిన సుమారు వందమంది స్టాఫ్‌కు టాప్‌స్టార్ ఆసుపత్రి వైద్య బృందంతో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. కళాశాలకు చెందిన కొరిటాల వసంతకు ఎంటెక్ చదువుకు రూ.10వేలను ఠాగూర్ అందించారు. వైద్యులు డాక్టర్ దినేష్ దావులూరు, డాక్టర్ చిగురుపాటి హసిత, డాక్టర్ సాయి హర్షిత, డాక్టర్ ఉండి రాకేష్, ప్రిన్సిపాల్ రవి కడియాల, డైరెక్టర్ రవి ప్రసాద్, సెక్రటరీ కరస్పాండెంట్ ధనేకుల భవానీప్రసాద్, లయన్ రావి సురేష్, హెచ్‌వోడీ హేమ పాల్గొన్నారు.

జయప్రద ఫౌండేషన్ సేవలు నిరుపమానం

జగ్గయ్యపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జయప్రద ఫౌండేషన్ ద్వారా టీడీ జనార్ధన్ అందిస్తున్న సేవలు నిరుపమానమని కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. 3 రోజుల ఉచిత వైద్య శిబిరం ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడుతూ జన్మభూమిపై మమకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాలతో పాటు సాధారణ, దంత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్న జనార్ధన్‌ను ప్రశంసించారు. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచిత వైద్యం అందించటం ఆనందంగా ఉందన్నారు. నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కన్నెబోయిన రామలక్ష్మి, ఎంజీఆర్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి మాదాల శ్రీనివాస్, ఆపిరాన్ హెల్త్ కేర్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ డాక్టర్ కంచర్ల శ్రీనివాస్, ఎండీ అనిత, డాక్టర్ కృష్ణప్రసాద్, డాక్టర్ పీ శ్రీనివాస్, కట్టా నరసింహారావు పాల్గొన్నారు.

ట్రాంపోలైన్ చాంపియన్‌షిప్‌కు

క్రీడాకారులు రాయ్‌పూర్ పయనం



క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

విజయవాడ స్పోర్ట్స్ ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8 నుంచి 10 వరకు రాయ్‌పూర్‌లోని మహారాణ ప్రతాప్ స్పోర్ట్స్ కాలేజ్‌లో జరిగే ట్రాంపోలైన్ నేషనల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ సీనియర్, జూనియర్, సబ్‌జూనియర్ జట్లు పయనమైనట్టు ఎన్టీఆర్ జిల్లా జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ సెక్రటరీ బీ బాబూరావు తెలిపారు. సీనియర్ జట్టులో వీ నీలవేణి, ఎస్ ప్రజ్ఞ (వీఆర్ సిద్ధార్థ), ఎస్ ఐశ్వర్య (పీబీ సిద్ధార్థ), జూనియర్ జట్టులో ఎస్ కీర్తన (సిద్ధార్థ మహిళ కళాశాల), సబ్ జూనియర్స్ జట్టులో కే శ్రీ సరయు, ఎల్ శ్రీరాం (వీపీఎస్ పబ్లిక్ స్కూల్) చాంపియన్‌షిప్‌లో పాల్గొంటున్నారు. క్రీడాకారులను అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వీ దుర్గాప్రసాద్, ఎల్ మురళి కృష్ణ, కే రఘురామ్, వై రామ్మోహన్ శుభాకాంక్షలు తెలిపారు.

నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలి

- గ్రామ, వార్డు సచివాలయ శాఖ డైరెక్టర్‌కు వినతిపత్రం



డైరెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

ఆటోనగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం ఆటోనగర్‌లోని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ రాష్ట్ర కార్యాలయంలో శాఖ డైరెక్టర్ ఎం శివప్రసాద్‌కు ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక నేతలు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులకు డేట్ ఆఫ్ జాయినింగ్ నుంచి నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని, వినతి పత్రంలో పేర్కొన్నారు. డైరెక్టర్ సానూకూలంగా స్పందించారని, నోషనల్ ఇంక్రిమెంట్‌కు సంబంధించిన దస్త్రం వెంటనే ప్రభుత్వానికి పంపుతామని చెప్పినట్టు ఐక్యవేదిక నేతలు పేర్కొన్నారు. ఐక్యవేదిక రాష్ట్ర ఛైర్మన్ ఎండీ జానీపాషా, సెక్రటరీ జనరల్ విప్పర్తి నిఖిల్, కన్వీనర్ షేక్ అబ్దుల్ రజాక్, నేతలు షాలెం కృప, షణ్ముఖ, మహాలక్ష్మి, విష్ణు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల నిర్వీర్యం దుర్మార్గం

- ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

కృష్ణలంక, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి సంఘ నేత నుంచి సీఎంగా ఎదిగిన చంద్రబాబు విద్యార్థి సంఘాలను నిర్వీర్యం చేయాలనుకోవడం దుర్మార్గమని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల శ్రీనివాస్ అన్నారు. ఆంధ్రరత్న భవన్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ తన వారసత్వ రాజకీయ భవిష్యత్తుకు అడ్డం వస్తారని భావించిన చంద్రబాబు పదవి చేపట్టినప్పటి నుంచి నేటివరకు రాష్ట్రంలో ఎలాంటి విద్యార్థి సంఘ ఎన్నికలు జరుగకుండా అడ్డుకొంటున్నారని మండిపడ్డారు. విద్యార్థి సంఘాల నేతల ప్రవేశాన్ని నిషేధించి సంఘాలను అదుపు చేయాలనే దుర్మార్గపు జీవోలను ఇవ్వడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జీవోను తక్షణమే రద్దు చేయాలని వేముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎన్‌ఎస్‌యూఐ నేతలు ఆకాష్, రవితేజ పాల్గొన్నారు.

హోంగార్డు కుమార్తెలకు

పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం

- అభినందించిన సీపీ రాజశేఖరబాబు

విజయవాడ సిటీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన హోం గార్డు కుమార్తెలు రత్నశ్రీ, జయశ్రీలను జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు విజయవాడలోని ఆయన కార్యాలయంలో మంగళవారం అభినందించారు. తొలి ప్రయత్నంలోనే 110, 127 మార్కులతో ఉద్యోగం సాధించిన వారి పట్టుదలను ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా సీపీ రాజశేఖరబాబు మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో హోం గార్డుగా విధులు నిర్వర్తిస్తున్న వంగూరి చిట్టిబాబు కుమార్తెలు రత్నశ్రీ, జయశ్రీలు కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. జి.కొండూరు మండలం భీమవరప్పాడుకు చెందిన చిట్టిబాబు హోం గార్డు ఉద్యోగం చేస్తూ, మరో వైపు వ్యవసాయ చేస్తూ ఎంతో కష్టపడి తన ముగ్గురు కుమార్తెలను ఉన్నత చదువులు చదివించాడన్నారు. పెద్ద కుమార్తె తేజ భవనశ్రీను సాఫ్ట్‌వేర్ చదివించాడని, రెండో కుమార్తె రత్నశ్రీని బి.టెక్, మూడో కుమార్తె జయశ్రీ బి.ఏ చదివించాడని గుర్తు చేశారు. తండ్రి కష్టాన్ని చూస్తూ పెరిగిన ముగ్గురు కుమార్తెలు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు కృషి చేస్తున్నారన్నారు. తొలి ప్రయత్నంలోనే కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన మరో హోం గార్డు అస్లాంబేగ్ కుమారుడు అబ్దుల్ ఆలీ బేగ్‌ను, హోం గార్డు రాఘవులు కుమారుడు పూర్ణనాగార్జునను అభినందించారు. అదేవిధంగా కమిషనరేట్ పరిధిలోని హోంగార్డులు విధులు నిర్వర్తిస్తూ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన 21మందిని సీపీ అభినందించి, జ్ఞాపికలు అందజేశారు. డీసీపీ కేజీవీ సరిత, హోంగార్డ్ ఆర్ఐ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

తిరువూరుకు మినీ ట్యాంక్‌బండ్!

చారిత్రక 'దేవసముద్రం' చెరువు ఆధునికీకరణకు ప్రతిపాదనలు

మధిర మెయిన్ రోడ్డు పక్కనే పర్యాటకంగా అలరారుతున్న ప్రాంతం ● ప్రతిపాదనలకు రూపకల్పన చేస్తున్న ఎమ్మెల్యే



దేవసముద్రం చెరువు

ఆంధ్రజ్యోతి, తిరువూరు: మినీ ట్యాంక్ బండ్‌గా చారిత్రక నేపథ్యం కలిగిన 'దేవసముద్రం' ఆధునీకరణకు రంగం సిద్ధమైంది. పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు, మధిర ప్రధాన రోడ్డు పక్కనే ఉన్న దేవసముద్రం చెరువును ఆధునీకరించి, మినీ ట్యాంక్‌బండ్‌గా రూపొందించేందుకు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ప్రతిపాదనలు తయారు చేయిస్తున్నారు. ఈ చెరువుకెంతో చరిత్ర ఉంది. దీన్ని 13వ శతాబ్దంలో కాకతీయరాజు గణపతిదేవుడు నిర్మించతలపెట్టాడు. ఆయన చివరిదశలో రాణిగా బాధ్యతలు స్వీకరించిన రాణిరుద్రమదేవి పూర్తిచేసినట్టు ప్రచారంలో ఉంది. తొలుత దేవతల చెరువుగా పేరొందిన ఈ చెరువు కాలక్రమంలో దేవసముద్రంగా పిలవబడుతోంది. ప్రస్తుత రికార్డుల ప్రకారం, ఆర్ఎస్ నెం.81లో 12.10 ఎకరాలు, 84లో 18.25 ఎకరాలు, 164లో 44.44 ఎకరాలు, మొత్తం 77.79 ఎకరాల విస్తీర్ణం గల ఈ చెరువు పరిధిలో సుమారు 200 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. ఈ చెరువుకు ఎన్ఎస్పీ తిరువూరు మేజర్, రాకట్టు సప్లయి చానల్ కాల్వల నుంచి నీరు చేరుతుంది. వేసవిలోనూ ఈ చెరువులో కొంతమేర నీరుంటుంది. ప్రస్తుతం ఈ చెరువు కొంత ఆక్రమణకు గురికాగా, కొంతస్థలంలో చెత్తవేస్తుండటంతో డంపింగ్‌యార్డుగా మారుతోంది. నిత్యం ఆంధ్ర-తెలంగాణ ప్రాంతాలకు రాకపోకలతో ఈ ప్రధాన రహదారి రద్దీగా ఉంటుంది. పట్టణం ప్రారంభంలో ఉన్న దేవసముద్రం చెరువు వద్ద చెత్తఇతర వ్యర్థాలు వేస్తుండటంతో, ఈ ప్రాంతం దుర్వాసనతో, అపరిశుభ్రంగా తయారవుతోంది. ప్రస్తుతం ఈ చెరువు చుట్టూ కట్టలు పూర్తిస్థాయిలో నిర్మించడంతో పాటు కట్టకు ఇరువైపుల చెట్లు, వివిధ రకాల పూలమొక్కలతో నందనవనంగా మార్చడం, పట్టణంలో ఎక్కడా సరైన పార్కు లేకపోవడంతో, చెరువుకట్టపై ఉదయం సాయంత్రం నడక వ్యాయామానికి అనువుగా ట్రాక్ ఏర్పాటు, ఈ రహదారిపై రాకపోకలు సాగించే వారు, సీనియర్ సిటిజన్లు, ఇతరులు సేద తీరేందుకు, చెరువు ఆధునీకరణతో పాటు, కొంతభాగం అన్ని వసతులతో పార్కు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇటీవల మధిర రోడ్డులో పీటీ కొత్తూరు వద్ద జవహర్ నయోదయ స్కూల్ ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని జిల్లా అధికారులకు చూపించడం, పట్టణ పరిధిలోని ఏడు చెరువులకు సాగునీరందించే రాకట్టు సప్లయి చానల్ (కట్టుకాల్వ), ఎన్ఎస్పీ కాల్వల పూడికతీత పనులతో, మెట్టప్రాంతమైన తిరువూరుకు, సాగునీటి ఎద్దడిని తగ్గించడంతో పాటుగా, దేవసముద్రం చెరువును ఆధునీకరించి మినీ ట్యాంక్‌బండ్‌గా రూపొందించేందుకు ఎమ్మెల్యే చేస్తున్న ప్రతిపాదనలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఎన్ఎస్పీ నుంచి చెరువుకు నీరు అందించే సప్లయి చానల్

సృజనాత్మక ఆర్థిక కేంద్రంగా కొండపల్లి

- కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంతో పాటు దేశ, విదేశాల్లో ప్రత్యేక గుర్తింపు పొందిన కొండపల్లి బొమ్మల ఔన్నత్యాన్ని నేటితరానికి చాటిచెప్పేలా, భవిష్యత్తు తరాలకు వారసత్వ సంపదగా అందించేలా చేపట్టిన ఎక్స్‌పీరియన్స్ సెంటర్ పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేసి వీలైనంత త్వరగా పర్యాటకులకు అందుబాటులోకి తేవాలని, కొండపల్లిని ఒక మోడల్ గ్రామీణ సృజనాత్మక ఆర్థిక కేంద్రంగా మార్చడానికి సమష్టి కృషి అవసరమని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో సెంటర్ పనులపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ (ఏపీటీఏ), యంగ్ ఇండియన్స్ (వైఐ) అమరావతి చాప్టర్, కొండపల్లిని మోడల్ గ్రామీణ సృజనాత్మక ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు జిల్లా అధికార యంత్రాంగంతో కలిసి పనిచేసేందుకు ముందుకొచ్చాయి. కొండపల్లి ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో కళాత్మక సౌందర్యం ఉట్టిపడేలా మ్యూరల్ పెయింటింగ్స్ పనులు పూర్తయ్యాయని, మిగిలిన సుందరీకరణ, ఆర్చ్ పనులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. శతాబ్దాల చారిత్రక వారసత్వానికి సజీవ సాక్ష్యంగా ఉన్న కొండపల్లి బొమ్మల చారిత్రక వైభవం, బొమ్మల తయారీకి ఉపయోగించే తెల్ల పొణికి చెక్క ప్రాచుర్యాన్ని, బొమ్మలకు సంబంధించిన విశేషాలను పర్యాటకులకు కళ్లకు కట్టినట్లుగా తెలిపి ప్రత్యక్ష అనుభూతి పొందేలా ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను తీర్చిదిద్దుతున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. టూరిజం విజయవాడ హబ్ రీజనల్ డైరెక్టర్ వైవీ ప్రసన్న లక్ష్మి, జిల్లా పర్యాటక అధికారి ఏ శిల్ప, టూరిజం కన్సల్టెంట్ సాహితి, ఏపీటీడీసీ డీఈ కుమార్, ఏపీటీఏ, వైఐ ప్రతినిధులు పాల్గొన్నారు.



వాట్సాప్ గవర్నెన్స్ అవగాహన ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్ లక్ష్మీశ

వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన

డిజిటల్ సేవల్లో భాగంగా అందుబాటులో ఉన్న వాట్సాప్ గవర్నెన్స్ (మనమిత్ర యాప్)పై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ప్రజల చేతిలో ప్రభుత్వంలో భాగంగా అందుబాటులో ఉన్న వాట్సాప్ గవర్నెన్స్‌పై సచివాలయ అధికారులు, సిబ్బందితో అవగాహన ర్యాలీని కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియా మంగళవారం బందరురోడ్డులోని బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒక్క నెంబరుతో 26 శాఖలకు చెందిన 200కు పైగా సేవలు ప్రతి పౌరుడికి అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. మనమిత్ర వాట్సాప్ నెంబరు 9552300009 అవగాహన కల్పించాలన్నారు. ఈ ర్యాలీ డాక్టర్ అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించారు. వీఎంసీ అదనపు కమిషనర్ చంద్రశేఖర్, గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జీ జ్యోతి పాల్గొన్నారు.

పీ4లో భాగస్వాములవుతాం

సమాజాన్ని పేదరికం నుంచి దూరం చేయాలనే గొప్ప లక్ష్యంతో సీఎం దార్శనికతకు అనుగుణంగా రాష్ట్రప్రభుత్వం వినూత్నంగా ప్రారంభించిన పీ4 విధానంలో తాము సైతం భాగమవుతామంటూ రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్, స్నేహప్తి చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు ముందుకొచ్చారు. ఈ మేరకు కలెక్టర్ లక్ష్మీశకు తమ ఆసక్తిని తెలిపారు. ఈ మేరకు వారు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బంగారు కుటుంబాలకు బాసటగా నిలిచేందుకు చాలామంది వ్యక్తులు, సంస్థలు ముందుకు రావడం సంతోషాన్నిస్తోందన్నారు. సామాజిక బాధ్యతగా మొదటగా 100 కుటుంబాలను దత్తత తీసుకొంటామని, తమ లక్ష్యం వెయ్యి కుటుంబాలని రోటరీ మిడ్‌టౌన్ ప్రతినిధులు తెలిపారు. తాము కూడా కొన్ని కుటుంబాలను దత్తత తీసుకుంటామని స్నేహప్తి చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు తెలిపారు. రోటరీ మిడ్‌టౌన్ ప్రెసిడెంట్ వీ చంద్రశేఖర్, సెక్రటరీ వీ నాగవసంత కుమార్, స్నేహప్తి చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ వీ భారతీదేవి, ట్రెజరర్ టీ మాధురి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

పన్ను కట్టకుంటే కఠిన చర్యలు

- కలెక్టర్ ఆదేశాలతో పన్నుల వసూళ్లకు ప్రత్యేక టీమ్‌లు

కార్పొరేషన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఖాళీస్థలాల యజమానులకు నగరపాలక సంస్థ ఝలక్ ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది. నగరంలో ఖాళీ స్థలాల యజమానుల పన్నుల బకాయిలు రూ.కోట్లకు చేరుకోవడంతో వాటి వసూళ్లకు వీఎంసీ ప్రణాళిక సిద్ధం చేసింది. కలెక్టర్ ఆదేశాలతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసింది. ఈ మేరకు మంగళవారం కమిటీ మొదటి సమావేశం కమిషనర్ ధ్యానచంద్ర పర్యవేక్షణలో జరిగింది. గత ఏడాది రూ.237కోట్ల పన్నులు వసూలు చేయాల్సి ఉండగా కేవలం రూ.19 కోట్లు మాత్రమే వసూలవడంతో కమిషనర్ ధ్యానచంద్ర ఖాళీస్థలాల యజమానుల గుర్తించి పన్నులు కట్టించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సమావేశంలో అధికారులు సిబ్బంది పన్నుల వసూలుకు చేపట్టాల్సిన కార్యచరణను కమిషనర్ ధ్యానచంద్ర అధికారులకు వివరించారు. ఖాళీ స్థలాల బకాయిలు చెల్లించకుంటే నోటీసులు జారీ చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్డీవో కే చైతన్య, డిస్ట్రిక్ రిజిస్టర్ దుర్గాప్రసాద్, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జీ సృజన, చీఫ్ సిటీప్లానర్ సంజయ్ రత్నకుమార్, అసిస్టెంట్ కమిషనర్లు హెలెన్, శ్రీనివాస్, ఏయూబీ శర్మ, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, ఏసీ ప్లానర్లు రాంబాబు, మోహన్ బాబు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి రైతుకూ

ఖరీఫ్, రబీ పంట రుణాలు

- కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురామ్



విజయవాడ సిటీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు (కేడీసీసీబీ) పరిధిలోని అర్హులైన ప్రతి రైతుకు ఈ ఏడాది ఖరీఫ్, రబీ పంట రుణాలను అందించేందుకు సంసిద్ధంగా ఉన్నామని కేడీసీసీబీ ఛైర్మన్ నెట్టెం రఘురామ్ స్పష్టం చేశారు. ఈ ఏడాది జూలై 31 నాటికి ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలోని 47,014 మంది రైతులకు రూ.753.80 కోట్లను రుణాలుగా మంజూరు చేశామన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి జూలై 31 వరకు మంజూరు చేసిన రుణాల వివరాలను విజయవాడలోని కేడీసీసీబీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాకు వెల్లడించారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో కేడీసీసీబీకి 425 పీఏసీఎస్‌లున్నాయని, ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి పంటకు ఎకరానికి రూ.50వేలు, మిర్చికి రూ.1.15 లక్షలు చొప్పున జూలై నెలాఖరు నాటికి 38వేల మంది రైతులకు రూ.341 కోట్ల రుణాలు అందజేశామన్నారు. చేపల చెరువుకు వర్కింగ్ క్యాపిటల్ రుణంగా రూ.79 కోట్లు, టర్మ్ రుణంగా రూ.225 కోట్లు, ఎస్టీ రుణాలు రూ.63.97 కోట్లు, వ్యవసాయ బంగారు రుణాలు రూ.36 కోట్లు, కౌలురైతులకు రూ.8.88 కోట్లు మంజూరు చేశామన్నారు. ఖరీఫ్ సీజన్ రుణాలు ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు మంజూరు చేస్తామని, జూలై నెలాఖరు నాటికి 82 శాతం రుణాల మంజూరు పూర్తి చేశామన్నారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది రూ.134 కోట్లు అదనంగా మంజూరు చేసినట్టు తెలిపారు.

విద్యుత్ అంతరాయానికి అధికారులే బాధ్యత వహించాలి

ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి

విజయవాడ సిటీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): లైన్ల మరమ్మతులు, పాడైన ట్రాన్స్‌ఫార్మర్ల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఏపీసీపీడీసీఎల్ ఛైర్మన్, ఎండీ పీ పుల్లారెడ్డి హెచ్చరించారు. సీపీడీసీఎల్ పరిధిలోని ఎన్టీఆర్, కృష్ణా, సీఆర్డీఏ, గుంటూరు, ప్రకాశం, పల్నాడు, బాపట్ల జిల్లాల అధికారులతో విజయవాడలోని ఎన్టీఆర్ సర్కిల్ కార్యాలయంలో సీఎండీ సమావేశమై, అధికారులకు దిశానిర్దేశం చేశారు. 33/11 కేవీ సబ్ స్టేషన్స్ సరఫరా లైన్ల అంతరాయాలను తగ్గించాలన్నారు. సిబ్బందిని, సామగ్రిని ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఫిర్యాదులొస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీఎం సూర్యఘర్ పథకాన్ని ఎస్సీ, ఎస్టీ గృహ సబ్సిడీ వివరాలను వినియోగదారులకు వివరించి, ఇంటి పై కప్పపై సోలార్ ప్యానెల్‌లు ఏర్పాటు చేసేందుకు లబ్ధిదారుల నుంచి సమ్మతి లేఖ తీసుకోవాలన్నారు. ఆర్‌డీఎస్ఎస్ పథకంలో మంజూరైన మండల ప్రాంతాల్లో 33కేవీ, 11 కేవీ వ్యవసాయ ఫీడర్లను విభజించే పనులకు త్వరగా పూర్తి చేసి ఆయా ప్రాంతాలకు 24 గంటల నిరంతర 3-ఫేస్ విద్యుత్ సరఫరా అందించాలని ఆదేశించారు. టెక్నికల్ డైరెక్టర్ మురళీకృష్ణ యాదవ్, ప్రాజెక్ట్ డైరెక్టర్ కేవీఎస్ఎన్ మూర్తి, ఫైనాన్స్ డైరెక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు, ఎస్ఈ తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నలుగురు ఉద్యోగులపై టీటీడీ చర్యలు

తిరుపతి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నిబంధనలను అతిక్రమించారంటూ నలుగురు ఉద్యోగులపై టీటీడీ చర్యలకు పూనుకుంది. గతేడాది అక్టోబరు 2వ తేదీన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తిరుమల పర్యటన క్రమంలో శ్రీనివాస మంగాపురంలో విధులు నిర్వహించే బాలాజీ రంగకుమార్ అనే అర్చకుడితో పాటు తిరుపతి ఈఈ కార్యాలయంలో పనిచేసే చీర్ల కిరణ్ అనే జూనియర్ అసిస్టెంట్ క్రమశిక్షణ నిబంధనలు ఉల్లఘించి డిప్యూటీ సీఎంను అనుసరించారని విజిలెన్స్ విభాగం నివేదికలో స్పష్టం చేసింది. దీంతో ఆలయంలోకి ప్రవేశించడానికి గల కారణాలు తెలియజేయాలని ఈ ఇద్దరికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇక, తన ఇంటిని ఇతరులకు కేటాయించడంతో పాటు ఆర్థిక లావాదేవీలు ఉన్నట్టు నిర్ధారణ కావడంతో ఆఫీస్ సబార్డినేట్ శంకర్‌ను, ప్రైవేట్ వ్యక్తులతో కలిసి వ్యాపారాలు నిర్వహించిన జూనియర్ అసిస్టెంట్ రామును సస్పెండ్ చేస్తూ టీటీడీ ఉత్తర్వులు జారీ చేసింది.

పెంచిన కరెంట్ చార్జీలను తగ్గించాల్సిందే: సీపీఐ

అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పెంచిన కరెంట్ చార్జీలను తగ్గించాల్సిందేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్తు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించాలని, అదానీ కంపెనీతో చేసుకున్న అన్ని ఒప్పందాలను రద్దు చేయాలని ఒక ప్రకటనలో కోరారు. ఇవే డిమాండ్లతో వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్తు కార్యాలయాల వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమాలు విజయవంతమయ్యాయని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

భావనపాడు తీరంలో ముగ్గురు విద్యార్థుల గల్లంతు

టెక్కలి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం భావనపాడు తీరంలో మంగళవారం సాయంత్రం సముద్ర స్నానాలకు దిగి ముగ్గురు విద్యార్థులు గల్లంతయ్యారు. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం మాడేవానిపేలకు చెందిన దున్న దుర్యోధన (18), పూడి జగన్నాథపురం గ్రామానికి చెందిన తిమ్మల జష్వంత్ 18, పలాస మండలం టెక్కలిపట్నానికి చెందిన రాయల రాజేష్ (19) విజయనగరం జిల్లా గజపతినగరం దరి బాలాజీ డిప్లొమో కళాశాలలో చదువుతున్నారు. మంగళవారం సాయంత్రం భావనపాడు వద్ద సముద్రస్నానానికి వెళ్లిన వీరు అలల ధాటికి కొట్టుకుని పోయారని స్థానిక మత్స్యకారులు తెలిపారు. వెంటనే సముద్రంలోకి దిగి గాలించినా ఆచూకీ లభించలేదు. అనంతరం మెరైన్ పోలీసులకు సమాచారం ఇవ్వగా.. రాత్రి వరకు గాలింపు చర్యలు కొనసాగాయి. నౌపడా ఎస్ఐ నారాయణ స్వామి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగులు లంచంగా ప్లాట్లు అడుగుతున్నారు

- మంత్రి నారాయణకు రాజధాని రైతుల ఫిర్యాదు

విజయవాడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కొందరు ఉద్యోగులు లంచం కింద ప్లాట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని మంత్రి నారాయణకు మంగళవారం సీఆర్డీఏ కార్యాలయంలో అమరావతి రైతు జేఏసీ నేతలు ఫిర్యాదు చేశారు. రాజధాని అమరావతి రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. రైతుల అంశాలపై సుప్రీం కోర్టులో ఉన్న పలు కేసులు, రైతులకు ఇచ్చే కౌలు అంశంపై మంత్రితో చర్చించారు. 29 గ్రామాల్లో రోడ్లు, మంచినీరు, డ్రైనేజీ నిర్మాణం కోసం రూ.90 కోట్లు కేటయించాలని మంత్రిని కోరారు. హై టెన్షన్ వైర్లు తొలగించడంతో పాటు ఇళ్ల లేని నిరుపేదలకు టిడ్కో ఇళ్ల కేటాయించాలని మంత్రిని కోరారు. వచ్చే రెండేళ్లలో రైతుల ప్లాట్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యాలయం నుంచి బయటకు వచ్చిన మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ, అమరావతి రైతులకు సమస్యలున్న మాట వాస్తవమేనని, కౌలు సంబంధించి కొన్ని సమస్యలు ఉన్నాయన్నారు. నాడు దాదాపు రూ.9 వేల కోట్లతో ల్యాండ్ పూలింగ్ చేసినట్టు గుర్తు చేశారు. 29 గ్రామాలు అమరావతిలో నగరంలో రూపాంతరం చెందుతాయన్నారు. రెండోదశ ల్యాండ్ పూలింగ్‌పై ఇబ్బంది లేదని, రైతులు భూములు ఇవ్వాలా వద్దా అన్నది వారిష్టమని మంత్రి పేర్కొన్నారు. సీఆర్డీఏలో రెవెన్యూ ఉద్యోగులు అవినీతిపై ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. అమరావతి నిర్మాణంలో రైతుల సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు.



తల్లిపాల బ్యాంకు ప్రారంభోత్సవంలో పాల్గొన్న డీసీపీ సరిత, రెయిన్‌బో హాస్పిటల్ వైద్యులు డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ వంశీశివరామరాజు

రెయిన్‌బో హాస్పిటల్ కీలక ముందడుగు

- నవజాత శిశువులకు తల్లిపాల బ్యాంక్ ప్రారంభం

భారతీనగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అప్పుడే పుట్టిన పిల్లలకు ముఖ్యంగా నెలలు నిండకుండా పుట్టిన శిశువుకు తల్లిపాలు అవసరమని డీసీపీ సరిత అన్నారు. నాగార్జున నగర్ సర్వీస్ రోడ్డులోని రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్లో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లిపాల బ్యాంక్ ప్రారంభోత్సవం మంగళవారం జరిగింది. డీసీపీ సరిత ప్రారంభించి మాట్లాడుతూ తల్లిపాల బ్యాంక్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. రెయిన్‌బో హాస్పిటల్ వైద్యులు డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ వంశీ శివరామరాజు మాట్లాడుతూ అత్యవసర చికిత్స అవసరమైన రెయిన్‌బో హాస్పిటల్‌లోని నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎన్ఐసీయూ)లో చేరిన శిశువులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న నవజాత శిశువులకు తల్లిపాలు ఓ వరం లాంటిదన్నారు. కొన్ని కారణాలతో తల్లులు పాలివ్వలేని సందర్భాల్లో ఈ మిల్క్ బ్యాంక్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. దాతల నుంచి సేకరించిన సురక్షితమైన, పాశ్చరైజ్డ్ చేసిన పాలను ఈ బ్యాంక్ ద్వారా శిశువులకు అందిస్తారన్నారు. అత్యాధునిక సదుపాయాలతో విజయవాడలో ప్రారంభించిన ఈ మదర్స్ మిల్క్ బ్యాంక్ ఏకంగా 500 లీటర్ల పాలను నిల్వచేయగల సామర్థ్యం కలిగి ఉందన్నారు. ఇప్పటివరకు 50 మంది దాత తల్లుల ఔదార్యంతో విజయవాడలో 100 మందికి పైగా శిశువులు ప్రయోజనం పొందారన్నారు. పాలు దానం చేయాలనుకునే తల్లులకు రెయిన్‌బో హాస్పిటల్ స్వాగతం పలుకుతోందన్నారు. ఆసక్తి ఉన్నవారు టోల్ ఫ్రీ నెంబర్ 9703771222లో లాక్టేషన్ సపోర్ట్ టీమ్‌ను సంప్రదించి, అవసరమైన సలహాలు, శిక్షణ పొందవచ్చని యాజమాన్యం తెలిపారు. డాక్టర్ బీఎస్‌సీపీ రాజు, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ భ్రజిష్ట, హాస్పిటల్ యాజమాన్యం పాల్గొన్నారు.

జగన్ పాలనలో భ్రష్టుపట్టిన విద్యావ్యవస్థ

- శాప్ ఛైర్మన్ రవినాయుడు



లోగో ఆవిష్కరిస్తున్న శాప్ ఛైర్మన్ రవినాయుడు

విజయవాడ స్పోర్ట్స్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో విద్యావ్యవస్థను భ్రష్టుపట్టించారని, విద్యార్థుల సమస్యలపై ప్రశ్నించిన విద్యాసంఘాల నేతలను అక్రమంగా అరెస్టులు చేయించిన దౌర్భాగ్య పరిస్థితులు నెలకొన్నాయని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు వ్యాఖ్యానించారు. రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్ (ఆర్ఎస్‌యూ) 10వ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన లోగో, పోస్టర్‌ను విజయవాడలోని శాప్ కార్యాలయంలో శాప్ ఛైర్మన్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఐటీ మంత్రిగా పనిచేసిన అమర్‌నాథ్ కోడిగుడ్డుపై వెంట్రుకలు పీకడానికి కూడా సరిపోడన్నారు. విద్యా వ్యవస్థ బలోపేతానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి లోకేశ్ విప్లవాత్మక మార్పులు, సంస్కరణలు తెస్తున్నారన్నారు. అనంతరం ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్ రెడ్డి మాట్లాడుతూ సెప్టెంబరు 12, 13, 14న అమరావతి వేదికగా రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి పనులు వేగవంతం

నిర్ధిష్టమైన ప్రణాళికతో రాష్ట్రంలో క్రీడాభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. స్టేడియంలోని శాప్ కార్యాలయంలో మంగళవారం శాప్ 85వ సమావేశం జరిగింది. శాప్ ఎండీ అజయ్ జైన్, బోర్డు సభ్యులు పాల్గొని పలు నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. గత బోర్డుమీటింగ్‌లో తీర్మానించిన అంశాలు, కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. శాప్ అధికారులు, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.



వన్ పీస్ డ్రెస్‌లతో వయ్యారంగా..!

ఫ్యాషన్

మారుతున్న పోకడలకు అనుగుణంగా సరికొత్త హంగులద్దుకుని 'వన్ పీస్ డ్రెస్‌లు' ట్రెండింగ్‌లోకి వచ్చేశాయి. ఒకవైపు సంప్రదాయం, మరోవైపు ఆధునికత కలగలసినట్లు ఉండడంతో... యువతులు, ఉద్యోగినులు ఈ డ్రెస్‌లను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ఆకర్షణీయమైన రంగుల్లో వివిధ డిజైన్లలో ఇవి లభ్యమవుతున్నాయి. రోజువారీ ధరించడానికి సాధారణ డిజైన్లను ఫంక్షన్లు, పార్టీల కోసం గ్రాండ్‌గా కనిపించేవాటిని ఎంపిక చేసుకుంటున్నారు మహిళలు.

ఈ డ్రెస్ మొత్తాన్ని ఒకే ఫ్యాబ్రిక్‌తో రూపొందిస్తారు. ఇది చూడడానికి ఫ్రాక్ మాదిరి కనిపిస్తుంది. పై భాగం అంటే టాప్ సన్నగా, కింది భాగం అంటే స్కర్ట్ వెడల్పుగా ఉంటుంది. టాప్ భాగానికి పొట్టి లేదా పొడవు చేతులు పెడుతుంటారు. దీనికి అందమైన నెక్ డిజైన్లు జోడిస్తారు. స్కర్ట్ భాగం.. మోకాళ్ల లేదా పాదాల వరకు పొడవుండే డిజైన్లు అందుబాటులో ఉన్నాయి. అంబరిల్లా కట్, ఫ్రిల్స్ టైప్, మ్యాక్సీ, ఫ్లేర్డ్ మోడల్ డ్రెస్‌లను యువతులు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. ఇవి ధరించడానికి సౌకర్యవంతంగా ఉండడంతో పాటు శరీరాకృతికి తగ్గట్టు ఇమిడిపోతాయి.

ఎలాంటి ఫ్యాబ్రిక్‌తోనైనా ఈ 'వన్ పీస్ డ్రెస్'లను చక్కగా డిజైన్ చేయవచ్చు. ఫ్లోరల్ ప్రింట్లు, చెక్స్ ఉన్న కాటన్, లినెన్ డ్రెస్‌లు.. కార్యాలయాలు, కాలేజీలకు వెళ్లేటప్పుడు ధరించడానికి అనువుగా ఉంటాయి. వీటిని ప్రయాణాలప్పుడు వేసుకున్నా హాయిగా అనిపిస్తుంది. జార్జెట్, షిఫాన్, సిల్క్, నెటెడ్ ఫ్యాబ్రిక్‌లతో రూపొందించిన డ్రెస్‌లు గ్రాండ్‌గా కనిపిస్తాయి. వీటికి కుందన్, జర్దోసి, ఎంబ్రాయిడరీ వర్క్‌లను జోడించి మరింత ప్రత్యేకంగా అందుబాటులోకి తెస్తున్నారు. ఇవి పుట్టిన రోజు, పెళ్లిరోజు లాంటి సందర్భాల్లో; ఫంక్షన్లలో వేసుకోవడానికి బాగుంటాయి. ఇలా వన్ పీస్ డ్రెస్ ధరించినప్పుడు లైట్ మేకప్, సింపుల్ హెయిర్ స్టయిల్, మెడలో డాలర్ చెయిన్, చెవులకు పెద్ద జుంకాలు లేదా చాంద్‌బాలీలు, చేతికి వాచ్ లేదా బ్రాస్‌లెట్, మధ్య వేలికి పెద్ద రింగ్, పాదాలకు అందమైన శాండల్స్ వేసుకుంటే చాలు.. ఆకర్షణీయంగా కనిపిస్తారు.





ఒంటిచేత్తో పతకాలు పట్టేస్తోంది!

ఆమెది సాధారణ వ్యవసాయ కుటుంబం... పుట్టుకతోనే వైకల్యం... ఒకవైపు సమాజం చిన్న చూపు... మరోవైపు లోకుల సానుభూతి... మానసిక స్థైర్యంతో వీటన్నిటినీ అధిగమించి... పారా క్రీడల్లో రాణిస్తోంది హెచ్.శివాని. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఏడు స్వర్ణ పతకాలు సాధించి, ఎందరికో ప్రేరణగా నిలుస్తున్న శివాని కథ ఆమె మాటల్లోనే...

"మాది కర్నూలు జిల్లా మద్దికెర. ఈరన్న, లలిత నా తల్లిదండ్రులు. మాది వ్యవసాయ కుటుంబం. నాన్న రోజూ గుంతకల్లుకు వెళ్లి... ఆకుకూరలు అమ్మేవారు. పుట్టుకతోనే నా కుడి చెయ్యి మోచేతి వరకూ మాత్రమే ఉంది. అది చూసిన కొందరు బంధువులు, ఇరుగు పొరుగువారు "ఈ అమ్మాయి మీకెందుకు? ఎక్కడైనా బయట పడేయండి. ఇంట్లోకి తెచ్చుకోవద్దు" అని గట్టిగా చెప్పారట. కానీ మా అమ్మ, నాన్న ఆ మాటలేవీ పట్టించుకోలేదు. నా తరువాత పుట్టిన ఇద్దరు తమ్ముళ్లతోపాటు నన్ను ఎంతో ప్రేమగా చూసుకున్నారు. అయితే ఇంటి బయట పరిస్థితి వేరేగా ఉండేది. సగమే ఉన్న నా చెయ్యిని చూసి చాలామంది ఏమైందని అడిగేవాళ్లు. సానుభూతి చూపించేవాళ్లు. అటువంటప్పుడు 'నేను ఏమీ చేయలేనా? ఏమీ సాధించలేనా?' అని ఎంతో బాధ కలిగేది. ఒకప్పుడు నన్ను ఎక్కడైనా పడేయమని చెప్పినవాళ్లు ఆశ్చర్యపడేలా ఏదైనా సాధించాలని అనుకునేదాన్ని. నేను ఐదవ తరగతిలో కొడుమూరులో మా మేనత్త ఇంట్లో ఉండేదాన్ని అక్కడే నవోదయ పరీక్షలకు కోచింగ్ తీసుకున్నాను. కర్నూలు నవోదయ స్కూల్‌లో సీటు వచ్చింది. అక్కడ స్నేహితులు నన్ను చాలా బాగా చూసుకునేవాళ్లు. .

అలా అన్నవారే మెచ్చుకున్నారు...

మా స్కూల్ ప్రిన్సిపాల్ (ప్రస్తుతం నవోదయ విద్యాలయ సమితి అసిస్టెంట్ కమిషనర్) సాగరిక మేడమ్ చొరవతో నా జీవితం కొత్త మలుపు తిరిగింది. నేను తొమ్మిదో తరగతి చదువుతున్నప్పుడు.. తెలంగాణలోని రంగారెడ్డి నవోదయ స్కూల్‌లో జరుగుతున్న పారా స్పోర్ట్స్‌కు పంపించారు. అక్కడ షాట్‌పుట్, జావెలిన్ త్రోలో నా టాలెంట్‌ను గుర్తించి నన్ను ఎంపిక చేశారు. నాకు చదువుతో పాటు క్రీడల్లో కూడా రోజూ శిక్షణ ఇచ్చారు. శిక్షణకు రోజూ మధ్యాహ్నం వెళ్లి, రాత్రికి వచ్చేవాళ్లం. ఒక వైపు శిక్షణ తీసుకుంటూనే... జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీలలో పాల్గొన్నా. మొదట గుజరాత్‌లో జరిగిన ఈవెంట్లలో షాట్‌పుట్‌లో సిల్వర్ మెడల్, జావెలిన్ త్రోలో గోల్డ్ మెడల్ వచ్చింది. దాంతో ఒకప్పుడు మా కుటుంబాన్ని పట్టించుకోనివారు కూడా.. మా ఇంటికి వచ్చి, మా అమ్మానాన్నలతో. నా గురించి గొప్పగా మాట్లాడారు. "ఈ అమ్మాయి ఏమీ చేయలేదని అనుకున్నాం.. అయితే చాలా గొప్పగా సాధించింది" అని అభినందించారు.

అందరిలోనూ నైపుణ్యం ఉంటుంది...

తమకు వైకల్యం ఉందనీ, జీవితంలో ఏదీ సాధించలేమని కొందరు నిరుత్సాహపడుతూ ఉంటారు. ఇది సరైన ఆలోచన కాదు. ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక నైపుణ్యం ఉంటుంది. నేను క్రీడల్లో పాల్గొనడానికి బయట రాష్ట్రాలకు వెళ్లినప్పుడు ఎంతోమందిని చూశాను. నాకు చెయ్యి మాత్రమే లేదు. వాళ్లకు ఇంకా చాలా అవయవాలు లేవు. 'వాళ్లకన్నా నేనే అదృష్టవంతురాలిని కదా' అనుకున్నాను. ఇప్పుడు నాకు చెయ్యి లేదన్న విషయమే గుర్తుకు రాదు. భవిష్యత్తులో బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగం చేయాలనేది నా లక్ష్యం. అందుకే మదనపల్లె నవోదయ స్కూల్‌లో ఇంటర్‌లో చేరాను. మా ప్రిన్సిపాల్ గీత మేడమ్ నా సమస్యను కలెక్టర్ శ్రీధర్ చామకూరి గారి దృష్టికి తీసురువెళ్లారు. ఆయన సాయంతో నాకు కృత్రిమమైన కుడి చేతిని అమర్చారు. ఆ చేతికి ఇంకా అలవాటు పడాల్సి ఉంది. మా స్కూల్‌లో నా పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు.. నా డైట్, ప్రాక్టీస్ విషయంలో చాలా జాగ్రత్తగా చూసుకుంటున్నారు. కోచ్ సహకారంతో రోజూ ప్రాక్టీస్ చేస్తున్నాను."

● గౌనిపల్లె శ్రీనివాసులు

చాలా గర్వంగా అనిపించింది



2023లో థాయ్‌లాండ్‌లో జరిగిన ఈవెంట్లలో రెండు బంగారు పతకాలు సాధించాను. అక్కడ మన జాతీయ గీతం ఆలపించడం, నా శరీరంపై మన త్రివర్ణ పతాకాన్ని కప్పుకోవడం మాటలకు అందని, ఎన్నటికీ మరచిపోలేని అనుభూతి. చాలా గర్వంగా అనిపించింది. 2024లో కూడా థాయ్‌లాండ్‌లో పతకాలు గెలిచాను. ఇప్పటికి నేను ఏడు స్వర్ణ పతకాలు, ఒక రజత పతకం సాధించాను. దీనికి మా కోచ్ వేణు వినకోటి సహకారం ఎంతో ఉంది. భవిష్యత్తులో దేశం కోసం మరిన్ని పతకాలు గెలవాలన్నదే నా లక్ష్యం.

అందంగా ఇస్తినమ్మ వాయినం...

వరలక్ష్మీ వ్రతం చేసుకున్న తరవాత బంధుమిత్రులను, ఇరుగు-పొరుగు మహిళలను పిలిచి వాయినాలు ఇస్తూ ఉంటాం. తాంబూలం లేదా పసుపు-బొట్టు అని పిలిచే ఈ వాయినంలో పసుపు కొమ్ములు, కుంకుమ, తమలపాకులు, వక్కలు, పూలు, పండ్లు, గాజులు, చీర లేదా రవికెల గుడ్డ, నానబెట్టిన శనగలు, జాజికాయ, రూపాయి బిళ్ల, చెక్క, దువ్వెన, చిన్న అద్దం, కాటుక భరిణె, గోరింటాకు, కొబ్బరికాయ, పసుపు తాడు తదితరాలు ఉంటాయి. ఇలా వాయినంతోపాటు చిన్న బహుమతిని కూడా ఇస్తూ మురిసిపోతుంటారు మహిళలు. అలా ఇవ్వదగ్గ బహుమతుల గురించి తెలుసుకుందాం...



- ప్రస్తుతం రకరకాల పోట్లీ బ్యాగ్‌లు లభ్యమవుతున్నాయి. ఇవి చూడడానికి అందంగా ఆకర్షణీయంగా ఉంటున్నాయి కూడా. వీటి ధర అంత ఎక్కువగా ఉండదు. ఈ పోట్లీ బ్యాగ్‌లను తీసుకువచ్చి వాటిలో వాయినాన్ని అందంగా సర్ది ఇవ్వవచ్చు. కాటన్ వస్త్రంతో తయారుచేసిన చిన్న చిన్న బ్యాగ్‌లు, పర్సులు కూడా విరివిగానే దొరుకుతున్నాయి. వీటిమీద చక్కని పెయింటింగ్, ఎంబ్రాయిడరీ, అద్దాలు లేదా పూసల వర్క్‌లు చేసి ఉంటున్నాయి. వీటిని కూడా గిఫ్ట్ కింద ఇవ్వవచ్చు. ఇవి మహిళలకు పలువిధాలుగా ఉపయోగపడతాయి.
- మట్టి, ఇత్తడి, పంచలోహాలతో రూపొందించిన చిన్న లక్ష్మీదేవి బొమ్మను ఇవ్వవచ్చు. అలాగే దీపం కుందులు, పసుపు-కుంకుమ గిన్నెల స్టాండ్, అగరుబత్తులు గుచ్చే స్టాండ్, కర్పూరం వెలిగించే పళ్లెం, రాగి చెంబు ఇచ్చినా ఉపయోగకరంగానే ఉంటాయి. పూలు, లతలు, నెమళ్లతో తెల్లగా మెరిసే హారతి పళ్లెం, సింహాసనం, పూల సజ్జ లాంటి వాటిని కూడా మహిళలు ఎక్కువగా ఇష్టపడుతుంటారు. వీటిని వైట్ మెటల్‌తో తయారు చేస్తారు కాబట్టి ఆకర్షణీయంగా కనిపిస్తుంటాయి.
- చక్కని జరీ బోర్డర్ ఉన్న జాకెట్ గుడ్డను బ్యాగ్‌లా మడత పెట్టి అందులో వాయినాన్ని సర్ది ఇవ్వడం నేటి ట్రెండ్.
- చెక్క, ఇత్తడి లేదా వైట్ మెటల్‌తో రూపొందించిన ట్రే లేదా తాంబాళంలో వాయినాన్ని సర్ది ఇవ్వవచ్చు. తామర పువ్వు ఆకారంలో ఉండే వెడల్పాటి గిన్నెను ఇచ్చినా బాగుంటుంది.
- వరలక్ష్మి వ్రత కథలు, మణిద్వీప వర్ణన, లలిత సహస్రనామాలు, లక్ష్మీదేవి స్తోత్రాలు లాంటి వాటిని పెద్ద అక్షరాలతో ప్రింట్ చేసిన పుస్తకాలు ఇస్తే పెద్దవారికి ఉపయోగకరంగా ఉంటుంది.



ఒంటరితనం వేధిస్తోందా?

ఒక్కోసారి అనుకోని కారణాల వల్ల ఒంటరిగా ఉండాల్సి వస్తుంది. ఆ సమయంలో అనవసరమైన ఆలోచనలు వేధిస్తూ ఉంటాయి. అలాంటి సందర్భాల్లో కుంగిపోకుండా ఆనందంగా ఎలా గడపాలో తెలుసుకుందాం...



- రోజూ కొద్దిసేపు ఇంటి పరిసరాల్లో వాకింగ్ చేయడం అలవాటు చేసుకోవాలి. దీనివల్ల కొత్త స్నేహాలు ఏర్పడవచ్చు. మనసు ప్రశాంతంగా అనిపిస్తుంది. వ్యాయామం, ధ్యానం లాంటివి కూడా ఉపకరిస్తాయి.
- ఆత్మీయులకు ఫోన్ చేసి కొద్దిసేపు మాట్లాడడం వల్ల ఒంటరితనం అనే భావన కలుగదు. వీడియో కాల్ అయితే వెంటనే మనసు కుదుటపడుతుంది.
- ఏదో ఒక పనిలో నిమగ్నమై ఉండడం వల్ల ఒంటరిగా ఉన్నామనే ఆలోచన రాదు. ఇంటి పని, తోటపని లేదంటే ఆఫీసు పని ఇలా ఆసక్తి ఉన్నదానిమీద మనసు నిలిపితే ప్రయోజనకరంగా ఉంటుంది.
- వంట చేయడం, సంగీతం వినడం, పుస్తకాలు చదవడం, కొత్త ప్రదేశాలను సందర్శించడం లాంటివి అలవాటు చేసుకుంటే ఒంటరితనం వేధించదు.
- ఒంటరితనాన్ని ఏకాంతంగా మార్చుకోవాలి. ఏకాంతంగా గడపడం వల్ల శక్తిని పుంజుకుని ఉత్సాహంగా ఉండగల్గుతారు.
- వీలైనప్పుడల్లా వృద్ధులకు, చిన్న పిల్లలకు అలాగే ఇతరులకు చేతనైన సహాయం చేస్తూ ఉంటే మనసు ప్రశాంతంగా అనిపిస్తుంది.
- వ్యక్తిగత శ్రద్ధ, సమాజసేవ, ఇరుగు పొరుగు పిల్లలతో ఆడుకోవడం, నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవడం, సమకాలిక పరిస్థితుల్లో వస్తున్న మార్పులు తెలుసుకోవడం లాంటివి చేస్తూ సమాజంతోపాటు నడుస్తూ ఉంటే ఒంటరితనమనే భావన మాయమవుతుంది.

విభిన్నం



కథలు చెప్పే కేక్‌లు

కళాదృష్టి ఉండాలే కానీ... ఇదిగో ఇలా... కేక్‌ను కూడా అద్భుత కళాఖండాలుగా మలచవచ్చు. ప్రాచీ దబాల్‌దేవ్... ఆమె చేతులో పడితే కేక్‌లు... చారిత్రక కట్టడాలుగా మారిపోతాయి. నిలువెత్తు ఆకృతిలో... రాజసం ఉట్టిపడుతూ... అబ్బురపరుస్తాయి. మన సంస్కృతిని గొప్పగా ఆవిష్కరిస్తాయి. అందుకే ప్రాచీకి కేక్ అంటే... కట్ చేసి నోట్లో వేసుకొని కరిగించేసే తీపి పదార్థమే కాదు... అలనాటి 'తీపి' గుర్తులు, సంప్రదాయ కళల సమ్మేళనం కూడా.

"బేకరీకి వెళ్లగానే ముందుగా నన్ను ఆకట్టుకొనేవి కేక్‌లు. అందుకు కారణం వాటిపై కనిపించే డెకరేషన్. చిన్నప్పటి నుంచీ నా దృష్టి దానిపైనే ఉండేది. ఆ ఆసక్తే ఇవాళ నన్ను కేక్ ఆర్టిస్టను చేసింది. నేను పుట్టి పెరిగిందంతా మధ్యప్రదేశ్‌లోని రెవా జిల్లాలో. ప్రణవేశ్ దబాల్‌తో పెళ్లి తరువాత మా నివాసం ముంబయికి మారింది. ఇంట్లో ఖాళీ దొరికినప్పుడల్లా రకరకాల కేక్‌లు తయారుచేస్తుండేదాన్ని. ఫ్లేవర్స్ మాత్రమే కాకుండా... విభిన్న డిజైన్లు ప్రయత్నిస్తుండేదాన్ని. కొంతకాలానికి అనిపించింది... పూర్తి స్థాయిలో ఈ కళను నేర్చుకోవాలని. నా అదృష్టం ఏంటంటే... సుగర్ క్రాఫ్ట్‌లో పేరు పొందిన సర్ ఎడ్డీ స్పెన్స్ దగ్గర శిష్యరికం చేసే అవకాశం రావడం. బకింగ్‌హామ్ ప్యాలెస్‌లో జరిగే శుభ కార్యాలకు ఆయన కేక్‌లు తయారు చేసేవారు. 2015లో యూకే వెళ్లి ఆయన వద్ద ఈ కళను అభ్యసించాను.

ప్రత్యేకత కోసం...

భారత్‌కు తిరిగి వచ్చాక నాదంటూ ప్రత్యేక శైలి ఉండేలా కేక్‌లు రూపొందించడంపై దృష్టి పెట్టాను. అందుకోసం ఎన్నో పరిశోధనలు, లెక్కలేనన్ని ప్రయోగాలు చేశాను. క్రమంగా వీగన్ కేక్‌లు మొదలుపెట్టాను. దాంతో ఆదరణ పెరిగింది. అంతేకాదు... కేక్ తయారీని సమకాలీన కథలు చెప్పే ఒక సాధనంగా మలిచాను. ఇదే నన్ను ప్రత్యేకంగా నిలిపింది. ఈ ఆలోచనా విధానమే నాకు పలు అవార్డులు, అభినందనలు తెచ్చి పెట్టింది. 2021లో 'స్వదేశ్ సమ్మాన్' పురస్కారం అందుకున్నాను. 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు దక్కింది. ఇంకా ఎన్నో ఉన్నాయి.



ఆ పాప కళ్లల్లో మెరుపులు...

ఒకసారి ఒక పదేళ్ల చిన్నారి తల్లితో కలిసి కేక్ డెలివరీ తీసుకువెళ్లడానికి వచ్చింది. కోట, దాని ముందు యువరాణి డిజైన్‌లో రూపొందించిన కేక్ అది. చూడగానే ఆ చిన్నారి కళ్లు మెరిసిపోయాయి. ఆ క్షణం నేను నా చిన్నప్పటి రోజులకు వెళ్లిపోయా. ఎడిన్ బ్లైటన్ కథలు చదువుతూ... మాయా ప్రపంచం గురించి కలలు కనేదాన్ని. ఆ పాపవల్ల ఆ పాత మధురాలు మళ్లీ కళ్ల ముందు కదలాడాయి. కాసేపు నన్ను నేను మరిచిపోయా. ఆ అనుభూతి ఎంతో అద్భుతంగా అనిపించింది. దాన్ని అందరికీ ఇవ్వాలని నిర్ణయించుకున్నా. అందుకే కోటలు, రాణులు, కళలు ఉట్టిపడేలా... అవి ఒక అందమైన కథ చెప్పేలా కేక్‌లు తయారు చేస్తున్నా.

భావం... భావోద్వేగం...

నా ప్రాజెక్ట్‌లు అన్నిటిలోకెల్లా మరిచిపోలేనిది, అత్యంత కష్టమైనది 'డ్యుమో డి మిలనో' ఇటాలియన్ కేథడ్రాల్ చర్చి రెప్లికా. 6.4 అడుగుల ఎత్తు, 4.6 అడుగుల వెడల్పుతో రూపొందించిన వంద కేజీల వీగన్ కేక్ అది. దీని తయారీకి వంద గంటలకు పైగా సమయం పట్టింది. అంతపెద్ద కేక్‌ను నిలబెట్టాలంటే... చెదరని ఏకాగ్రత, అపారమైన ఓర్పు అవసరం. అన్నిటికీ మించి ఇలాంటి పురాతన, వారసత్వ కట్టడాల ప్రతిరూపాన్ని తయారు చేయాలంటే కళాత్మకత, వాస్తుశిల్ప శైలిని ఆకళింపు చేసుకొనే సామర్థ్యం కావాలి. ఈ ప్రాజెక్ట్ ప్రారంభానికి ముందు నేను కట్టడం వాస్తుశిల్ప శైలి గురించి లోతుగా అధ్యయనం చేశాను. కనుకనే ఉన్నది ఉన్నట్టు కేక్‌పై చూపించగలిగాను. ఇది 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు సంపాదించింది. కేక్ అంటే నాకు చూడగానే ఆకర్షించి, నోట్లో వేసుకోగానే కరిగిపోయేలాంటి తీపి పదార్థం మాత్రమే కాదు... ఒక భావోద్వేగ బంధం. దాని తయారీ ఒక యజ్ఞం.

స్ఫూర్తి అవే...

నేను ఎంత పెద్ద కేక్‌లు చేసినా వాటిల్లో కోడిగుడ్డు వాడను. క్రీమ్ నుంచి కేక్ మిక్సింగ్ తయారీ వరకూ అన్నీ మొక్క ఆధారిత ఉత్పత్తులతో చేసిన పదార్థాలే ఉపయోగిస్తాను. కథక్ లాంటి సంప్రదాయ నాట్యం కావచ్చు... హస్తకళాకృతులు, చేనేతలు కావచ్చు... వారసత్వ కట్టడాలు కావచ్చు... మన చుట్టూ ఉండేవాటినే స్ఫూర్తిగా తీసుకొని కేక్‌లు రూపొందిస్తాను. ఇప్పటి వరకు ఇండియన్ ప్యాలెస్, పైథానీ చీర అంచు, బెంగాలీ పెళ్లికూతురు ధరించే సంప్రదాయ చీరలు, నగలు, మణిపూరీ నాట్యం లాంటి నిలువెత్తు ప్రతిరూపాలు ఎన్నో నేను తయారు చేశాను. వాటిని చూసినప్పుడు నా మనసు పరవశిస్తుంది. ఎంతో ఆహ్లాదంగా అనిపిస్తుంది. నేను కోరుకున్నది ఇలాంటి అనుభూతినే."

రంగు చుక్కల అర్థం?

బజారులో దొరికే ఆహారపు ఉత్పత్తుల ప్యాకెట్ల మీద రంగు రంగుల చుక్కలు ముద్రించి ఉండడం చూస్తూ ఉంటాం. ఒక్కో రంగు ఒక్కో అంశాన్ని తెలియజేస్తుంది. ఆ వివరాలు...

- ఆహార ప్యాకెట్లపై ఎరుపు రంగు చుక్క ఉంటే ఆ ఉత్పత్తుల్లో మాంసాహారాన్ని వినియోగించారని అర్థం. చికెన్, మటన్, చేప లాంటి మాంసాహారాలతో తయారు చేసినవిగా గుర్తించాలి.
- ఆహారపు ఉత్పత్తుల ప్యాకెట్ల మీద ఆకుపచ్చని చుక్క ఉంటే వాటిని శాఖాహారంతో తయారుచేశారని తెలుసుకోవాలి. వీటి తయారీలో గుడ్డు, మాంసం వినియోగించలేదని అర్థం.
- ప్యాకెట్లపై నీలి రంగు చుక్క ఉంటే అవి వైద్య పరమైన ఉత్పత్తులని అర్థం. నిర్దిష్టమైన వ్యాధి నివారణకు వైద్యుల సలహా మేరకు మాత్రమే వాటిని వినియోగించాలి.
- అదే పసుపు రంగు చుక్క ఉంటే ఆ ఉత్పత్తుల్లో గుడ్లు వాడారని తెలుసుకోవచ్చు.
- ప్యాకెట్ల మీద నలుపు రంగు చుక్క ఉంటే ఆ ఉత్పత్తులను రసాయనిక పదార్థాలతో ప్రాసెస్ చేసి ఎక్కువ రోజులు నిల్వ ఉండేలా తయారుచేశారని అర్థం. వీటిని తీసుకోవడం వల్ల ఆరోగ్యం ప్రభావితమవుతుందని తెలుసుకోవాలి.

టాటా క్యాపిటల్ రూ.17,200 కోట్ల ఐపీఓ



న్యూఢిల్లీ: టాటా గ్రూప్‌నకు చెందిన నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ) టాటా క్యాపిటల్ నవీకరించిన ఐపీఓ పత్రాలను (డీఆర్‌హెచ్‌పీ) సెబీకి సమర్పించింది. ఐపీఓ ద్వారా కంపెనీ 200 కోట్ల డాలర్ల (రూ.17,200 కోట్లు) వరకు సమీకరించాలని భావిస్తోందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ లెక్కన కంపెనీ మార్కెట్ విలువ దాదాపు 1,100 కోట్ల డాలర్ల (రూ.94,600 కోట్లు) స్థాయిలో ఉండనుందని వారన్నారు. సెబీకి సోమవారం సమర్పించిన అప్‌డేటెడ్ డీఆర్‌హెచ్‌పీ ప్రకారం.. ఐపీఓలో భాగంగా టాటా క్యాపిటల్ మొత్తం 47.58 కోట్ల షేర్లను విక్రయించనుంది. అందులో 21 కోట్ల తాజా ఈక్విటీ షేర్ల జారీతో పాటు ప్రమోటర్లు, ఇతర వాటాదారులకు చెందిన 26.58 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన అమ్మకానికి పెట్టనుంది. ఓఎఫ్ఎస్‌లో భాగంగా కంపెనీ ప్రమోటరైన టాటా సన్స్ తన వాటా నుంచి 23 కోట్ల షేర్లను, ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) 3.58 కోట్ల షేర్లను ఉపసంహరించుకోనున్నాయి. ప్రస్తుతం టాటా క్యాపిటల్‌లో టాటా సన్స్ 88.6 శాతం, ఐఎఫ్‌సీ 1.8 శాతం వాటా కలిగి ఉన్నాయి. ఐపీఓలో తాజా ఈక్విటీ జారీ ద్వారా సమీకరించిన నిధులను కంపెనీ టైర్-1 మూలధన నిధులను పెంచుకునేందుకు, భవిష్యత్ మూలధన అవసరాలు, రుణ వితరణ కోసం వినియోగించుకోనుంది.

సెన్సెక్స్ 308 పాయింట్లు పతనం

ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ బుధవారం వడ్డీ రేట్లపై నిర్ణయాన్ని ప్రకటించనున్న నేపథ్యంలో ఈక్విటీ మదుపరులు ముందు జాగ్రత్తగా ఇంధనం, బ్యాంకింగ్ రంగ షేర్లలో అమ్మకాలకు పాల్పడ్డారు. దాంతో బీఎస్ఈ సెన్సెక్స్ మంగళవారం ట్రేడింగ్‌లో 308.47 పాయింట్లు కోల్పోయి 80,710.25 వద్దకు జారుకుంది. నిఫ్టీ 73.20 పాయింట్ల నష్టంతో 24,649.55 వద్ద ముగిసింది.

ఆల్‌టైం కనిష్ఠానికి రూపాయి: భారత కరెన్సీ విలువ సరికొత్త జీవితకాల కనిష్ఠానికి పతనమైంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 22 పైసల నష్టంతో రూ.87.88 వద్ద ముగిసింది. భారత వస్తువులపై సుంకాలను మరింత పెంచుతానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించడం, ఈక్విటీ మార్కెట్లో నష్టాలు మన కరెన్సీపై ఒత్తిడి పెంచాయి.

రూ.178 కోట్లతో రాజమండ్రి ప్లాంట్ విస్తరణ

ఆంధ్రా పేపర్ లిమిటెడ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి ప్లాంట్ అప్‌గ్రేడేషన్, పేపర్ మెషిన్-3 పునర్ నిర్మాణం కోసం రూ.178 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ఆంధ్ర పేపర్ లిమిటెడ్ ప్రకటించింది. ప్రతిపాదిత పెట్టుబడులకు కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఆమోదం లభించిందని తెలిపింది. ఈ పెట్టుబడులను అంతర్గత వనరులు, బ్యాంకు రుణాల రూపంలో సమీకరించనున్నట్లు కంపెనీ వెల్లడించింది. ప్రస్తుతం ఈ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం ఏటా 36,000 టన్నులుగా ఉండగా ప్రతిపాదిత విస్తరణతో ఉత్పత్తి సామర్థ్యం 60 శాతం మేర పెరగనుందని పేర్కొంది. వచ్చే 13 నెలల కాలంలో ఈ విస్తరణను పూర్తి చేయనున్నట్లు కంపెనీ తెలిపింది. కాగా జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో కంపెనీ రూ.420.64 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.21.30 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది.

ఫార్మా దిగుమతులపై 250% సుంకాలు..!

ధరలు తగ్గిస్తే సరి..లేదంటే టారిఫ్ పోటు తప్పదు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రోజుకో బాంబు పేలుస్తున్నారు. తాజాగా ఆయన దృష్టి ఫార్మా కంపెనీలపై పడింది. ఈ కంపెనీలు.. అమెరికాలో ఔషధాల ఉత్పత్తి పెంచి ధరలు తగ్గించాలని కోరారు. లేకపోతే భారీ సుంకాల పోటు తప్పవని హెచ్చరించారు. సీఎన్‌బీసీ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ హెచ్చరిక చేశారు. 'ప్రారంభంలో ఈ సుంకాల పోటు కొద్ది స్థాయిలోనే ఉంటుంది. ఏడాది, ఏడాదిన్నర తర్వాత ఇది 150 శాతం, ఆ తర్వాత 250 శాతం వరకు ఉంటుంది' అని ట్రంప్ స్పష్టం చేశారు. మిగతా అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే అమెరికాలో ఔషధాల ధరలు మూడింతలు ఎక్కువగా ఉన్నందున, వాటి ధరలు తగ్గించక తప్పదని ట్రంప్ ఈ ఏడాది మార్చిలో హెచ్చరించిన విషయం తెలిసిందే.

భారత్‌పై ప్రభావం: ట్రంప్ తాజా హెచ్చరిక భారత ఫార్మా కంపెనీలకు గుబులు పుట్టిస్తోంది. గత ఆర్థిక సంవత్సరం మన దేశం నుంచి 3,000 డాలర్ల (సుమారు రూ.2.61 లక్షల కోట్లు) విలువైన ఫార్మా ఉత్పత్తులు ఎగుమతయ్యాయి. అందులో అమెరికా వాటా 14 శాతం వరకు ఉంది. అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) ఇంకా కుదరక పోవడంపై భారత ఫార్మా కంపెనీలు ఇప్పటికే ఆందోళనలో ఉన్నాయి. ఇప్పుడు ట్రంప్ చేసిన తాజా హెచ్చరిక అమలైతే భారత జెనరిక్ ఔషధాలకు అమెరికా మార్కెట్ శాశ్వతంగా మూసుకుపోయినట్టేనని పరిశ్రమ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి.

బ్రిటన్‌కు మరిన్ని మత్స్య ఎగుమతులు

కలిసి రానున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

న్యూఢిల్లీ: భారత్-బ్రిటన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) మన దేశ మత్స్య ఎగుమతులకు బాగానే కలిసి రానుంది. ప్రస్తుతం బ్రిటన్ మన దేశం నుంచి ఎగుమతయ్యే మత్స్య దిగుమతులపై 8.9 శాతం చొప్పున దిగుమతి సుంకం విధిస్తోంది. ఎఫ్‌టీఏతో ఈ సుంకం పూర్తిగా రద్దు కానుంది. దీంతో ప్రస్తుతం ఏటా బ్రిటన్‌కు రూ.1,000 కోట్ల వరకు ఉన్న మన మత్స్య ఎగుమతులు వచ్చే మూడేళ్లలో మూడింతలు పెరుగుతాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

ఏపీకీ మేలు

ఈ ఎఫ్‌టీఏ తీర ప్రాంతం ఎక్కువగా ఉన్న గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు బాగా మేలు చేయనుంది. మన దేశం నుంచి జరిగే రొయ్యల ఎగుమతుల్లో దాదాపు 60 నుంచి 70 శాతం ఏపీ నుంచే ఎగుమతవుతాయి. ట్రంప్ సుంకాలతో బేల చూపులు చూస్తున్న ఆంధ్రప్రదేశ్‌లోని రొయ్యల ఎగుమతిదారులకూ భారత-బ్రిటన్ ఎఫ్‌టీఏ కలిసిరానుంది. అయితే ట్రంప్ సుంకాల నేపథ్యంలో బ్రిటన్‌లోని దిగుమతిదారులు ధరలు తగ్గించే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

ఎగుమతుల్లో గుజరాత్ టాప్

- రూ.9.83 లక్షల కోట్లతో అగ్రస్థానం
- 6,7 స్థానాల్లో ఏపీ, తెలంగాణ

న్యూఢిల్లీ: దేశ ఎగుమతుల్లో గుజరాత్ హవా కొనసాగుతోంది. మార్చితో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.9.83 లక్షల కోట్ల ఎగుమతులతో గుజరాత్ దేశంలో అగ్రస్థానంలో నిలిచింది. గత ఆర్థిక సంవత్సరం దేశం నుంచి జరిగిన మొత్తం ఎగుమతుల్లో 26.6 శాతం ఒక్క గుజరాత్ నుంచే ఎగుమతయ్యాయి. భారత ఎగుమతి సంఘాల సమాఖ్య (ఫియో) మంగళవారం దీనికి సంబంధించిన వివరాలు విడుదల చేసింది. గుజరాత్ తర్వాత మహారాష్ట్ర రూ.5.57 లక్షల కోట్ల ఎగుమతులతో ద్వితీయ స్థానం సంపాదించింది. తమిళనాడు (రూ.4.53 లక్షల కోట్లు) కర్ణాటక (రూ.2.65 లక్షల కోట్లు), ఉత్తర ప్రదేశ్ (రూ.1.91 లక్షల కోట్లు) రాష్ట్రాలు మూడు, నాలుగు, ఐదో స్థానాలతో సరిపెట్టుకున్నాయి.

తెలుగు రాష్ట్రాల హవా

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ గత ఆర్థిక సంవత్సరం దేశ ఎగుమతుల్లో ఆరు, ఏడు స్థానాల్లో నిలిచాయి. ఏపీ నుంచి 2,078 కోట్ల డాలర్ల (సుమారు రూ.1.80 లక్షల కోట్లు) విలువైన ఎగుమతులు నమోదయ్యాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 5.17 శాతం ఎక్కువ. ఇది గత ఆర్థిక సంవత్సరం దేశం నుంచి జరిగిన మొత్తం ఎగుమతుల్లో 4.75 శాతానికి సమానం. తెలంగాణ నుంచి గత ఆర్థిక సంవత్సరం 1,912 కోట్ల డాలర్ల (సుమారు రూ.1.66 లక్షల కోట్లు) విలువైన ఎగుమతులు జరిగాయి. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 36.33 శాతం ఎక్కువ. దేశ మొత్తం ఎగుమతుల్లో ఇది 4.37 శాతానికి సమానమని ఫియో తెలిపింది.



- ఓబెన్ ఎలక్ట్రిక్ మార్కెట్లోకి నెక్స్ట్ జెన్ రోర్ ఈజెడ్ సిగ్మా మోటార్‌సైకిల్‌ను తీసుకువచ్చింది. 3.4 కేడబ్ల్యూహెచ్, 4.4 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ వేరియంట్స్‌తో అందుబాటులో ఉండనున్న ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ పరిచయ ధర రూ.1.27 లక్షలు. రివర్స్ మోడ్, 5 అంగుళాల కలర్ డిస్‌ప్లే, నావిగేషన్, కాల్, మెసేజ్, మ్యూజిక్ అలర్ట్స్ వంటి కొత్త ఫీచర్లను ఈ బైక్‌లో పొందుపరిచింది. ఈ నెల 15 నుంచి డెలివరీలు ప్రారంభించనున్నట్లు కంపెనీ వెల్లడించింది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	90	విజయవాడ	99
వరంగల్	90	గుంటూరు	104
కరీంనగర్	90	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	84
కర్నూలు	90	నెల్లూరు	89
విశాఖపట్నం	94	అనంతపురం	89
గోదావరి	99		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,02,260 ▲	93,700 ▲	1,25,000 ▲
విజయవాడ	1,03,500 ▼	97,500 ▲	1,11,625 ▼
విశాఖపట్నం	1,03,260 ▲	93,700 ▲	1,26,000 ▲
రాజమండ్రి	1,02,200 ▲	93,700 ▲	1,15,500 ▲
ప్రొద్దుటూరు	1,00,300 ▲	92,280 ▲	1,15,700 ▲
ముంబై	1,00,076 ▼	91,670 ▼	1,12,422 ▲

తగ్గిన ఎన్‌సీసీ లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎన్‌సీసీ లిమిటెడ్.. జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.5,207.93 కోట్ల టర్నోవర్‌పై రూ.192.14 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ ఆదాయం రూ.5,558.33 కోట్లుగా ఉండగా లాభం రూ.209.92 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ కొత్తగా రూ.3,658 కోట్ల ఆర్డర్లను దక్కించుకుంది. దీంతో కంపెనీ ఆర్డర్ బుక్ రూ.70,087 కోట్లకు చేరుకుంది. కాగా జూన్ త్రైమాసికంలో కంపెనీ రూ.4,429.64 కోట్ల స్టాండ్‌ఎలోన్ ఆదాయంపై రూ.190.10 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది.

సీసీఎల్ ప్రొడక్ట్స్ లాభం రూ. 72 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : సీసీఎల్ ప్రొడక్ట్స్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.1,058.03 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.72.44 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ ఆదాయం రూ.774.62 కోట్లుగా ఉండగా లాభం రూ.71.47 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ మొత్తం వ్యయాలు రూ.963.84 కోట్ల నుంచి రూ.687.44 కోట్లకు పెరిగాయి. కాగా స్టాండ్ఎలోన్ ప్రాతిపదికన కంపెనీ రూ.537.55 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.31.36 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



6వ తేదీ			
హైదరాబాద్	435	విజయవాడ	475
వరంగల్	437	గోదావరి	475
చిత్తూరు	513	విశాఖపట్నం	475
		డజను గుడ్లు రూ.	72

- భారత మార్కెట్లో టయోటా ఇన్నోవా విజయవంతంగా 20 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. సుమారు 12 లక్షల మందికి పైగా వినియోగదారులకు టయోటా ఇన్నోవా అత్యంత విశ్వసనీయమైన బ్రాండ్‌గా ఉందని టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం) వెల్లడించింది. టీకేఎం 2005లో భారత మార్కెట్లోకి ఇన్నోవాను ప్రవేశపెట్టింది. 2016లో ఇన్నోవా క్రిస్టా, 2022లో ఇన్నోవా హైక్రాస్ మోడల్‌ను తీసుకువచ్చింది.
- ప్రపంచ తెలుగు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కౌన్సిల్ (డబ్ల్యూటీఐటీసీ).. ఎస్ఆర్ఐ సంయుక్త కార్యదర్శిగా అమెరికా, టెక్సాస్‌కు చెందిన టెక్నాలజీ నిపుణుడు రామారావు దామా నియమితులయ్యారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ఐటీ నిపుణులతో సంబంధాలు మెరుగుపరచడంలో డబ్ల్యూటీఐటీసీ కీలకంగా ఉంది. ఒరాకిల్ ఈఆర్‌పీ టెక్నాలజీస్‌లో రామారావుకు 20ఏళ్లకు పైగా అనుభవం ఉంది.

స్పోర్ట్స్

ఫిట్‌నెస్ కింగ్



ఇక ఆ పదాన్ని మర్చిపోండి — గవాస్కర్

లండన్: భారత క్రికెట్‌లో ఈ మధ్య కాలంలో పని ఒత్తిడి అనే మాట ఎక్కువగా వినిపిస్తోంది. దీనిలో భాగంగానే స్టార్ పేసర్ బుమ్రా ఐదు టెస్టుల సిరీస్‌లో మూడింటికే పరిమితమయ్యాడు. అయితే ఇదంతా అపోహేనని సిరాజ్ నిరూపించాడని మాజీ కెప్టెన్ గవాస్కర్ అన్నాడు. ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో ఈ హైదరాబాదీ మొత్తం ఐదు మ్యాచ్‌లనూ ఆడిన సంగతి తెలిసిందే. 'వర్క్‌లోడ్‌ను దరి చేరనీయకుండా సిరాజ్ బౌలింగ్ వేసిన తీరు అద్భుతం. కెప్టెన్ ఎప్పుడు బంతి ఇచ్చినా సుదీర్ఘ స్పెల్‌లు వేశాడు. ఇక భారత జట్టు ఆ పదాన్ని తమ డిక్షనరీ నుంచి తొలగించాలి. ఎందుకంటే వర్క్‌లోడ్‌కు కట్టుబడితే అత్యుత్తమ ఆటగాళ్లను బరిలోకి దించలేం. మానసికంగా దృఢంగా ఉండడమే ముఖ్యం. అలాగే పంత్ గాయమైనా బ్యాటింగ్‌కు దిగాడు. సైనికులు తమకెదురయ్యే కఠిన పరిస్థితులపై ఫిర్యాదు చేస్తారా?' అని సన్నీ ప్రశ్నించాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

ఏ క్రికెటర్ నైపుణ్యమైనా సుదీర్ఘ ఫార్మాట్‌లోనే బయటపడుతుందని అంటుంటారు. ఐదు రోజులపాటు సాగే టెస్టు మ్యాచ్‌లో ఆడాలంటే ఫిట్‌నెస్ అత్యంత కీలకం. అందుకే ఈ విషయంలో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీని అందరూ ప్రామాణికంగా తీసుకుంటారు. కానీ అలుపెరుగని రీతిలో వరుసగా ఐదు టెస్టులు ఆడి ఏకధాటిగా బంతులు వేసే ఫాస్ట్ బౌలర్లను మాత్రం అరుదుగానే చూస్తుంటాం. ఇంగ్లండ్‌తో జరిగిన సిరీస్‌లో భారత పేసర్ మహ్మద్ సిరాజ్ విషయంలో జరిగిందదే. ఇరుజట్ల నుంచి గాయపడ్డ వోక్స్ మినహా అన్ని మ్యాచ్‌లను ఆడిన ఏకైక పేసర్ సిరాజే కావడం విశేషం. అంతేకాకుండా ఈ సిరీస్‌లో అందరికంటే ఎక్కువగా 185.3 ఓవర్లు బౌలింగ్ చేశాడు. అంటే 1,113 బంతులు విసిరి పని ఒత్తిడి అని చెప్పే ఇతర ఆటగాళ్లకు సవాల్ విసిరినట్టయ్యింది. 9 ఓవర్ల స్పెల్‌ను ఎలాంటి అలసటా లేకుండా పలుమార్లు వేయగలగడం సిరాజ్‌కే చెల్లింది. అటు బుమ్రా మూడు మ్యాచ్‌లే ఆడగా.. ఆకాశ్, అర్ష్‌దీప్ ఓసారైనా గాయాలకు గురయ్యారు. కానీ సిరాజ్ మాత్రమే ఓ యోధుడిలా ప్రతీ టెస్టు బరిలోకి దిగి సుదీర్ఘ స్పెల్‌లతో ఆకట్టుకోగలిగాడు. అతడి ఫిట్‌నెస్ స్థాయి ఏమిటో దీన్ని బట్టి చెప్పవచ్చు అయితే ఇందుకు తను కఠినంగానే సన్నద్ధమయ్యాడట. ముఖ్యంగా తన డైట్ విషయంలో ఎలాంటి అలక్ష్యానికి తావీయడని సిరాజ్ సోదరుడు ఇస్మాయిల్ చెబుతున్నాడు. 'జంక్ ఫుడ్‌ను ఏమాత్రం దరిచేరనీయడు. డైట్‌ను క్రమం తప్పకుండా అనుసరిస్తాడు. బిర్యానీలు తినడం కూడా దాదాపుగా మానేశాడు. ఎప్పుడో ఓసారి.. అదీ ఇంట్లో చేసిందే తీసుకుంటాడు. పిజ్జాలాంటి వాటికి చాలా దూరం. ఉదయం, సాయంత్రం జిమ్‌కు వెళ్లడం తప్పనిసరి. చాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక కాని సమయంలోనూ నిరుత్సాహపడకుండా ఫిట్‌నెస్‌పై మరింత దృష్టి సారించాడు' అని వివరించాడు.

అమ్మా.. నా కోసం ప్రార్థించు

ఆటో డ్రైవర్‌గా పనిచేసిన సిరాజ్ తండ్రి మహ్మద్ గౌస్ నాలుగేళ్ల క్రితం మరణించాడు. దేశం తరఫున ఆడే సమయంలో ప్రతీ సిరీస్‌కు ముందు, ఆ తర్వాత తండ్రి సమాధిని దర్శించుకోవడం సిరాజ్‌కు అలవాటు. సిరాజ్ క్రికెటర్‌గా మారే క్రమంలో అతడి తండ్రి తోడ్పాటు ఎక్కువే. జూన్‌లో ఇంగ్లండ్ సిరీస్‌కు వెళ్లే ముందు సిరాజ్ తన తల్లితో.. 'అమ్మా నాకోసం ప్రార్థించు. సిరీస్‌లో బాగా రాణించి భారత జట్టును గెలిపించాలని కోరుకో' అని చెప్పాడట. అటు ఇంగ్లండ్ పర్యటనలో ఆడిన అన్ని మ్యాచ్‌లను కూడా క్రమం తప్పకుండా తల్లి షబానా టీవీలో తిలకించింది.

'మిస్టర్ యాంగ్రీ'

మైదానంలో దూకుడుగా కనిపించే పేసర్ సిరాజ్‌కు ఇంగ్లండ్ క్రికెటర్లు నిక్‌నేమ్ కూడా పెట్టినట్టు మాజీ పేసర్ స్టువర్ట్ బ్రాడ్ తెలిపాడు. "ఐదో టెస్టు రెండో రోజున ఆటగాళ్ల ప్రాక్టీస్ చేస్తున్నప్పుడు నేను పిచ్ దగ్గరే ఉన్నా. అక్కడే ఉన్న డకెట్ 'మార్నింగ్ మిస్టర్ యాంగ్రీ. ఏం చేస్తున్నావు' అని సిరాజ్‌ను అడిగాడు. దీన్ని తేలిగ్గా తీసుకున్న సిరాజ్ బిగ్గరగా నవ్వాడు. తను గ్రౌండ్‌లో ఓ యోధునిలా పోరాడతాడు కాబట్టే ఇంగ్లండ్ టీమ్ ఆ పేరు పెట్టింది" అని బ్రాడ్ తెలిపాడు.

ఇక ఆటగాళ్ల ఇష్టం కాదు

ఎన్ని మ్యాచ్‌లు ఆడాలనేది బోర్డు నిర్ణయమే!

న్యూఢిల్లీ: వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ పేరుతో ఆటగాళ్లు ఇష్టారీతిన మ్యాచ్‌లకు దూరం కావడంపై బీసీసీఐ దృష్టి సారించింది. ముున్ముందు పేసర్లపై ఒత్తిడి పడకుండా చూసుకుంటామని, అయితే వారి ఇష్టమొచ్చినట్టు మ్యాచ్‌లకు దూరమవ్వడాన్ని బోర్డు ఉపేక్షించదని తేల్చి చెప్పింది. 'తమకిష్టమైనట్టుగా మ్యాచ్‌లను, సిరీస్‌లను ఎంపిక చేసుకుని ఆడడం ఇక కుదరదు. అన్ని ఫార్మాట్లలో ఆడే సెంట్రల్ కాంట్రాక్ట్ ఆటగాళ్లకు త్వరలోనే ఈ నిర్ణయాన్ని తెలుపుతాం. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌ను పరిగణనలోకి తీసుకుంటాం. కానీ ఆ పేరుతో ముఖ్యమైన మ్యాచ్‌లకు దూరం కావడాన్ని సమ్మతించం' అని బీసీసీఐ అధికారి చెప్పారు.

కోహ్లీ, రోహిత్ సైడవ్వాల్సిందేనా?



న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో హోరాహోరీగా సాగిన ఐదు టెస్టుల సిరీస్ 2-2తో సమంగా ముగిసింది. అయితే, సుదీర్ఘంగా సాగిన సిరీస్‌లో భారత యువ ఆటగాళ్ల పోరాటం హైలైట్‌గా నిలిచింది. దీంతో భారత జట్టులో వీరి స్థానాలు ఇక పదిలమేనన్న టాక్ బలంగా వినిపిస్తోంది. యువ కెరటాలు అనూహ్యంగా దూసుకురావడంతో.. వన్డేలు మాత్రమే ఆడాలనుకొంటున్న సీనియర్లు రోహిత్ శర్మ, కోహ్లీలకు దారులు క్రమంగా మూసుకుపోతున్నట్టు కనిపిస్తోంది. రాబోయే వరల్డ్‌కప్‌నకు వీరిద్దరూ దాదాపుగా 40 ఏళ్లకు చేరువవుతుండడంతో.. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని యువకులతో కోర్ టీమ్ తయారుచేయాలన్న నిర్ణయానికి బీసీసీఐ వచ్చిందని సమాచారం. కోహ్లీ, రోహిత్ భవితవ్యంపై బోర్డు కొద్దిరోజుల్లోనే ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం.

కన్నీళ్లు.. గంతులు.. ఆలింగనాలు

కోచ్ గంభీర్ భావోద్వేగ సంబరాలు



లండన్: టీమిండియా చీఫ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఎప్పుడూ సీరియస్‌గా కనిపిస్తుంటాడు.. విజయాలు దక్కిన సందర్భాల్లోనూ అతను పెద్దగా సంబరాలు చేసుకోవడాన్ని కూడా అభిమానులు చూసి ఉండరు. కానీ, సోమవారం ఓవల్ టెస్టులో భారత జట్టు గెలిచిన క్షణాన మాత్రం గంభీర్ సెలబ్రేట్ చేసుకున్న తీరు ఎంతో ఉద్విగ్నభరితమని చెప్పొచ్చు. ఎప్పుడూ గంభీరంగా కనిపించే గౌతీ.. భావోద్వేగాన్ని ఆపుకోలేక ఏడ్చేశాడు. సంబరం పట్టలేక చిన్నపిల్లాడిలా ఎగిరి గంతులేశాడు. బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్‌ను హత్తుకొని ఆప్యాయంగా ముద్దాడాడు. తీవ్ర భావోద్వేగానికి గురైన గంభీర్.. గట్టిగా అరుస్తూ జట్టు విజయాన్ని తనివితీరా ఆస్వాదించాడు. డ్రెస్సింగ్‌రూమ్‌లో అత్యంత ఉద్వేగభరితంగా మారిన ఆ అపురూప క్షణాల వీడియోను బీసీసీఐ షేర్ చేసింది. సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఈ వీడియోను చూసిన క్రికెట్ అభిమానులు.. 'నిజంగా ఈ వీడియో గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. కోచ్‌కు, జట్టుకు అభినందనలు' అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.

బలమైన సంస్కృతిని పెంపొందించాలి

గంభీర్

లండన్: నిరంతర కృషి, పురోగతితో బలమైన జట్టు సంస్కృతిని పెంపొందించాల్సిన అవసరం ఉందని గంభీర్ సూచించాడు. 'జట్టులోకి ఎంతోమంది వస్తుంటారు.. పోతుంటారు. డ్రెస్సింగ్ రూమ్ సంస్కృతే అందరినీ ఆకర్షిస్తుందని ఐదో టెస్ట్ ముగిసిన అనంతరం ఆటగాళ్లతో గౌతీ అన్నాడు. 2-2తో సిరీస్ సమం చేయడం అద్భుతమని కొనియాడాడు. మన నైపుణ్యాలను సానబెట్టుకొంటూ సాగితే.. సుదీర్ఘకాలం ఆధిపత్యం ప్రదర్శించవచ్చన్నాడు. ఈ సందర్భంగా 'ఇంపాక్ట్ ప్లేయర్' అవార్డును సుందర్‌కు జడేజా అందజేశాడు.

అదే టెస్టు ఔన్నత్యం



ఐదురోజుల మ్యాచ్‌లు బోర్. 15 సెషన్లపాటు ఎవరు చూస్తారు..? పరుగులు చేయకుండా ఓవర్లకు ఓవర్లు తినేసే బ్యాటర్లు.. పసలేని బౌలింగ్..ఇలా.. టెస్టు క్రికెట్ మనుగడపై ఎన్నో ప్రశ్నలు, మరెన్నో సందేహాలు! మరోవైపు టెస్టులను నాలుగు రోజులకు కుదించాలన్న ఐసీసీ ఆలోచనలు.. కానీ, వీటన్నింటినీ భారత్-ఇంగ్లండ్ సిరీస్ పటాపంచలు చేసింది. ఈ సిరీస్‌లోని అన్ని మ్యాచ్‌లూ చివరి రోజు దాకా హోరాహోరీగా సాగాయి. ఈ ప్రదర్శనతో టెస్టులపై ఉన్న సందేహాలన్నింటికీ దీటుగా జవాబు ఇచ్చినట్టయింది.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

అసలు సిసలు టెస్టు క్రికెట్ మజాను ఇంగ్లండ్-భారత్ సిరీస్ రుచి చూపించింది. ఐదు టెస్టుల్లో ఇరుజట్ల ఆటగాళ్లు పోరాడిన తీరు అద్భుతం. ఇంగ్లండ్‌లో టెస్టులు అంటే ప్రతి అభిమానికి గుర్తుకు వచ్చేది ఆస్ట్రేలియాతో జరిగే యాషెస్ సిరీస్. కానీ, భారత్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల సిరీస్ అంతకుమించి అనే విధంగా ఫ్యాన్స్‌ను ఆకట్టుకొంది. నాటకీయ పరిణామాల మధ్య 25 రోజులపాటు సాగిన సిరీస్.. టెస్టుల స్థాయిని అమాంతంగా పెంచేసింది. ఈ ఇండో-ఇంగ్లండ్ సిరీస్ సరికొత్త శత్రుత్వానికి బీజం వేసింది. ఈ ఆరోగ్యకరమైన పోరు భవిష్యత్‌లో యాషెస్‌ను మించి ఎదగవచ్చన్నది విశ్లేషకుల అంచనా. సుదీర్ఘమైన షెడ్యూల్‌లో ఇరుజట్లూ కొదమసింహాల్లా తలపడ్డాయి. ప్రతి టెస్టూ ఐదోరోజు వరకూ సాగడం ఈ మధ్యకాలంలో అద్భుతమనే చెప్పుకోవాలి. సంధి దశలో ఉన్న టీమిండియా.. యువ కెప్టెన్ గిల్ నాయకత్వంలో ఆతిథ్య ఇంగ్లండ్‌కు కనీసపోటీ ఇస్తే గొప్పే అని సిరీస్ ఆరంభానికి ముందు భావించారు. కానీ, యువ భారత్ పోరాటంతో ఇంగ్లండ్ బిత్తరపోయింది. బుమ్రా దూరమైన రెండు టెస్టుల్లోనూ గిల్‌సేన నెగ్గడం గమనార్హం. ముఖ్యంగా భారత్ సమష్టిగా ఆడడం ఈ సిరీస్ ప్రత్యేకతగా భావించాలి. ఆఖరి టెస్టు వేదిక ఓవల్‌లో మ్యాచ్ ముగింపు చిరకాలం గుర్తుండిపోతుంది. గెలుపు దోబూచులాడుతున్న తరుణంలో.. తీవ్ర ఒత్తిడి మధ్య భారత్ అపూర్వ విజయంతో అభిమానుల హృదయం పులకరించింది. సిరీస్ సాగిన తీరును యావత్ ప్రపంచం ఆసక్తిగా గమనించింది. ఫ్రాంచైజీ లీగుల జోరులో వైభవం కోల్పోతున్న టెస్టు క్రికెట్‌కు ఈ సిరీస్ సరికొత్త ఊపిరిలాదింది. ఇండో-ఇంగ్లండ్ సిరీస్‌లో గెలుపెవరిదో తేలలేదు.. కానీ విజయం సాధించింది మాత్రం క్రికెట్ మాతృక టెస్టు ఫార్మాటే!

ఎప్పటికీ ఎవర్‌గ్రీన్

"ఇంగ్లండ్‌తో సిరీస్ డ్రాగా ముగిసినా.. ఇరు జట్లు చేసిన పోరాటం అసాధారణం. మా ఈ ప్రదర్శన భారత టెస్టు క్రికెట్‌లో చిరస్థాయిగా నిలిచిపోతుంది. టెస్టు క్రికెట్ మజా ఏంటన్నది ఈ సిరీస్ రుచి చూపించింది. ఇకనుంచి ఎవరు కూడా టెస్టు మ్యాచ్‌లు బోర్ అని అనరన్న నమ్మకముంది. సంప్రదాయ ఫార్మాట్ ఎప్పటికీ ఎవర్‌గ్రీన్.
- కేఎల్ రాహుల్

ఇప్పుడు కూడా 4 రోజులంటారా..?

ఐసీసీ.. ఈ మ్యాచ్ జరిగిన విధానాన్ని చూసిన తర్వాత కూడా మీరు టెస్టులను నాలుగు రోజులకు కుదించాలనుకొంటున్నారా..? - హెర్షల్ గిబ్స్"

● మెరిసిన పావని, తీర్థు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ జూనియర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ స్విమ్మర్లు పావని సరయు (200మీ-బ్రెస్ట్ స్ట్రోక్) రజత, తీర్థు సామదేవ్ (200మీ-బ్యాక్‌స్ట్రోక్) కాంస్య పతకాలు నెగ్గారు. అహ్మదాబాద్‌లో మంగళవారం ఈ పోటీలు జరిగాయి.

'చెన్నై గ్రాండ్ మాస్టర్స్'కు అర్జున్, హారిక

చెన్నై: గ్రాండ్ మాస్టర్స్ చెస్ టోర్నీలో తెలుగు జీఎం అర్జున్ ఇరిగేసికి కఠిన పరీక్ష ఎదురయ్యే అవకాశం ఉంది. బుధవారం నుంచి రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో 9 రౌండ్లపాటు సాగే ఈ టోర్నీలో 19 మంది జీఎంలు పాల్గొననున్నారు. చాలెంజర్స్ విభాగంలో ద్రోణవల్లి హారిక, వైశాలి ఆడనున్నారు.

● బాక్సింగ్‌లో మరో ఏడు పతకాలు ఖాయం

బ్యాంకాక్: ఆసియా జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో మరో ఏడుగురు భారత మహిళా బాక్సర్లు సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లి పతకాలు ఖరారు చేసుకున్నారు. మంగళవారం జరిగిన అండర్-19 పోటీల్లో యషిక (51 కిలోలు), నిష (54 కి), ముస్కాన్ (57 కి), విని (60 కి), నిషిక (65 కి), ఆకాంక్ష (70 కి), అర్తి కుమారి (75 కి) సెమీస్‌కు చేరారు.

వలస కూలీలతో వెట్టి!

అనంతవరంలో ఆక్వా యజమానుల దాష్టీకం

మధ్యవర్తుల ద్వారా పొరుగు రాష్ట్రాల నుంచి 'ప్రకాశం'కు

నెల రోజులుగా డబ్బులివ్వని యజమానులు

- కనీస వసతి, సరైన భోజనం కూడా కల్పించని వైనం
- అల్లాడిపోయిన ఒడిశా, ఛత్తీస్‌గఢ్ కార్మికులు
- ఒకరు తప్పించుకుని వెళ్లి ఛత్తీస్‌గఢ్ కలెక్టర్‌కు ఫిర్యాదు
- ఆయన ఫోన్‌తో కదిలిన జిల్లా అధికారులు
- రెండు రాష్ట్రాలకు చెందిన 40 మందికి విముక్తి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రొయ్యల చెరువుల్లో ఉపాధి కల్పిస్తామంటే వారంతా పొట్టచేత పట్టుకుని వచ్చారు. ఇలా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి 40 మందిని పనిలో పెట్టుకున్న యజమానులు నెల రోజులుగా సరైన భోజనం కూడా పెట్టకుండా వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారు. దీంతో కూలీల్లో ఒకరు తప్పించుకుని వెళ్లి బస్తర్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ వెట్టి చాకిరీ వ్యవహారం బయటికి వచ్చింది. వివరాలివీ.. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం అనంతవరం లోని రెండు రొయ్యల చెరువుల యజమానులు నెల క్రితం మధ్యవర్తి ద్వారా ఒడిశా నుంచి 17 మంది, ఛత్తీస్‌గఢ్ నుంచి 23 మంది.. మొత్తం 40 మంది కార్మికులను ఇక్కడికి తీసుకువచ్చారు. చెరువుల వద్ద రోజంతా వారితో గొడ్డు చాకిరీ చేయించుకునేవారు. డబ్బులు ఇవ్వకపోవడమే కాదు.. సరైన భోజనం కూడా పెట్టేవారు కాదు. కనీస వసతి సైతం కల్పించలేదు. అరకొరగా బియ్యం మాత్రమే ఇవ్వడంతో దాంతో గంజి కాచుకుని అర్ధాకలితో అలమటించేవారు. ఈ నేపథ్యంలో ఒక కార్మికుడు అక్కడి నుంచి తప్పించుకొని ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ వెళ్లి అక్కడి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ప్రకాశం జిల్లా కలెక్టర్ అన్సారియాకు ఫోన్ చేసి విషయం చెప్పారు. ఆమె ఆదేశాలతో ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో రెవెన్యూ, కార్మిక, ఇతర శాఖల అధికారులు రంగంలోకి దిగారు. బాధిత కార్మికులకు విముక్తి కల్పించి ఒంగోలుకు తరలించారు. వారికి కలెక్టర్ అన్సారియా మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో రిలీఫ్ సర్టిఫికెట్లను అందించారు. వారు పనిచేసిన కాలానికి నగదు ఇప్పించడంతోపాటు, వారి స్వస్థలాలకు చేర్చాలని అధికారులను ఆదేశించారు. కాగా, బాధితుల్లో ఒకరు మైనర్ కూడా ఉన్నారని ఒంగోలు ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న తెలిపారు. సదరు పరిశ్రమలపై వెట్టి చాకిరీ నిర్మూలన, బాలకార్మిక నిర్మూలన, కనీస వేతన చట్టాల కింద కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసి స్వస్థలాలకు పంపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ సువర్ణ, కార్మికశాఖ,రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


వెట్టి చాకిరీ నుంచి విముక్తి పొందిన వారికి రిలీఫ్ సర్టిఫికెట్లు అందించిన ప్రకాశం కలెక్టర్ అన్సారియా

మధ్యవర్తుల ద్వారా ఇతర ప్రాంతాల నుంచి..

జిల్లాలోని తీరప్రాంతంలోని రొయ్యలు, చేపల చెరువుల్లో పనిచేసేందుకు ఇతర రాష్ట్రాలకు చెందిన వారిని మధ్యవర్తుల ద్వారా పనికి తీసుకొస్తుంటారు. అయితే, వారికి చెరువుల యజమానులు కనీస వసతి, సదుపాయాలు కల్పించకుండాపనులు చేయించుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అనంతవరంలో వెలుగుచూసిన ఘటనతో ఇలాంటి పరిశ్రమలపై అధికారులు దృష్టిసారించాల్సి ఉంది.

ఈడీ పోలీసులమంటూ.. దారి దోపిడీ!

కారును అడ్డగించిన కేటుగాళ్లు

- బెదిరించి రూ.70 లక్షలున్న బ్యాగ్‌తో పరార్
- స్నేహితుడి వద్ద బంగారం కొనుగోలుకు నగదు తెచ్చుకున్న బాధితుడు
- దోపిడీ జరిగాక ఆ స్నేహితుడికి ఫోన్ చేసినా లేని స్పందన
- గుంటూరు జిల్లా మేడికొండూరులో ఘటన

మేడికొండూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): దోపిడీలకు పాల్పడడంలో కేటుగాళ్లు సరికొత్త మార్గాలను ఎంచుకుంటున్నారు. ఈ క్రమంలో ఈడీ పోలీసులమంటూ బెదిరించి.. ఓ వ్యక్తి నుంచి ఏకంగా రూ.70 లక్షలు దోచుకెళ్లారు. ఈ ఘటన గుంటూరు జిల్లా మేడికొండూరు సమీపంలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితుడి కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని సంగ్లీ జిల్లాకు చెందిన మాణిక్ జగదీశ్, రంజిత్ మారుతి పటేల్ అనే ఇద్దరు రాజమహేంద్రవరంలోని నగలు తయారీ దుకాణాలలో కొంతకాలం పనిచేశారు. ప్రస్తుతం జగదీష్ విజయవాడలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో రంజిత్ తన వద్ద రెండు కేజీల ముడి బంగారం ఉందని, దానిని కేజీ రూ.58 లక్షలకు విక్రయిస్తానంటూ జగదీశ్‌కు తెలిపాడు. ఆ ముడి బంగారం కొనేందుకు డబ్బుతో సత్తెనపల్లి రావాలని జగదీశ్‌ను రంజిత్ కోరాడు. జగదీష్ తన వద్ద ఉన్న రూ.70 లక్షలతో కారులో సత్తెనపల్లికి వచ్చి.. ఆ డబ్బును రంజిత్‌కు చూపించాడు. రంజిత్ వద్ద ఉన్న ముడి బంగారాన్ని జగదీశ్ చూసి నిర్ధారించుకున్నాడు. అయితే బంగారం తూకం కోసం ఇద్దరూ మాట్లాడుకుని విజయవాడలో తూకం వేయడానికి బయలుదేరారు. వీరి రెండు కార్లు ఒకదాని వెంట ఒకటి వస్తున్న క్రమంలో.. వెంబడిస్తూ పార్చ్యూనర్ కారులో వచ్చిన ఆరుగురు వ్యక్తులు మేడికొండూరు సమీపంలోని ఈద్గా వద్ద జగదీష్ కారును అడ్డగించారు. తాము ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పోలీసులమని, మీ కారుని తనిఖీ చేయాలని చెప్పారు. వారిలో ఇద్దరు పోలీసు దుస్తులు ధరించి ఉండటంతో నిజంగానే పోలీసులని భావించిన జగదీష్ తన కారు డోరు తెరిచాడు. కారులో ఉన్న డబ్బుల బ్యాగును తీసుకొని రేపు ఈడీ ఆఫీస్‌కి వచ్చి ఫిర్యాదు చేయాలని వెళ్లిపోయారు. ముడి బంగారం ఉన్న రంజిత్‌ను తమతో రావాలని చెప్పి అక్కడి నుంచి ఉడాయించారు. అనంతరం రంజిత్‌కు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందన లేదు. దీంతో వచ్చింది దొంగలేనని, పథకం ప్రకారం డబ్బు దోచుకుపోయారని భావించిన జగదీశ్ మేడికొండూరు పోలీసులను ఆశ్రయించాడు.

సుప్రీం వ్యాఖ్యలు అవాంఛనీయం

- రాహుల్‌కు 'ఇండీ' కూటమి సమర్థన
- ఎవరు నిజమైన భారతీయుడో నిర్ణయించేది జడ్జీలు కాదు: ప్రియాంక

న్యూఢిల్లీ, ఆగస్టు 5: చైనా మన భూభాగాన్ని ఆక్రమించిందన్న కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీపై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు అవాంఛనీయమని విపక్షాల 'ఇండీ' కూటమి పేర్కొంది. లోక్‌సభలో ప్రతిపక్ష నేతకు పూర్తి మద్దతు ప్రకటించింది. మంగళవారం పార్లమెంటు ఉభయ సభల్లోని వివిధ విపక్షాల నాయకులు సమావేశమయ్యారు. లోక్‌సభ, రాజ్యసభల్లోని ప్రతిపక్ష నేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే కూడా హాజరయ్యారు. జాతీయ ప్రయోజనాలు ఇమిడి ఉన్న అంశాలపై వ్యాఖ్యలు చేయడం విపక్ష నేతగా రాహుల్ బాధ్యత అని పలువురు నేతలు పేర్కొన్నారు. రాహుల్‌నుద్దేశించి, పార్టీల ప్రజాస్వామిక హక్కులపైన సుప్రీంకోర్టు సిటింగ్ న్యాయమూర్తి అసాధారణ వ్యాఖ్య చేశారని, ఇది అవాంఛనీయమని అన్ని పార్టీల నాయకులూ అన్నట్లు కాంగ్రెస్ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ అంశంపై రాహుల్ సోదరి, వయనాడ్ కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకాగాంధీ వాద్రాను మీడియాను ప్రశ్నించగా.. ఎవరు నిజమైన భారతీయులో నిర్ణయించేది సుప్రీంకోర్టు న్యాయమూర్తులు కాదని ఆమె బదులిచ్చారు. 'ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ఆయన విధి. అదే ఆయన చేశారు' అని స్పష్టంచేశారు. మరోవైపు, సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ఇకనైనా రాహుల్ తన నడత మార్చుకోవాలని, రాజ్యాంగ విలువలను గౌరవించాలని బీజేపీ సూచించింది. కోర్టు ఆక్షేపణ ఆయనకు తీవ్ర హెచ్చరికవంటిదని ఆ పార్టీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ అన్నారు. రాజ్యాంగ ప్రతిని చేతిలో పట్టుకుని దేశమంతా తిరిగేవాళ్లకు.. ఆ రాజ్యాంగమంటే వీసమెత్తు గౌరవం ఉన్నా.. కోర్టు అలాంటి వ్యాఖ్యలు చేయాల్సిన పరిస్థితి ఉత్పన్నమయ్యేది కాదని కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు.


ఇండియా కూటమి పార్టీల ఫ్లోర్ లీడర్స్ సమావేశంలో రాహుల్, ఖర్గే, కనిమొళి, సుప్రియ తదితరులు

ఇండీ కూటమి ప్రదర్శన 11కు వాయిదా

అసెంబ్లీ ఎన్నికల ముంగిట బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణను నిరసిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) కార్యాలయం వరకూ ప్రతిపక్ష ఇండీ కూటమి నిర్వహించ తలపెట్టిన ర్యాలీ 11కి వాయిదా పడింది. తొలుత ఈ నెల 8న ప్రదర్శన చేపట్టాలని నిర్ణయించినా జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) వ్యవస్థాపకుడు- జార్ఖండ్ మాజీ సీఎం శిబూ సోరెన్ మృతితో వాయిదా పడిందని ఆ కూటమి వర్గాలు తెలిపాయి. అయితే, రాహుల్ గాంధీ నూతన నివాసంలో ఈ నెల 7న ఇండీ కూటమి పక్షాల విందు సమావేశం యథాతథంగా సాగుతుందని ఆ వర్గాల కథనం. ఇక 2023 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మహదేవపుర సెగ్మెంట్ ఓటర్ల జాబితాలో భారీస్థాయిలో అవకతవకలు జరిగినందుకు నిరసనగా రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో మంగళవారం బెంగళూరులో నిర్వహించాల్సిన ప్రదర్శన ఈ నెల 8కి వాయిదా పడింది.

రాజ్యసభలో సీఐఎస్ఎఫ్ దళాలపై రేణుక అసహనం

న్యూఢిల్లీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) రాజ్యసభలో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్) దళాలను మార్షల్స్‌లా నియమించి ప్రతిపక్ష ఎంపీలను అడ్డుకోవడంపై కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరీ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రేణుకాతో పాటు ప్రతిపక్ష ఎంపీలు మంగళవారం వెల్‌లోకి దూసుకు వెళ్లేందుకు ప్రయత్నించగా సిఐఎస్ఎఫ్ సిబ్బంది వారిని అడ్డుకున్నారు. అనంతరం రేణుక మాట్లాడుతూ, పార్లమెంట్‌లో సిఐఎస్ఎఫ్ దళాలను మార్షల్స్‌గా వాడడం సరైంది కాదని అన్నారు. నిజమైన ఉగ్రవాదులను వారు పట్టుకోలేకపోయారని, ఆపరేషన్ మహదేవ్ పేరిట పట్టుకున్న వారు నిజమైన ఉగ్రవాదులో కాదో తెలియదని అన్నారు. కానీ పార్లమెంట్‌లో మాత్రం ఈ భద్రతా దళాలు మహిళలని కూడా చూడకుండా దురుసుగా ప్రవర్తిస్తాయని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వ స్థాయి ఇదని రేణుకా విరుచుకుపడ్డారు.

ప్రముఖ కథా రచయిత కోడూరి శ్రీరామమూర్తి అస్తమయం



రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కథా రచయిత, సాహిత్య విమర్శకుడు కోడూరి శ్రీరామమూర్తి మంగళవారం రాత్రి రాజమహేంద్రవరంలోని దానవాయిపేటలో ఆయన స్వగృహంలో కన్నుమూశారు. శ్రీరామమూర్తి లిటరరీ కాలమిస్టుగా, సమకాలీన ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక అంశాలను విశ్లేషిస్తూ దినపత్రికల్లో వ్యాసాలు రాసే ఫ్రీలాన్స్ జర్నలిస్ట్‌గా, వేలాది సాహితీ విమర్శనా వ్యాసాలు రాసిన సాహితీ విమర్శకుడిగా పలువురి మన్ననలను పొందారు. తెలుగు నవలా సాహిత్యంలో మనో విశ్లేషణ పుస్తకం 1978లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ నుంచి ఉత్తమ సాహిత్య విమర్శ గ్రంథంగా పురస్కారం పొందింది. తెలుగు కథ... నాడు-నేడు పుస్తకం 2007లో తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ఉత్తమ సాహిత్య విమర్శనా గ్రంథంగా పురస్కారం పొందింది. కాగా ఇటీవల ఆయన రాసిన 'రచయితగా మహాత్ముడు', 'మహాత్ముని అడుగుజాడలు' పుస్తకాలను ప్రముఖ వైద్యుడు, అభ్యుదయవాది డాక్టర్ చెలికాని స్టాలిన్ ఈ ఏడాది ఏప్రిల్ 28న ఆవిష్కరించారు.

సీమలో వర్షాలు.. కోస్తాలో ఎండలు

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ, ఉత్తర తమిళనాడుకు ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో వేర్వేరుగా ఉపరితల ఆవర్తనాలు ఏర్పడ్డాయి. నైరుతి బంగాళాఖాతం నుంచి రాయలసీమ, కర్ణాటక మీదుగా అరేబియా వరకు ఉపరితల ద్రోణి విస్తరించింది. వీటి ప్రభావంతో మంగళవారం రాయలసీమలో ఎక్కువ చోట్ల, దక్షిణ కోస్తా, ఉత్తర కోస్తాలో పలుచోట్ల వర్షాలు కురిశాయి. కోస్తాలో ఎక్కువ చోట్ల ఎండ తీవ్రత కొనసాగింది. కావలిలో 38 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో రాయలసీమలో అనేక చోట్ల, కోస్తాలో పలు చోట్ల వర్షాలు కురుస్తాయని, అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఆ తర్వాత 2-3 రోజులు కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★


ఇదొక తిండిపోతు కథ



- ఎస్‌జే శివ

'ఇప్పటి వరకూ తెలుగులో చాలా జోనర్‌లు వచ్చాయి. ఈ కొత్త జోనర్‌ను మా సినిమాతోనే ఇంట్రడ్యూస్ చేస్తున్నాం. ఇదొక తిండిపోతు కథ. హాస్యంతో ప్రేక్షకులను రంజింపజేయడమే మా లక్ష్యం' అని అన్నారు దర్శకుడు ఎస్‌జే శివ. ఆయన దర్శకత్వంలో వైవా హర్ష టైటిల్ రోల్ పోషించిన చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. ఎస్‌జే మూవీస్ పతాకంపై లక్ష్మయ్య ఆచారి, జనార్దన్ ఆచారి నిర్మించారు. సినిమా ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా పాత్రికేయులతో ఎస్‌జే శివ చిత్ర విశేషాలు పంచుకున్నారు. 'ఐదుగురు బ్యాచిలర్స్ మధ్య జరిగే కామెడీ కథ ఇది. కథ వినగానే ప్రవీణ్ ఈ సినిమాకు కథే హీరో..తప్పకుండా మనం చేద్దాం అన్నారు. ఇంతకు ముందు వచ్చిన 'ఘటోత్కచుడు', 'యమలీల' చిత్రాల్లా ఆడియన్స్ థ్రిల్లింగ్‌గా ఫీలవుతారు. ఈ సినిమాలో హారర్ థ్రిల్లర్, కామెడీ, ఎమోషన్స్ అన్నీ ఉన్నాయి. ఎస్వీసీ లాంటి గొప్ప సంస్థ మా చిత్రాన్ని విడుదల చేయడం ఆనందంగా ఉంది' అని అన్నారు.

'మాస్ జాతర'లో ఓలే.. ఓలే..!



రవితేజ కథానాయకుడిగా నటిస్తోన్న చిత్రం 'మాస్ జాతర'. భాను భోగవరపు దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. శ్రీలీల కథానాయిక. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ చిత్రంపై భారీ అంచనాలను పెంచేసింది. మొదటి గీతంగా విడుదలైన 'తు మేరా లవర్' అందర్నీ ఉర్రూతలూగించింది. ఇప్పుడు రెండో గీతంగా 'ఓలే ఓలే..'ని విడుదల చేసింది చిత్ర బృందం. రవితేజ- శ్రీలీల పోటా పోటీగా నర్తించి పాటను మరో స్థాయికి తీసుకెళ్లారు. భాస్కర్ యాదవ్ దాసరి సాహిత్యానికి భీమ్స్ సిసిరోలియో తనదైన శైలిలో స్వరపరిచారు.

విజువల్ వండర్‌గా జటాధర



సుధీర్ బాబు, బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలు పోషిస్తున్న మైథలాజికల్ సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'జటాధర' చిత్రం ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని అద్భుతమైన గ్రాఫిక్స్‌తో విజువల్ వండర్‌గా తీర్చిదిద్దుతున్నారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో సుధీర్‌బాబు, సోనాక్షి గెటప్స్ ఆకట్టుకుంటున్నాయి. ఈ ఏడాదిలోనే విడుదలయ్యే 'జటాధర' చిత్రాన్ని ఉమేశ్‌కుమార్, శివిన్ నారంగ్, అరుణ అగర్వాల్, ప్రేర్నా అరోరా, శిల్పా సింగాల్, నిఖిల్ నందా నిర్మిస్తున్నారు.

దుల్కర్ కొత్త సినిమా




విలక్షణ నటుడు దుల్కర్ సల్మాన్ తెలుగులో నూతన దర్శకుడు రవి నేల కుదిటితో ఓ సినిమా చేయబోతున్నారు. హైదరాబాద్‌లో ఈ ప్రాజెక్టును ఘనంగా ప్రారంభించారు. ముహూర్తపు షాట్‌కు హీరో నాని క్లాప్ కొట్టారు. దర్శకుడు బుచ్చిబాబు సానా కెమెరా స్విచ్చాన్ చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రాన్ని ఎస్ఎల్‌వీ సినిమాస్ బేనర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. రెగ్యులర్ షూటింగ్ హైదరాబాద్‌లో ప్రారంభమైనట్లు చిత్రబృందం తెలిపింది.

గూఢచారి రాక ఖరారు



బ్లాక్ బస్టర్ స్పై థ్రిల్లర్ 'గూఢచారి'కి సీక్వెల్‌గా తెరకెక్కుతోన్న చిత్రం 'జీ2'. అడివి శేష్ కథానాయకుడిగా నటిస్తోన్న ఈ చిత్రాన్ని 2026 మే 1న విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రం ద్వారా వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్నారు. సినిమాలో ఈసారి ఏజెంట్ 116గా వామికా గబ్బి ఎంట్రీ ఇస్తున్నారు. యాక్షన్‌తో పాటు ఎమోషన్ ఉన్న క్యారెక్టర్ ఇది. ఇమ్రాన్ హష్మీ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. అలాగే మురళీ శర్మ, సుప్రియా యార్లగడ్డ, మధు శాలిని కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 150 రోజులపాటు, ఆరు దేశాల్లో, 23 భారీ సెట్లతో ఈ సినిమాను చిత్రీకరిస్తున్నారు.

ఆ రీల్‌కు 190కోట్ల వ్యూస్



బాలీవుడ్ నటి దీపికా పడుకోన్ ఇటీవల ఓ హోటల్ ప్రచారం కోసం రూపొందించిన యాడ్‌లో నటించారు. ఆ వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశారు. ఈ వీడియో(రీల్)కు కేవలం 8వారాల్లోనే 190కోట్ల(1.9బిలియన్లు) వ్యూస్ వచ్చాయి. ఇదొక ప్రపంచ రికార్డు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఇంత వరకు మరే వీడియోకు ఇన్ని వ్యూస్ రాలేదు. దీంతో, దీపిక ఫ్యాన్స్ సంతోషపడుతున్నారు. 200కోట్ల వ్యూస్ మార్క్‌ను అందుకోనున్న మొట్టమొదటి వీడియోగా ఇది రికార్డులెక్కబోతోందని కామెంట్లు పెడుతున్నారు. దీపికకు సోషల్ మీడియాలో 8కోట్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. కాగా, హార్దిక్ పాండ్యా 'టేక్ ది షాట్' అన్న క్యాప్షన్‌తో పోస్టు చేసిన రీల్ 160 కోట్ల(1.6బిలియన్) వ్యూస్‌తో రెండో స్థానంలో ఉంది. ఇదిలా ఉండగా, యూట్యూబ్‌లో మాత్రం గంగ్నమ్ స్టైల్ పాటకు ఇప్పటివరకు ఏకంగా 560కోట్ల(5.6బిలియన్) వ్యూస్ వచ్చాయి.

అప్పుడు జోక్యం చేసుకుంటా



టాలీవుడ్ నిర్మాతలు మెగాస్టార్ చిరంజీవిని మంగళవారం కలిశారు. ప్రస్తుతం పరిశ్రమలో నెలకొన్న పరిస్థితులను.. ఫెడరేషన్ సభ్యులు షూటింగ్‌లను బంద్ చేయడం వల్ల తలెత్తిన సమస్యలను వివరించారు. ఈ సమావేశంలో నిర్మాతలు చిరంజీవితో చర్చించిన విషయాలను, ఆయన స్పందనను మీడియాతో సి.కల్యాణ్ పంచుకున్నారు. "నిర్మాతలమందరం కలసి ప్రస్తుతం పరిశ్రమలో తలెత్తిన సమస్యను చిరంజీవికి వివరించాం. 'ఈ విధంగా షూటింగ్స్ ఆగిపోవడం బాధాకరం. నిర్మాతల వెర్షన్‌ను విన్నాను. ఫిల్మ్ ఫెడరేషన్ సభ్యుల వాదనలు కూడా విని తెలుసుకుంటాను. మరో రెండు మూడు రోజుల్లో పరిస్థితులు సద్దుమణుగుతాయేమో చూస్తాను. అప్పటికీ ఏ మార్పూ లేకుంటే 'నేను కలుగజేసుకుంటా' అని చిరంజీవి చెప్పారు' అని సి.కల్యాణ్ పేర్కొన్నారు.

ఐటీ ఉద్యోగుల కంటే వారికే వేతనాలెక్కువ: ప్రసన్నకుమార్

ఫిల్మ్ ఫెడరేషన్ వేతన పెంపుపై నిర్మాతల మండలి సెక్రటరీ ప్రసన్నకుమార్ స్పందించారు. 'ఫిల్మ్ ఛాంబర్ ప్రతినిధులతో మూవీ అసోసియేషన్ అధ్యక్షుడు మంచు విష్ణు చర్చించారు. ఛాంబర్‌తోనే 'మా' ముందుకు వెళ్తుందని తెలిపారు. పేద సినీ కార్మికులకు మేం ఎప్పుడూ అండగా ఉంటాము. ఐటీ ఉద్యోగుల కన్నా యూనియన్ కార్మికులకు జీతాలెక్కువ. మా కార్మికులతోనే పనిచేయాలి అని యూనియన్ వాళ్లు చెప్పడం తప్పు' అని ప్రసన్నకుమార్ అన్నారు.

సినీ కార్మికుడు రోజుకు 15 గంటలు పనిచేస్తాడు: వల్లభనేని అనిల్

'యూనియన్ సభ్యులు కానివారితోనూ ఇకపై టాలీవుడ్ నిర్మాతలు పనిచేయించుకోవచ్చు' అని ఫిల్మ్ ఛాంబర్ తీసుకున్న నిర్ణయంపై ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ స్పందించారు. 'సినీ కార్మికుల్లో స్కిల్ లేకుంటే అంతర్జాతీయ స్థాయి సినిమాలు వచ్చేవా? ఇప్పుడేమో కార్మికులు వద్దు, కొత్తవారిని తీసుకువస్తామంటున్నారు. వేతన పెంపును ముందునుంచి అడుగుతూనే ఉన్నాం. సడన్‌గా బంద్ అని ఎప్పుడూ అనలేదు. అయినా, మేము అడిగినంత ఇచ్చేందుకు కొందరు నిర్మాతలు ముందుకు వచ్చారు. బయటివారికంటే సినీ కార్మికులకు జీతాలెక్కువ అని అంటున్నారు. కానీ సినీ కార్మికుడు రోజుకు దాదాపు 15 గంటలు పనిచేస్తాడు. కార్మికుల వేతన సమస్యలపై చర్చించడానికి లేబర్ కమిషనర్ అదనపు కమిషనర్ గంగాధర్‌ను కలిశాం. ప్రొడ్యూసర్ కౌన్సిల్‌తో చర్చిస్తామని ఆయన తెలిపారు. రేపటితో సినిమా ఇండస్ట్రీలో నెలకొన్న సందిగ్ధతలు తొలగిపోతాయి అని ఆశిస్తున్నాం' అని పేర్కొన్నారు.

కార్మికులకు జీతాలు పెంచాలి: కోమటిరెడ్డి వెంకటరెడ్డి

సినీ కార్మికుల వేతన పెంపు విషయంలో కార్మికులకు మద్దతు పలికారు తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి. 'కార్మికులకు జీతాలు పెంచాలి. ఢిల్లీ పర్యటన తర్వాత కార్మికులతో నేను మాట్లాడుతాను. ఈ అంశాలని దిల్‌రాజుకు అప్పగించాం. కార్మికుల డిమాండ్లపై చర్చించి నిర్ణయం తీసుకోవాలి' అని పేర్కొన్నారు.

చిరంజీవి పుట్టినరోజున విడుదల



సత్యరాజ్ ప్రధాన పాత్రలో మోహన్ శ్రీవాత్సవ తెరకెక్కించిన చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్'. దర్శకుడు మారుతి సమర్పణలో విజయ్‌పాల్ రెడ్డి అడిదెల నిర్మించారు. వశిష్ట ఎన్.సింహా, ఉదయ భాను, ముఖ్య పాత్రలు పోషించారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో సత్యరాజ్ మాట్లాడుతూ 'మెగాస్టార్ చిరంజీవి గొప్ప నటుడు. ఆయన పుట్టినరోజు సందర్భంగా ఈనెల 22న సినిమా విడుదలవుతుండటం ఆనందంగా ఉంది' అని అన్నారు.

ఎరువుల కోసం ఏ రైతూ ఇబ్బంది పడొద్దు

» కలెక్టర్లకు మంత్రి అచ్చెన్న ఆదేశాలు



అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏ రైతూ ఎరువుల కోసం ఇబ్బంది పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లు, అధికారులను వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అధికారులతో ఎరువుల సరఫరాపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలని సూచించారు. 'మార్క్‌ఫెడ్ గోదాముల్లో బఫర్ స్టాక్ ఉంచాలి. కొరత ఏర్పడే పరిస్థితులు ఉత్పన్నమైతే ముందుగానే గమనించి, ఎరువుల సరఫరా పెరిగేలా చర్యలు తీసుకోవాలి. కొన్ని ప్రాంతాల్లో యూరియా కొరత ఉందన్న అపోహలు రైతుల్లో తలెత్తకుండా సహకార సంఘాలను పర్యవేక్షిస్తూ, దుకాణాలను తనిఖీలు చేసి, అందరికీ ఎరువులు అందుతున్నాయా, లేదా అని చూసుకోవాలి. కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం చర్చించి, ఇతర రాష్ట్రాల కన్నా అధికంగా ఎరువులు తెప్పిస్తున్నా.. యూరియా కొరత ఎందుకు ఏర్పడుతుందో క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి' అని అధికారులను ఆదేశించారు. ఎరువుల కొరత అంటూ వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మొద్దని రైతులను మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, డైరెక్టర్ డిల్లీరావు పాల్గొన్నారు.

14,733 కోట్లతో సాగరమాల: బీసీ జనార్దన్‌రెడ్డి

అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సాగరమాల పథకం అమలు కోసం రూ.14,733 కోట్లతో ప్రతిపాదలు సిద్ధం చేశామని మంత్రి బీసీ జనార్దనరెడ్డి వెల్లడించారు. సచివాలయంలో మంగళవారం ఆయన 16 శాఖలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంలో సాగరమాల పథకం కింద రాష్ట్రానికి పలు అభివృద్ధి పనులకు ఆమోదం లభించిందని.. వీటిని సద్వినియోగం చేసుకోవాలని అధికారులకు చెప్పారు. ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేసేందుకు నివేదికలు సిద్ధం చేయాలన్నారు. ఏపీ మారిటైమ్ బోర్డు ద్వారా రూ.1,584 కోట్లతో చేపట్టిన ఆరు పనులను, విశాఖ పోర్టు ద్వారా రూ.1,254 కోట్లతో చేపట్టిన పనులను, ఏపీ టూరిజం ద్వారా రూ.245 కోట్ల చేపట్టిన నాలుగు పనులను మంత్రి సమీక్షించారు. రాష్ట్రంలో పీపీపీ విధానంలో చేపట్టనున్న పోర్టుల నిర్మాణ వేగాన్ని పెంచాలని చెప్పారు.

రామాయపట్నం ఫేజ్-1 గడువు పెంపు

రామాయపట్నం గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణ గడువు పెంచుతూ మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకుంది. సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, బీసీ జనార్దనరెడ్డి, కందుల దుర్గేశ్ పాల్గొన్నారు. పోర్టు డ్రాఫ్ట్ 16 నుంచి 18.5 మీటర్లకు పెంచే ప్రతిపాదనలకు సమావేశం ఆమోదం తెలిపింది.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు 'అక్షయపాత్ర' భోజనం

» నేడు నాలుగు క్యాంపస్‌లలో ఒప్పందాలు

అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ(రాష్ట్ర ట్రిపుల్ ఐటీలు)ల్లో అక్షయపాత్ర ద్వారా విద్యార్థులకు భోజనం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని నాలుగు క్యాంపస్‌లలో ప్రస్తుతం తాత్కాలిక విధానంలో కాంట్రాక్టర్లు మెస్‌లు నిర్వహిస్తున్నారు. గతంలో ఉన్న కాంట్రాక్టర్లపై ఫిర్యాదులు రావడంతో వారిని తొలగించి వీరిని నియమించారు. అయితే వీరి పనితీరుపై కూడా ఫిర్యాదులు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో లాభాపేక్ష లేని అక్షయపాత్ర సంస్థకు మెస్ నిర్వహణ అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. బుధవారం నాలుగు క్యాంపస్‌లలో వేర్వేరుగా అక్షయపాత్రతో ఒప్పందాలు చేసుకోనున్నారు.

కార్మికుల అడ్డాల వద్ద 'ఇమ్యూనిటీ కాంప్లెక్స్'లు

అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కార్మికుల సౌకర్యార్థం జిల్లాల్లో 'ఇంటిగ్రేటెడ్ లేబర్ ఇమ్యూనిటీ కాంప్లెక్స్'లు నిర్మించాలని కార్మిక సంక్షేమ బోర్డు నిర్ణయం తీసుకుంది. మంగళవారం విజయవాడలోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, చైర్మన్ వి.బాబ్జీ నేతృత్వంలో బోర్డు తొలి సమావేశం నిర్వహించారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిల్లో ఇంటిగ్రేటెడ్ లేబర్ ఇమ్యూనిటీ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు నైపుణ్యం పెంపొందించే కార్యక్రమాలు నిర్వహిస్తారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ల విధుల్లోని కొన్నింటిని సామాజిక భద్రత రక్షణ అధికారులకు బదలాయించాలని, భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు ఐటీ నైపుణ్యాలు పెంచేందుకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు.

నేడు విజయవాడలో స్కిల్లింగ్ డ్రైవ్

అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): గ్రీన్ వర్క్‌ఫోర్స్‌కు కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ ఎదగడానికి ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. యువతకు పునరుత్పాదక ఇంధన రంగంలో నైపుణ్య శిక్షణ ఇచ్చి పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈనేపథ్యంలోనే విజయవాడలో బుధవారం జాతీయ స్థాయిలో అతిపెద్ద రెన్యూవబుల్ ఎనర్జీ స్కిల్లింగ్ డ్రైవ్ జరగనుంది. ఈ డ్రైవ్‌లో దాదాపు 250 సౌర, పవన, గ్రీన్ హైడ్రోజన్, పంప్డ్ స్టోరేజీ విద్యుదుత్పత్తి సంస్థల ప్రతినిధులు పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి మంత్రి లోకేశ్ హాజరుకానున్నారు.

ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు ఇవ్వండి

» గౌరవ వేతనాలు పెంచండి: సర్పంచ్‌ల డిమాండ్

అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,121 కోట్లను వెంటనే పంచాయతీలకు విడుదల చేయాలని, తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి సర్పంచ్‌లు మంగళవారం తాడేపల్లిలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనరేట్‌కు తరలివచ్చారు. కమిషనర్ కృష్ణతేజను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఆరు నెలల కిందటే కేంద్రం నుంచి వచ్చిన నిధులను పంచాయతీ ఖాతాల్లో జమ చేయకపోవడంతో గ్రామాల్లో కనీస సౌకర్యాలు కల్పించలేకపోతున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు సర్పంచ్‌ల గౌరవ వేతనాన్ని రూ.3 వేల నుంచి రూ.15 వేలకు పెంచాలని కోరారు. సర్పంచ్‌లు మరణిస్తే రూ.20 లక్షల బీమా సదుపాయం కల్పించాలని, ఉపాధి పనులు సర్పంచ్‌ల ఆధ్వర్యంలో జరిగేలా చూడాలని తదితర డిమాండ్లను కమిషనర్ ముందు ఉంచారు. ఈ సందర్భంగా కమిషనర్ కృష్ణతేజ మాట్లాడుతూ వీలైనంత త్వరగా 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేస్తామని చెప్పారు. కమిషనర్‌ను కలిసిన వారిలో సర్పంచ్‌లు టి.కృష్ణమోహన్, జయరాంరెడ్డి, ధర్మరాజు, రమేష్‌రెడ్డి, అల్లాబక్షు, శ్రీరామమూర్తి, మోహన్ ఉన్నారు.

గీతన్నలకు పెద్దన్న చంద్రన్న: గురుమూర్తి

అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): నూతన బార్ పాలసీలో 10 శాతం బార్లు గీత కార్మికులకు ఇవ్వాలనే నిర్ణయంపై గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి సీఎం చంద్రబాబుకి, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో మద్యం షాపుల్లో కూడా 10 శాతం వాటా కేటాయించి గీత కార్మికులకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందని అన్నారు. వైసీపీ గీత వృత్తిని సర్వనాశనం చేసిందని, కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీసిందని మండిపడ్డారు.



జూబ్లీహిల్స్‌లోని కదరి ఆర్ట్ గ్యాలరీలో అనన్య నాదెళ్ల పెయింటింగ్‌లను పరిశీలిస్తున్న ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ

అద్భుతం...అనన్య సామాన్యం!

» పిన్న వయసులోనే కాన్వాస్‌పై అద్భుత చిత్రాలను ఆవిష్కరించిన అనన్య నాదెళ్ల

» ప్రదర్శనను ప్రారంభించి, ఆశీర్వదించిన ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ


» వాస్తవికతను ప్రతిబింబించేలా చిత్రాలు: మురళీమోహన్

హైదరాబాద్‌సిటీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : చూసింది.. చూసినట్టుగా బొమ్మ గీయడం అతి తక్కువ మందికే సాధ్యం. అందులోనూ ఏడో తరగతి చదివే అమ్మాయి.. తాను చూసిన దానికి తనదైన సృజనను జోడించి కాన్వాస్‌పై చిత్రంగా మార్చడం నిజంగా అద్భుతమే. అలాంటి అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది అనన్య నాదెళ్ల. ధ్యాన ముద్రలో ఉన్న శివయ్య, శక్తిస్వరూపిణి (పార్వతీ మాత) ఆనంద తాండవాన్ని ముక్కంటి వీక్షించడం, రామకోటి రాసుకుంటున్న తాతమ్మ, భాగ్యనగర కీర్తి ప్రతీక చార్మినార్ వద్ద సందడి.. ఇలా ఆమె చేతి నుంచి జాలువారిన 24 చిత్తరువులు ఆహూతులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాయి. జూబ్లీహిల్స్‌లోని కదరి ఆర్ట్ గ్యాలరీలో అనన్య పెయింటింగ్స్‌తో మంగళవారం ప్రదర్శన ఏర్పాటు చేశారు. రెండు రోజుల పాటు సాగే ప్రదర్శన ప్రారంభోత్సవానికి 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ, సినీనటుడు మురళీమోహన్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ప్రదర్శనలోని చిత్రాలను తిలకించిన వేమూరి రాధాకృష్ణ.. మరింత వృద్ధిలోకి రావాలని అనన్యను ఆశీర్వదించారు. "చిన్నఅమ్మాయి పెయింటింగ్ ఎగ్జిబిషన్ అంటే.. ఏదో చిన్నగా ఉంటుందిలే అనుకున్నాను. ఇంత అద్భుతంగా ఉంటుందనుకోలేదు" అని మురళీమోహన్ ప్రశంసించారు. ఎక్రిలిక్ శైలిలో ఈ చిత్రాలు గీశానని, అబ్‌స్ట్రాక్ట్, చార్‌కోల్ మాధ్యమాలను వినియోగించానని అనన్య తెలిపారు. 'ఆంధ్రజ్యోతి' వైస్ ప్రెసిడెంట్ శృతి కీర్తి, 'ఏబీఎన్' చానెల్ డైరెక్టర్ అనూష, పారిశ్రామికవేత్తలు బొల్లినేని కృష్ణయ్య, చుక్కపల్లి సురేశ్, అనన్య తల్లిదండ్రులు సందీప్, కావ్య, తాతయ్య నాన్నమ్మలు నాదెళ్ల సుబ్బారావు, మాధవి, అనన్య గురువు ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

వీళ్లా.. భావి టీచర్లు!?

టెట్ లేకుండానే డీఎస్సీ రాశారు

2 వేల మంది అనర్హులుగా గుర్తింపు



అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ఉంటేనే డీఎస్సీలో టీచర్ ఉద్యోగాలు వస్తాయి. టెట్ లేకుండా డీఎస్సీలో టాపర్‌గా నిలిచినా ప్రయోజనం ఉండదు. కానీ, ఏం అనుకున్నారో ఏమోగానీ దాదాపు 2వేల మంది అభ్యర్థులు టెట్‌లో అర్హత లేకుండానే మెగా డీఎస్సీ-2025 పరీక్షలు రాశారు. దరఖాస్తు సమయంలో టెట్ మార్కులు నమోదు చేయాలి. సర్టిఫికెట్ అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదు. టెట్ రాసిన సంవత్సరం, హాల్‌టికెట్ నంబరు, మార్కుల వివరాలు ఇస్తే సరిపోతుంది. ఈ క్రమంలో టెట్‌లో అర్హత సాధించని వారు కూడా అనేక మంది దరఖాస్తు చేసుకున్నారు. తీరా ఇప్పుడు వారు ఇచ్చిన హాల్ టికెట్ నంబర్ల ఆధారంగా టెట్ డేటాబేస్‌తో సరిపోల్చి చూడగా వారి టెట్ అర్హత వివరాలు కనిపించడం లేదు. అలాగే, మరో 35 వేల మంది టెట్ మార్కులు తప్పుగా నమోదుచేశారు. వీరిలో 26 వేల మంది వివరాలను టెట్ డేటాబేస్ నుంచి తీసి సరిదిద్దారు. ఇంకా 9 వేల మంది వివరాలు సరిపోలలేదు. టెట్ అర్హత లేకుండా డీఎస్సీ రాయడం, టెట్‌లో మార్కులు ఎక్కువగా చూపించడం వంటి చర్యలు చూసి అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దరఖాస్తులో ఎక్కువ మార్కులు చూపించినంత మాత్రాన దానినే ప్రామాణికంగా తీసుకోరు. వారి హాల్ టికెట్ నంబరు ఆధారంగా వాస్తవ మార్కులను సరిపోల్చుకుని వాటినే పరిగణిస్తారు. ఇవన్నీ తెలిసినా వేల మంది అభ్యర్థులు ఎక్కువ మార్కులు వచ్చినట్లుగా చూపించుకోవడం గమనార్హం. మరికొందరు తక్కువ మార్కులు కూడా నమోదు చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడం తెలియనివారు ఇంటర్నెట్ సెంటర్ల ద్వారా దరఖాస్తులు సమర్పించారు. ఈ క్రమంలో అనేక పొరపాట్లు జరిగాయి. వాస్తవానికి డీఎస్సీ దరఖాస్తు ఎలా చేసుకోవాలనే విషయంపై పాఠశాల విద్యా శాఖ విస్తృతంగా అవగాహన కల్పించింది. దరఖాస్తు చేసుకునే ప్రక్రియపై వీడియోలు రూపొందించి అభ్యర్థులకు అందుబాటులోకి తెచ్చింది. అయినా వేల మంది అభ్యర్థులు పొరపాట్లు చేశారు.

ముందస్తు జాగ్రత్తలు

తొలుత సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని డీఎస్సీ పరీక్షలకు ముందు పాఠశాల విద్యా శాఖ నిర్ణయించింది. కానీ, అనేక వినతుల నేపథ్యంలో సర్టిఫికెట్ల అప్‌లోడ్‌ను తొలగించింది. దీంతో అభ్యర్థులు వారి సర్టిఫికెట్లలో ఉన్న మార్కులను నమోదు చేసుకున్నారు. కొందరు తప్పుగా నమోదు చేశారు. అయితే, ఇప్పుడు పొరపాటు చేసినా మాన్యువల్‌గా జరిగే తుది సర్టిఫికెట్ల పరిశీలనలో పొరపాట్లు చేసినవారు, అనర్హులు దొరికిపోతారు. అయితే, తుది దశ వరకు ఉంచి వారిని నిరుత్సాహపరచకూడదన్న ఉద్దేశంతో పాఠశాల విద్యాశాఖ ముందస్తు జాగ్రత్తలు ప్రారంభించింది. ఆన్‌లైన్ విధానంలోనే తొలుత టెట్ మార్కులు సరిపోల్చి, అనర్హుల వడపోత ప్రారంభించింది. ఈ క్రమంలో అనేక మంది అనర్హులు బయట పడుతున్నారు.

తుది 'కీ'పై కూడా..

డీఎస్సీ ఫైనల్ 'కీ'పై అనేక అభ్యంతరాలు వస్తున్నాయి. వాటిని పరిశీలిస్తున్న విద్యాశాఖ అభ్యంతరాల్లో వాస్తవం ఉంటే మార్కులు కలపడం లేదా ఆ ప్రశ్నలు రద్దుచేయడం వంటి చర్యలు తీసుకుంటోంది. ఆ చర్యల అనంతరం రెండు, మూడు రోజుల్లోనే తుది మార్కులు ప్రకటించాలని భావిస్తోంది. డీఎస్సీ పరీక్షల నార్మలైజేషన్, టెట్ మార్కులు కలిపి తుది మార్కులు ఇస్తారు. తుది మార్కులపైనా అభ్యంతరాలు తెలిపే అవకాశం అభ్యర్థులకు కల్పించనుంది. ఒక్క మార్కు తేడా వచ్చినా ఉద్యోగం కోల్పోయే పరిస్థితి ఉన్నందున అభ్యర్థుల్లో అపోహలు కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆ తర్వాతే తుది ఫలితాలు ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. అనంతరం, 'శాప్' జాబితా ఆధారంగా క్రీడా కోటా ఫలితాలు కూడా ఇవ్వనుంది. ఈ నెలాఖరు నాటికి లేదా సెప్టెంబరు మొదటి వారంలో కొత్త టీచర్లకు పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు.

డాక్యుమెంట్లే ముఖ్యం!

» కంపెనీలపై ఆరోపణలను పరిగణనలోకి తీసుకోలేం

» శానిటేషన్ టెండర్లపై ఆరోగ్య కమిషనర్ వివరణ

అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): శానిటేషన్ కంపెనీలపై వచ్చిన ఆరోపణలను పరిగణనలోకి తీసుకోమని, కేవలం టెండర్ బిడ్లలో దాఖలు చేసిన డాక్యుమెంట్లను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని ఆరోగ్యశాఖ కమిషనర్, ఏపీఎంఎస్ఐడీసీ ఇన్‌చార్జి ఎండీ వీరపాండియన్ స్పష్టం చేశారు. శానిటేషన్ టెండర్లపై భారీగా ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. డీఎంఈ, సెకండరీ హెల్త్ పరిధిలో ఉన్న 133 ఆస్పత్రుల్లో శానిటేషన్ పనులు చేసేందుకు టెండర్లు ఆహ్వానించామన్నారు. మొత్తం 6 ప్యాకేజీలకు టెండర్లు పిలవగా డీఎంఈకి 5 కంపెనీలు, సెకండరీ హెల్త్‌కు 5 కంపెనీలు అర్హత సాధించాయని తెలిపారు. టెండర్ నిబంధనలకు లోబడే బిడ్లను పరిశీలించి, కంపెనీలకు అర్హత కల్పించామని తెలిపారు. 2021లో టెండర్లు దక్కించుకున్న కంపెనీలే అర్హత సాధించాయని.. ప్రస్తుతం పనులు నిర్వహిస్తున్న కంపెనీలపై అనేక ఆరోపణలున్నాయని విలేకరులు ప్రస్తావించగా.. ప్రభుత్వం బ్లాక్‌లిస్ట్ చేసిన కంపెనీలే టెండర్లల్లో పాల్గొన్నాయన్న విషయం తమకు తెలియదన్నారు. కొన్ని కంపెనీలు కోర్టుల నుంచి స్టే తెచ్చుకున్నట్లు తెలిపారు. కొన్ని కంపెనీలు శానిటేషన్ వర్కర్లకు, సూపర్‌వైజర్లకు సక్రమంగా జీతాలు చెల్లించడం లేదని, దీనిపై కలెక్టర్లు ఫిర్యాదు చేశారని, అవే కంపెనీలకు టెండర్లు కట్టబెడితే వర్కర్ల జీతాలు, ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించే విషయంలో ఎవరు బాధ్యత తీసుకుంటారని ప్రశ్నించగా.. అప్పటి పరిస్థితి ఆధారంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పొరుగురాష్ట్రంలో టెర్మినేట్ అయిన, ఏపీలో సక్రంగా సేవలు అందించని సంస్థల బిడ్లను పరిగణనలోకి తీసుకోవడంపై స్పందిస్తూ.. టెండర్లు దక్కించుకున్న తర్వాత సేవలు సరిగా అందించలేరన్న ఆరోపణలపై ఏమీ చేయలేమని చెప్పారు. ఇప్పటి వరకూ కొన్ని కంపెనీలు ఇచ్చిన వివరణలు, ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని.. మరోసారి చెక్ చేసుకున్నామన్నారు. శానిటేషన్ టెండర్లలో పోటీ పెంచడానికే తొలుత టెండర్లు రద్దు చేశామని, సెక్యూరిటీ టెండర్లలో ఆ అవసరం రాలేదని ఆయన సమర్థించుకున్నారు.

---

57 వేల మందికి ఓ బార్

రాష్ట్రంలో 5 కోట్ల జనాభాకు 890 బార్లు

నేడు క్యాబినెట్ ముందుకు కొత్త బార్ పాలసీ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ప్రస్తుతం 56,847 మంది ప్రజలకు ఒక బార్ ఉంది. రాష్ట్ర జనాభా 5 కోట్లకు పైగా ఉంటే 890 బార్లు ఉన్నాయి. వాటిలో సాధారణ బార్లు 840, స్టార్ హోటళ్లలో బార్లు 41, మైక్రో బ్రూవరీలు 9ఉన్నాయి. కొత్త బార్ పాలసీని ప్రవేశపెడుతున్న నేపథ్యంలో దేశంలోని ఏడు రాష్ట్రాల్లోని బార్ పాలసీలతో ఏపీ ప్రస్తుత బార్ పాలసీని ఎక్సైజ్ శాఖ పోల్చింది. ఈ వివరాలను సోమవారం సీఎం వద్ద జరిగిన సమీక్షలో అధికారులు వెల్లడించారు. ఆ వివరాల ప్రకారం.. తెలంగాణలో ప్రతి 30,145 మందికి ఒక బార్ ఉంది. కర్ణాటకలో 16,469 మందికి, తమిళనాడులో 87,713 మందికి, కేరళలో 45,528 మందికి, రాజస్థాన్‌లో 57,530 మందికి, ఉత్తరప్రదేశ్‌లో 2,41,596 మందికి, మహారాష్ట్రలో 6 వేల మందికి ఒకటి చొప్పున బార్లు ఉన్నాయి. తెలంగాణలో 1,238, కర్ణాటకలో 3,710, తమిళనాడులో 822, కేరళలో 738, రాజస్థాన్‌లో 1,182, యూపీలో 827, మహారాష్ట్రలో 21వేల బార్లు ఉన్నాయి. ఏపీలో 2022లో పాలసీ ప్రవేశపెట్టినప్పుడు 3 కేటగిరీల్లో కనీస ఫీజు రూ.15 లక్షలు, గరిష్ఠ ఫీజు రూ.50 లక్షలుగా ఖరారు చేశారు. ఇప్పుడు గరిష్ఠ ఫీజు కార్పొరేషన్లలో రూ.60లక్షలు దాటింది. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుతో పోలిస్తే ఏపీలోనే లైసెన్స్ ఫీజులు ఎక్కువగా ఉన్నాయి. కాగా కొత్త బార్ పాలసీలో ఫీజులను రూ.35 లక్షలు, రూ.55 లక్షలు, రూ.75 లక్షలుగా ఖరారు చేశారు. గత పాలసీలో దరఖాస్తు రుసుం 3కేటగిరీల్లో రూ.5లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు ఉండగా, ఇప్పుడు అందరికీ రూ.5లక్షలుగా ఖరారుచేశారు. కచ్చితంగా ప్రతి బార్‌కు 4 దరఖాస్తులు వస్తేనే లాటరీ నిర్వహిస్తామనే నిబంధన పెట్టాలని నిర్ణయించడం ప్రతికూలంగా మారనుందనే వాదన వినిపిస్తోంది. ఏదైనా బార్‌కు నాలుగు దరఖాస్తులు రాకపోతే అది దక్కించుకోవాలనుకున్న వ్యాపారి మిగిలిన 3 దరఖాస్తులు సమర్పించాలి. ఇది ఆ వ్యాపారికి ఆర్థిక భారం అవుతుందని చెబుతున్నారు. అలాగే మద్యం షాపుల తరహాలోనే గీత కులాలకు 10% బార్లు కేటాయించారు. వారికి 50 శాతం లైసెన్స్ ఫీజులతోనే బార్లు కేటాయిస్తారు. దీనిపై సాధారణ బార్ల వ్యాపారుల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రభుత్వం నుంచి మద్యం కొనుగోలు చేసే సమయంలో షాపులతో పోలిస్తే బార్లు 10% అదనంగా చెల్లించాల్సి వస్తోంది. తొలుత దీనిని తొలగించాలనుకున్న ప్రభుత్వం ఆర్థిక శాఖ అంగీకరించకపోవడంతో అదే విధానం కొనసాగించాలని నిర్ణయించింది. ఈ నిబంధనలతోనే బుధవారం జరిగే క్యాబినెట్ సమావేశంలో కొత్త బార్ పాలసీ ప్రతిపాదన పెట్టనున్నారు. క్యాబినెట్ ఆమోదం అనంతరం గురువారం కొత్త పాలసీపై మార్గదర్శకాలు జారీచేసేందుకు ఎక్సైజ్ శాఖ సన్నద్ధమైంది.

నేడు క్యాబినెట్ భేటీ

రాష్ట్ర మంత్రి మండలి సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు జరగనుంది. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపై విధివిధానాలను చర్చించి ఆమోదం తెలపనున్నారు. మహిళల ఉచిత ప్రయాణానికి అధికారికంగా పేరుకూడా ఖరారు చేయనున్నారు. భవన క్రమబద్ధీకరణ స్కీంపైనా చర్చించే అవకాశం ఉంది. గత క్యాబినెట్‌లో దీనిపై చర్చ జరిగినా నిర్ణయం తీసుకోలేదు. సీఎం బృందం సింగపూర్ టూర్‌పైన, లిక్కర్ స్కాంలో తాజా పరిణామాలపైనా మంత్రి వర్గ సహచరులతో సీఎం చర్చించే అవకాశం ఉంది.

---

3 ఎంపీటీసీ, 2 సర్పంచి స్థానాలు

ఏకగ్రీవం

అన్నీ టీడీపీ బలపరిచిన వారికే

జగన్ ఇలాకాలో 'ఉప' పోరు షురూ

పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీలకు 12న పోలింగ్

అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్‌రెడ్డి ఇలాకాలోని పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నిక అనివార్యమైంది. ఈ రెండు స్థానాలకు 12న పోలింగ్ జరగనుంది. ఈ స్థానాలను 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ సొంతం చేసుకుంది. పులివెందుల జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఒంటిమిట్ట నుంచి జెడ్పీటీసీగా గెలిచిన ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి కడప జడ్పీ చైర్మన్‌గా ఎన్నికై, 2024లో జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. జెడ్పీ చైర్మన్, జెడ్పీటీసీ పదవులకు రాజీనామా చేశారు. దీంతో ఈ రెండు స్థానాలకు ఉప ఎన్నికల అనివార్యమయ్యాయి. పులివెందుల స్థానం నుంచి మహేశ్వరరెడ్డి తనయుడు హేమంత్ కుమార్ వైసీపీ బలపర్చిన అభ్యర్థిగా బరిలో ఉండగా, టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి సతీమణి మారెడ్డి లతా రెడ్డి పోటీలో ఉన్నారు. దీంతో పులివెందుల ఎన్నికపై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానానికి వైసీపీ బలపర్చిన అభ్యర్థిగా ఇరగం సుబారెడ్డి, టీడీపీ బలపర్చిన అభ్యర్థిగా ఎ.ముద్దుకృష్ణా రెడ్డి పోటీపడుతున్నారు. ఇక, చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలోని ముణేంద్రం, పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం వేపకారిపల్లి, నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గం విడవలూరు-1 ఎంపీటీసీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగ్గా టీడీపీ బలపర్చిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొండెపి, కడియపులంక సర్పంచి స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లోనూ టీడీపీ బలపర్చిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



హజ్ యాత్ర దిగ్విజయంగా ముగిసినందున సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్న ముస్లిం పెద్దలు

హజ్ హౌస్‌కు స్థలం కేటాయించండి

» సీఎంకు రాష్ట్ర హజ్ కమిటీ వినతి

అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విజయవాడ, లేదా గుంటూరు పరిసర ప్రాంతాల్లో జాతీయ రహదారి వెంట 5 నుంచి 6ఎకరాల స్థలాన్ని శాశ్వత హజ్ హౌస్ నిర్మాణానికి సీఆర్‌డీఏ ద్వారా కేటాయించాలని సీఎం చంద్రబాబుకు రాష్ట్ర హజ్ కమిటీ విజ్ఞప్తి చేసింది. మంగళవారం అమరావతి సచివాలయంలో సీఎంను కలిసి పలు అంశాలపై వినతిపత్రం అందజేసినట్టు రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హసన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. హజ్ యాత్ర-2026 కోసం విజయవాడలో ఎంబార్కేషన్ పాయింట్ కేటాయించినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపినట్టు వెల్లడించారు.

హజ్ యాత్రికులకు రూ.72 లక్షలు మంజూరు

» విజయవాడ ఎంబార్కేషన్ ఎంచుకున్నవారికి లబ్ధి: మంత్రి ఫరూక్

అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): హజ్-2025 యాత్రలో మొదట విజయవాడ ఎంబార్కేషన్ ఎంచుకుని, తగినంతమంది లేక విమాన సర్వీసు రద్దు కావడంతో హైదరాబాద్ నుంచి హజ్‌యాత్ర పూర్తి చేసుకున్నవారికి కూటమి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. వారికి రూ.లక్ష చొప్పున ఆర్థికసాయం అందిస్తామని ప్రభుత్వం గతేడాది ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ మేరకు విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం ఎంచుకున్న 72మందికి మొత్తం రూ.72 లక్షలను మంగళవారం మంజూరు చేసింది. 2026లో హజ్ యాత్రకు వెళ్లే వారికి కూడా విజయవాడ ఎంబార్కేషన్ ఉంచుకుంటే రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తామని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. ఈ నెల 7లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. కాగా, మంగళవారం అమరావతి సచివాలయంలో మైనార్టీ సంక్షేమశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఆ శాఖకు అనుబంధంగా ఉన్న వివిధ ఆస్తుల జాబితాను సిద్ధం చేసేందుకు కార్యాచరణ ప్రారంభించాలని ఆదేశించారు.

మహిళల రక్షణ చట్టాలు పటిష్ఠం చేస్తాం: అనిత

అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళల రక్షణ చట్టాలు మరింత పటిష్ఠం చేస్తామని హోంమంత్రి అనిత అన్నారు. సోషల్ మీడియా వేదికగా మహిళల్ని కించపరుస్తున్న ఉదంతాలపై ఐటీ యాక్ట్ 66ఏ పై చర్చించి, నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. మంగళవారం అమరావతి సచివాలయం రెండో బ్లాక్‌లో వాసవీ మహిళా మండలి, పలు రాజకీయ పార్టీల మహిళా విభాగాల ప్రతినిధులు హోంమంత్రిని కలిశారు. మహిళలు, బాలికల భద్రత, విద్య, ఆరోగ్యం తదితర అంశాలపై చర్చించారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై హోంమంత్రి స్పందిస్తూ మహిళలకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని, వారి అభ్యున్నతికి కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దారుణాలకు వ్యతిరేకంగా మహిళా సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు చేసిన సూచనలను సీఎం దృష్టికి తీసుకెళ్తా. అవసరమైతే అసెంబ్లీలోనూ చర్చిస్తాం' అని అనిత చెప్పారు.



హోంమంత్రి అనితకు వినతిపత్రం అందజేస్తున్న మహిళా సంఘాల ప్రతినిధులు

ప్రాణం తీసిన పెన్సిల్!

» ఇద్దరు చిన్నారుల మధ్య బడిలో గొడవ

» ఓ విద్యార్థి తల్లిదండ్రులపై మరొకరి దాడి

» తీవ్ర గాయాలతో విద్యార్థి తండ్రి మృతి

» అనంతపురం జిల్లాలో విషాద ఘటన

శెట్టూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పెన్సిల్ కోసం ఇద్దరు చిన్నారులు బడిలో గొడవపడ్డారు. అది ఇళ్ల వరకూ వెళ్లి.. తల్లిదండ్రులు ఘర్షణ పడ్డారు. ఈ గొడవలో తీవ్రంగా గాయపడిన ఓ విద్యార్థి తండ్రి ప్రాణాలు కోల్పోయాడు. అనంతపురం జిల్లా శెట్టూరు మండల కేంద్రంలో ఈ దారుణం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు, శెట్టూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గగన్, క్రిష్ అనే ఇద్దరు విద్యార్థులు మూడో తరగతి చదువుతున్నారు. గగన్ పెన్సిల్‌ను సోమవారం మధ్యాహ్నం క్రిష్ విరిచేశాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. పాఠశాల విరామ సమయంలో ఒకరిపై ఒకరు మట్టి విసురుకున్నారు. బడి వదిలాక సాయంత్రం ఇంటికి వెళ్లి గొడవపడిన విషయాన్ని తెలియజేశారు. తమ కొడుకును కొట్టారని క్రిష్ తల్లిదండ్రులు మర్రియమ్మ, మర్రిస్వామి ఆగ్రహించారు. శెట్టూరు మండలం యర్రబోరేపల్లికి చెందిన తమ బంధువులకు సమాచారం ఇచ్చి పిలిపించుకున్నారు. వారు రాగానే గగన్ ఇంటి వద్దకు వెళ్లి.. తల్లిదండ్రులు ప్రకాశ్, ప్రమీలమ్మపై దాడి చేశారు. ప్రకాశ్(37)కు తీవ్ర గాయాలు కావడంతో అపస్మారక స్థితిలో పడిపోయాడు. కాలనీ వాసులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. ప్రకాశ్ దంపతులకు నలుగురు సంతానం. దాడికి పాల్పడిన యర్రబోరేపల్లికి చెందిన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ గొడవ శెట్టూరు పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో జరిగింది. గొడవ జరుగుతోందని పోలీసులకు సమాచారం అందించినా స్పందించలేదని, అందుకే నిండు ప్రాణం బలైందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుడి భార్య ప్రమీలమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఈ విషయమై శెట్టూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలాజీని వివరణ కోరగా, పాఠశాల ఆవరణలో విద్యార్థులు గొడవ పడలేదని, మరో చోట గొడవపడ్డారని తెలిపారు.



ప్రకాశ్







దేదీప్యమానంగా వెలిగిపోతున్న ఈ ప్రాంతం రాజధాని అమరావతి. వైసీపీ ప్రభుత్వం పాడుబెట్టిన ఈ ప్రాంతం కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్త కళ సంతరించుకుంటోంది. ఇందుకు నిదర్శనమే ఈ చిత్రాలు. రాజధానిలో ప్రజాప్రతినిధులు, ఐఏఎస్‌లు, అధికారులు, ఉద్యోగుల గృహ సముదాయలతో పాటు ఇతర కార్యాలయాల నిర్మాణ పనులు వేగమందుకున్నాయి. ఇక, రాజధాని నీటి అవసరాలు తీర్చేలా శాఖమూరులో నిర్మించనున్న భారీ రిజర్వాయరు పనులు కూడా వేగంగా సాగుతున్నాయి. ఈ రిజర్వాయరు పనులను, కొండవీటి వాగు, గ్రావిటీ కెనాల్, అనంతవరం పార్కు పనులను మంత్రి నారాయణ మంగళవారం పరిశీలించారు.

మూడేళ్లలో అమరావతి

- ఎవరెన్ని కుట్రలు చేసినా పూర్తి చేస్తాం
- పనులు శరవేగంగా సాగుతున్నాయ్
- అనుమానం ఉంటే క్షేత్రస్థాయికి రండి
- వచ్చే మార్చి కి అధికారులు, ఉద్యోగుల క్వార్టర్లు రోడ్లు, డ్రైనేజీలు పూర్తికావొచ్చాయి: నారాయణ

తుళ్లూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): 'అమరావతిలో పనులు జరగడం లేదని కొంతమంది ఆరోపిస్తున్నారు. రాజధాని నిర్మాణానికి అడ్డంకులు కల్పిస్తున్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా మూడేళ్లలో రాజధాని నిర్మాణం పూర్తి చేస్తాం' అని మంత్రి నారాయణ చెప్పారు. అమరావతి రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. మంగళవారం రాజధాని నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. శాఖమూరు రిజర్వాయర్, కొండవీటి వాగు, గ్రావిటీ కెనాల్‌తోపాటు అనంతవరం పార్కును మంత్రి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అమరావతిలో పనులు జరగడం లేదని ఆరోపిస్తున్నవారు క్షేత్రస్థాయికి వచ్చి చూడాలన్నారు. 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో ఉన్న టెండర్లు క్లోజ్ చేయడంతోపాటు ఇతర ఆర్థిక అంశాలను కొలిక్కితెచ్చాం. పాత నిర్మాణాలపై ఐఐటీ నిపుణులతో అధ్యయనం చేయించాం. ప్రస్తుతం రాజధానిలో అన్ని పనులూ ప్రారంభమయ్యాయి. వచ్చే మార్చి నెలాఖరుకు అధికారులు, ఉద్యోగులకు సంబంధించిన 4 వేల ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తాం. రోడ్లు, డ్రైనేజీ పనులు దాదాపు పూర్తికావచ్చాయి. లేఅవుట్ రోడ్ల డిజైన్లను ఐఐటీ నిపుణులు ఈ నెలాఖరుకు ఫైనల్ చేస్తారు. రాజధానిలో వరద ముంపు నివారణ కోసం కాలువల డిజైన్లను నెదర్లాండ్స్ అధికారులతో చేయించాం. రాజధానిలో కొండవీటి వాగు 23.6 కిలోమీటర్లు, పాలవాగు 16.5 కిలోమీటర్లు, గ్రావిటీ కెనాల్‌ను 7.843 కిలోమీటర్లు తవ్వుతున్నాం. వీటితోపాటు శాఖమూరు, కృష్ణాయపాలెం, నీరుకొండ రిజర్వాయర్లు నిర్మిస్తున్నాం. వర్షాల కారణంగా కాలువ పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. ఆయా పనులు 2027 అక్టోబరులోగా పూర్తి చేయాలనుకున్నా.. ఏడాది చివరకు పూర్తయ్యేలా ఉన్నాయి' అని మంత్రి నారాయణ చెప్పారు.

900 మంది రైతుల కౌలు పెండింగ్

రాజధానిలో సుమారు 25 వేల మందికి ఈ ఏడాది కౌలు నిధులు జమ చేయాల్సి ఉండగా, నిన్నటి వరకూ రకరకాల కారణాలతో ఏడు వేల మందికి జమ కాలేదన్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న నిధులు కూడా అకౌంట్లలో జమ అయ్యాయని, ఇంకా 900 మందికి పెండింగ్ ఉన్నాయని మంత్రి చెప్పారు. కౌలు సొమ్ము జమ కాని రైతులు వెబ్‌సైట్లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ పర్యటనలో అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ లక్ష్మీ పార్థసారథి, సీఆర్డీఏ ఇంజినీర్ ఇన్ చీఫ్ గోపాలకృష్ణారెడ్డి, సీఈ ధనుంజయ్, ఇంజనీర్లు, కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

చంద్రబాబుపై సింగపూర్‌కు నమ్మకం ఉంది

'సీఎం చంద్రబాబుపై సింగపూర్ ప్రభుత్వానికి ఎంతో నమ్మకం ఉంది. గత ప్రభుత్వం సింగపూర్‌కు సీఐడీ అధికారులను పంపి, వారిపై విచారణ చేయించింది. ఆ ప్రభుత్వం ఎంతో బాధపడింది. దీనివల్ల సింగపూర్-ఏపీ మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఆ సంబంధాలను తిరిగి పునరుద్ధరించేందుకే సీఎం చంద్రబాబు సింగపూర్ వెళ్లారు. అక్కడ సింగపూర్ ప్రెసిడెంట్, సీనియర్ మంత్రులను కలిశారు. అన్నివిధాలా సహకరిస్తామని వారు చెప్పారు. సీఆర్డీఏకు సహకరిస్తామని సింగపూర్ నేషనల్ పార్క్స్ అథారిటీ చెప్పింది. పది రోజుల్లో ఆ అథారిటీ సభ్యులు అమరావతి వస్తున్నారు' అని మంత్రి నారాయణ తెలిపారు.

ఓఆర్ఆర్ గేమ్ చేంజర్

- రాజధానికి ఇచ్చే రూ.15 వేల కోట్ల రుణాన్ని కేంద్రమే తిరిగి చెల్లిస్తుంది
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



గుంటూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానికి అవుటర్ రింగురోడ్డు (ఓఆర్ఆర్) గేమ్ చేంజర్ అవుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ చెప్పారు. ఈ ప్రాజెక్టుతో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు రాజధానితో అనుసంధానం ఏర్పడుతుందన్నారు. దీనికయ్యే ఖర్చంతా కేంద్ర ప్రభుత్వమే భరిస్తోందని తెలిపారు. అమరావతి-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవేని కూడా కేంద్రమే నిర్మిస్తోందన్నారు. వీటివల్ల రాజధానిని మరో ప్రాంతంలో ఏర్పాటు చేయాలన్న ఆలోచన కూడా ఎవరూ చేయలేరన్నారు. గుంటూరులో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'గత వైసీపీ ప్రభుత్వ దుర్మార్గపు ఆలోచనలతో రాష్ట్రం ఐదేళ్ల విలువైన సమయాన్ని కోల్పోయింది. విశాఖపట్టణంలో రాజధాని అంటే ఎవరికీ ఇష్టం లేదు. 2019 ఎన్నికల ముందు వరకు అమరావతికి జై కొట్టిన జగన్ ఆతర్వాత మాట మార్చారు. ఉద్యమ సమయంలో అమరావతి రైతులకు అన్నివిధాలా సాయం అందించాం. భూములు ఇచ్చిన రైతులకు అభివృద్ధి చేసిన లేఅవుట్లలో ప్లాట్లు ఇవ్వాలి. ఎల్‌పీఎస్ దేశానికి రోల్ మోడల్ కావాలంటే ముందు రైతులకు ప్లాట్లు ఇవ్వాలి. ఎన్డీఏ-3 అధికారంలోకి వచ్చిన వెంటనే రాజధానికి రూ.15 వేల కోట్లు ఇచ్చాం. ఈ నిధులను వరల్డ్ బ్యాంకు, జైకా, ఐఎంఎఫ్ సమకూరుస్తున్నా.. వాటి రీపేమెంట్ కేంద్రమే చేస్తుంది. కొండవీటి వాగు, పాలవాగు విషయంలో ఆయా సంస్థలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. వాటిని ఒప్పించి ప్రధాని మోదీ రుణం మంజూరు చేయించారు. విభజన చట్టంలో రాష్ట్రానికి మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వ సంస్థలన్నింటినీ సాధ్యమైనంత త్వరగా తీసుకొస్తాం. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి ఏమి పూర్తి చేయగలుగుతామో అంచనా వేసి వాటిని పూర్తి చేయడంపై దృష్టి పెట్టాలని ప్రధాని సీఎంకు సూచించారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ రూ.వేల కోట్ల విలువ చేసే జాతీయ రహదారుల నిర్మాణానికి మూడు రోజుల కిందటే శంకుస్థాపన చేశారు. ఇవి కాకుండా మరికొన్ని ప్రాజెక్టులు మంజూరు చేశారు. డబుల్ ఇంజిన్ సర్కార్ ఉంటే అభివృద్ధి ఎలా పరుగులు పెడుతుందనే దానికి చక్కటి ఉదాహరణే ఏపీ' అని మాధవ్ చెప్పారు.

మార్గదర్శుల ఎంపిక స్వచ్ఛందమే

(మొదటి పేజీ తరువాయి)

చిన్న ఆసరా పేదలకు కొండంత అండ అవుతుందన్నారు. ఈ స్ఫూర్తితోనే అవనిగడ్డ నియోజకవర్గానికి చెందిన పారిశుధ్య కార్మికురాలు పల్లెకుంట హేమలత మార్గదర్శిగా మారి ఓ వృద్ధురాలిని ఆదుకుంటున్నారని ప్రశంసించారు. స్పందించే మనసుంటే పేదల్ని ఆదుకునేందుకు మానవత్వం చూపుతూ ముందుకొస్తారని, డబ్బుతో పాటు సాయం చేసేవారు కూడా మార్గదర్శులేనని తెలిపారు. బంగారు కుటుంబాలకు కావాల్సింది భావోద్వేగంతో కూడిన అనుబంధం, చేయూత మాత్రమేనన్నారు. సీఎస్ఆర్ నిధులతో బిల్ గేట్స్, వేదాంత లాంటి సంస్థలు పనిచేస్తున్నాయని, వీటికి మించి కుటుంబాలను ఆదుకోవడమే లక్ష్యంగా పీ-4 చేపట్టామన్నారు. ప్రజలే ఆస్తిగా జీరో పావర్టీ మిషన్ అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. "మంచి కార్యక్రమాలను అడ్డుకునేందుకు కొందరు రాక్షసుల తరహాలో వ్యవహరిస్తారు. ప్రజల్లో దీనిపై వ్యతిరేకత తెచ్చేందుకు ప్రయత్నిస్తారు. గతంలో జన్మభూమి, శ్రమదానం, నీరు-మీరు... ఇలా ఏ కార్యక్రమం చేపట్టినా ఇదేవిధంగా విమర్శించారు. ఇలాంటివి పట్టించుకోను. కొందరికి ఆర్థిక వనరులున్నా పేదలను ఆదుకోవడానికి మనసు రాదు. కొందరికి మనసున్నా సమయం ఉండకపోవచ్చు. ఇలాంటి వారిని గుర్తించాలి. పీ-4 వేదిక ఉందని చెప్పాలి. ఆర్థిక అసమానతలు మరింత తగ్గాలి. ఈ రోజు బంగారు కుటుంబంలో సాయం పొందిన వారే... రేపు మార్గదర్శి కావచ్చు. సంక్షేమ పథకాలతో పాటు బంగారు కుటుంబాలకు పీ-4 ద్వారా అదనపు సాయం అందుతుంది. విదేశాల్లో ఉన్న ఎన్ఆర్ఐలు, పారిశ్రామికవేత్తలను కలిసి వారిలో ఆలోచనను రేకెత్తించాలి" అని చంద్రబాబు సూచించారు.

1,03,938 మంది మార్గదర్శుల గుర్తింపు

"మార్గదర్శుల స్ఫూర్తే బంగారు కుటుంబాలకు ఆసరా. ఇప్పటి వరకు 9,37,913 బంగారు కుటుంబాల ఎంపిక పూర్తయింది. 1,03,938 మంది మార్గదర్శులను గుర్తించాం. రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల కుటుంబాలకు ఉన్న అవసరాలను ప్రాధాన్య క్రమంలో గుర్తించాం. 11 ప్రశ్నలతో వివరాలు నమోదు చేసి ఏఐతో విశ్లేషించాం. ఉద్యోగావకాశాలు కల్పించాలని 31 శాతం మంది, వైద్య చికిత్సలకు సంబంధించి 22 శాతం మంది, తమ చిన్న చిన్న వ్యాపారాలను మరింత పెంచుకోవడానికి అవకాశాలు కల్పించాలని 9 శాతం మంది కోరారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడటంతో పాటు గ్రామాలు, మండలాల వారీగా దత్తత తీసుకునేందుకు ముందుకొస్తున్నారు. అలాగే 'ఫండ్ ఏ నీడ్' అనే అంశాన్ని కూడా పీ-4లో పెట్టాం. ఈ కార్యక్రమం అమలును 3నెలలకోసారి సమీక్షించుకుంటాం. ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా ఈ కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొనవచ్చు. నేను కూడా మార్గదర్శిగా పేరు నమోదు చేయించుకుని 250 కుటుంబాలను దత్తత తీసుకున్నా. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు అమలు చేస్తున్నాం' అని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ నెల 19 నుంచి పీ-4 అమలుకునిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమీక్షకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, సీఎస్ విజయానంద్, పీ-4 ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు కుటుంబరావు, ఆర్థిక, ప్రణాళిక శాఖ అధికారులు హాజరయ్యారు.

100 కుటుంబాల దత్తత: జీవీ, బొలిశెట్టి

సీఎం చంద్రబాబు స్ఫూర్తితో బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు ఇద్దరు ప్రజాప్రతినిధులు ముందుకొచ్చారు. వినుకొండలోని ఎస్టీ వర్గాలకు చెందిన 100 కుటుంబాలను దత్తత తీసుకుంటానని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు సీఎంకు తెలిపారు. అలాగే తాడేపల్లిగూడెం జనసేన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ కూడా తన నియోజకవర్గంలో వంద పేద కుటుంబాలను దత్తత తీసుకుంటామని పీ-4పై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రకటించారు. కాగా, పీ-4 కార్యక్రమం స్ఫూర్తితో పాఠశాలలు, ట్రిపుల్ ఐటీల్లో చదివే పేద విద్యార్థులకు ఆర్థిక సహకారం అందించేలా కార్యక్రమాలు చేపడుతున్నట్లు మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. బడుగు వర్గాల్లోని ప్రతిభావంతులకు ఆర్థిక సాయం అందిస్తానని తెలిపారు. పీ4 కార్యక్రమంలో భాగస్వాములు కావడానికి ముందుకొచ్చిన వారిని సీఎం అభినందించారు. మరింత మంది ప్రజాప్రతినిధులు, అధికారులు, పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

వివేకా హత్య కేసులో దర్యాప్తు పూర్తయింది!

- సుప్రీంకోర్టు ఆదేశిస్తే తదుపరి విచారణ: సీబీఐ

న్యూఢిల్లీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో దర్యాప్తు పూర్తయిందని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) సుప్రీంకోర్టుకు తెలిపింది. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశిస్తే తదుపరి విచారణ చేపడతామని స్పష్టం చేసింది. ఈ హత్య కేసులో నిందితులైన వైసీపీ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, డి.శివశంకర్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి, గంగిరెడ్డి తదితరుల బెయిల్ రద్దు చేయాలని కోరుతూ వివేకా కుమార్తె నర్రెడ్డి సునీతారెడ్డి, సీబీఐ దాఖలు చేసిన అన్ని పిటిషన్లనూ కలిపి సుప్రీంకోర్టు విచారిస్తోంది. గత విచారణ సందర్భంగా సీబీఐకి మూడు ప్రశ్నలు సంధించింది. ఈ కేసులో ఇంకా తదుపరి దర్యాప్తు అవసరమని దర్యాప్తు సంస్థ భావిస్తోందా.. రాష్ట్రప్రభుత్వం కడప కోర్టులో దాఖలు చేసిన క్లోజర్ రిపోర్టుపై దాని అభిప్రాయమేంటి.. కేసు ట్రయల్, తదుపరి దర్యాప్తు ఏక కాలంలో కొనసాగించే అవకాశం ఉందా.. అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాలని, దానిని బట్టి తదుపరి నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది. ఈ క్రమంలో ఆయా పిటిషన్లు మంగళవారం మరోసారి జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ ఎన్. కోటీశ్వర్‌సింగ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చాయి. వివేకా హత్య కేసుకు సంబంధించి దర్యాప్తు పూర్తయిందని సీబీఐ తెలిపింది. పిటిషనర్ సునీతారెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా మరో కోర్టులో ఉన్నారని, సమయం ఇవ్వాలని ఆమె తరఫున మరో న్యాయవాది విజ్ఞప్తి చేశారు. అనంతరం.. వాదనలు వినిపించేందుకు సిద్ధంగా ఉన్నామని లూథ్రా తెలిపారు. అయితే మధ్యాహ్నం తర్వాత తమ బెంచ్ విచారణ చేపట్టదని.. అందుచేత మరో రోజు వాదనలు వింటామని ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేసింది.

తురకా కిశోర్ కేసు డైరీని మా ముందు ఉంచండి

- రెంటచింతల పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత తురకా కిశోర్‌పై పల్నాడు జిల్లా రెంటచింతల పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించిన డైరీతో సహా మొత్తం రికార్డులను తమ ముందు ఉంచాలని హైకోర్టు ధర్మాసనం ఆదేశించింది. విచారణను బుధవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు జస్టిస్ ఆర్. రఘునందనరావు, జస్టిస్ టీసీడీ శేఖర్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు జిల్లా జైలు నుంచి విడుదలైన తన భర్త తురకా కిశోర్‌ను పల్నాడు జిల్లా, రెంటచింతల పోలీసులు అక్రమంగా నిర్బంధించారని, కోర్టు ముందు హాజరుపరిచేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ సురేఖ సోమవారం హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం మంగళవారం మరోసారి విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది రామలక్ష్మణరెడ్డి, పోలీసుల తరఫున ప్రభుత్వ సహాయ న్యాయవాది వాదనలు వినిపించారు.

లిక్కర్ కేసు నిందితులకు వైద్య పరీక్షలు

- ప్రభుత్వ ఆస్పత్రికి శ్రీధర్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి

విజయవాడ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): లిక్కర్ కేసులో నిందితులు సజ్జల శ్రీధర్‌రెడ్డి, పి.కృష్ణమోహన్‌రెడ్డిలను జైలు అధికారులు మంగళవారం ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. వారికి వేర్వేరు విభాగాల్లో వైద్య పరీక్షలు నిర్వహించారు. పంటి నొప్పితో బాధపడుతున్న శ్రీధర్‌రెడ్డికి దంత వైద్య కళాశాలలో పరీక్షలు నిర్వహించి చికిత్స చేశారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిపడుతున్న కృష్ణమోహనరెడ్డికి జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు అనంతరం వీరిద్దరిని అధికారులు తిరిగి జైలుకు తీసుకెళ్లారు.

ఐఓ, బ్యాంకు మేనేజర్ కోర్టు ఆదేశాలు పాటించడం లేదు

- ఏసీబీ కోర్టులో రాజ్ కసిరెడ్డి పిటిషన్

విజయవాడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సిట్ అధికారులు ఫాం హౌస్ నుంచి స్వాధీనం చేసుకున్న రూ. 11 కోట్లకు సంబంధించి కోర్టు ఆదేశాలను సిట్ దర్యాప్తు అధికారి (ఐఓ), బ్యాంక్ మేనేజర్ పాటించడం లేదని లిక్కర్ కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డి తరఫున న్యాయవాదులు ఏసీబీ కోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. రూ. 11 కోట్లను బ్యాంకులో జమచేసిన సమయం, కౌంటర్ ఫాయిల్, సీసీ ఫుటేజీ వివరాలను అందజేయాలని ఐఓను.. అలాగే నగదుకు సంబంధించిన లెడ్జర్, చెస్ట్‌కు పంపిన సీసీ కెమెరా ఫుటేజీ, చెస్ట్‌లో నగదును లెక్కించిన ఫుటేజీని ఇవ్వాలని బ్యాంకును కోర్టు ఆదేశించినా ఇప్పటి వరకు సమర్పించలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు.

ఇకపై భూ అభివృద్ధి ఫీజు!

- నేడు క్యాబినెట్ సమావేశంలో చర్చించి, నిర్ణయం



ఉపసంఘం సమావేశంలో మంత్రులు నారాయణ, కేశవ్, అనగాని, ఆనం, ఫరూక్

అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూమిని సాగేతర అవసరాలకు మళ్లించినందుకు వసూలు చేసే నాలా ఫీజు ఇకపై ఉండదు. దానిస్థానంలో భూ వినియోగ మార్పిడి చేసినందుకు అభివృద్ధి (డెవలప్‌మెంట్ చార్జీ) ఫీజు వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ భూమి (సాగేతర అవసరాలకు మళ్లించడం-ల్యాండ్ కన్వర్షన్-నాలా) చట్టం-2006ను రద్దు చేస్తూ ఆర్డినెన్స్‌ను రూపొందించింది. బుధవారం జరిగే మంత్రివర్గ సమావేశంలో దీనిపై చర్చించి, ఏకాభిప్రాయం కుదిరితే ఆమోదించనున్నారు. తర్వాత గవర్నర్ ఆమోదం తీసుకొని ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వనుంది. ఇప్పటివరకూ నాలా చట్టం ప్రకారం భూ వినియోగ మార్పిడికి ప్రాంతాన్ని బట్టి భూమి విలువ ఆధారంగా 1-2 శాతం మేర ఫీజు వసూలు చేసేవారు. ఈ చట్టం రద్దయిన తర్వాత భూ వినియోగ మార్పిడి కోరేవారు ప్రభుత్వానికి అభివృద్ధి ఫీజు (డెవలప్‌మెంట్ చార్జీ) చెల్లించాలి. ఈ ఫీజు ఎంతో ఆర్డినెన్స్‌లో పొందుపరచలేదు. భూమి విలువలో డెవలప్‌మెంట్ చార్జీ కనీసం 4శాతం ఉండాలని మంగళవారం సచివాలయంలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ నేతృత్వంలో జరిగిన మంత్రివర్గ ఉపసంఘం భేటీలో కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈ భేటీలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పురపాలక మంత్రి పి. నారాయణ, దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, న్యాయశాఖ మంత్రి ఫరూఖ్ తదితరులు పాల్గొన్నారు. నాలా రద్దు ఆర్డినెన్స్ అమల్లోకి వచ్చాక ఇచ్చే నిబంధనల్లో(రూల్స్) డెవలప్‌మెంట్ చార్జీ 4శాతం ఉండాలన్న అంశాన్ని పొందుపరచనున్నారని సమాచారం. ఇది రిజిస్ట్రేషన్ ఫీజుతో సమానంగా ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనిపై క్యాబినెట్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

భూముల ఇంటిగ్రేషన్‌కు ఆమోదం

భూములు, వాటి రికార్డులు రెవెన్యూ, పంచాయతీరాజ్, పురపాలక శాఖ పరిధిలో ఉన్నాయి. నాలా చట్టం రద్దు చేస్తూ ఆర్డినెన్స్ తీసుకొస్తున్న నేపథ్యంలో అక్రమాలకు తావులేకుండా చూసేందుకు వీటిని ప్రత్యేకంగా ఇంట్రిగేషన్ చేయాలన్న ప్రతిపాదనకు ఉపసంఘం ఆమోదం తెలిపింది. రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్ భూములను వెబ్‌ల్యాండ్‌లో ఏకీకరణం చేసి సులువుగా గుర్తించేలా ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ శాఖను ఆదేశించింది. వెబ్‌ల్యాండ్‌లో సాగు భూములు, ప్రభుత్వ భూములు, సాగేతర అవసరాలకు మళ్లించిన భూములకు ప్రత్యేక ఖాతా నంబర్లు ఇవ్వాలని నిర్ణయించారు.

22(ఏ)నుంచి ప్రైవేటు భూముల తొలగింపు

మంత్రివర్గ ఉపసంఘం మరో కీలక నిర్ణయం తీసుకుంది. గత జగన్ ప్రభుత్వంలో రాజకీయ, ఇతర కారణాలతో ప్రైవేట్ వ్యక్తులు, సంస్థల భూములను కూడా నిషేధ జాబితా 22(ఏ)లో చేర్చారు. ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తామని గతేడాదే సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ అంశంపైనా ఉపసంఘం పరిశీలన చేసింది. రైతులు, విద్యాసంస్థలు, కాలేజీలు, ఇతర వ్యవస్థల ప్రైవేట్ భూములను గతంలో అసైన్డ్ భూములుగా చూపించి, నిషేధ జాబితాలో చేర్చినట్లు గుర్తించారు. ఇలాంటి భూములను వెంటనే 22(ఏ) నుంచి తొలగించాలని, వెబ్‌ల్యాండ్ రికార్డుల్లోనూ అవి ప్రైవేట్ భూములుగానే నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖను ఉపసంఘం ఆదేశించినట్లు సమాచారం.

సమయం పడుతుంది: మంత్రి అనగాని

నాలా రద్దు ముసాయిదా ఆర్డినెన్స్‌ను బుధవారం జరిగే మంత్రివర్గ సమావేశానికి సమర్పిస్తామని రెవెన్యూ మంత్రి అనగాని మీడియాకు తెలిపారు. అసైన్డ్ ఫ్రీహోల్డ్ భూములపై పూర్తిస్థాయిలో చర్చించి పరిష్కారం తీసుకొస్తామని చెప్పారు. అక్టోబరు నాటికి నిర్ణయం తీసుకోవాలని తొలుత భావించినా, ఇందులోని అనేక సంక్లిష్టతలకు పరిష్కారం చూపడానికి మరికొంత సమయం పట్టొచ్చని చెప్పారు. వచ్చే ఉపసంఘం భేటీలో ఇనాం, ఎస్టేట్ భూములపై చర్చిస్తామన్నారు.

రాత్రికి రాత్రే పరిష్కారం కాదు: మంత్రి పయ్యావుల

ఫ్రీహోల్డ్‌లో అనేక అక్రమాలు, ఉల్లంఘనలు తమ దృష్టికి వస్తున్నాయని, వాటిపై సమాలోచనలు జరుపుతున్నామని మంత్రి పయ్యావుల చెప్పారు. 'ఇది రాత్రికి రాత్రే పరిష్కరించే అంశం కాదు. వందల, వేల సంవత్సరాలుగా ఉన్న వివాదాలను చూడాలి" అని స్పష్టం చేశారు.

చేనేతకు చేయూత

- హ్యాండ్లూమ్ వస్త్రాలపై ప్రభుత్వమే జీఎస్టీ భరించాలని నిర్ణయం

అమరావతి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): చేనేత రంగానికి ఊతమిచ్చేలా.. నేతన్నలను ఆదుకునేందుకు రాష్ట్రప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. చేనేత వస్త్రాలపై జీఎస్టీని తానే భరించాలని నిశ్చయించింది. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో చేనేత శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఇటీవల జమ్మలమడుగులో తాను పర్యటించినప్పుడు ఓ చేనేత కుటుంబసభ్యులతో మాట్లాడిన సమయంలో తన దృష్టికి వచ్చిన అంశాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. మగ్గాలకు 200 యూనిట్ల వరకు, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్ల దాకా ఉచితంగా విద్యుత్ అందించాలని సమీక్షలో నిర్ణయించారు. సంబంధిత ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. చేనేత వస్త్రాలపై విధిస్తున్న జీఎస్టీని రాష్ట్ర ప్రభుత్వమే కేంద్రానికి చెల్లించాలనీ నిర్ణయించారు. దీంతో ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీని నెరవేర్చినట్లయింది. దీని వల్ల చేనేత రంగం పుంజుకుంటుందని, తక్కువ ధరల్లో చేనేత వస్త్రాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు సీఎంకు వివరించారు. చేనేత కార్మికుల కోసం రూ.5 కోట్లతో త్రిఫ్ట్ ఫండ్ ఏర్పాటు చేయాలని చంద్రబాబు సూచించారు. గురువారం (7వ తేదీన) జాతీయ చేనేత దినోత్సవం నుంచి ఈ నిర్ణయాలను అమలు చేయాలని ఆదేశించారు. కాగా.. రాష్ట్రానికి చెందిన చేనేత ఉత్పత్తులకు 10 జాతీయ అవార్డులు వచ్చాయి. 'వన్ డిస్ట్రిక్ట్-వన్ ప్రొడక్ట్' విభాగంలోనూ మొదటి అవార్డు దక్కించుకుంది. ఈ అవార్డులను అధికారులు తొలుత సీఎంకు చూపించారు.



చేనేత ఉత్పత్తులను పరిశీలిస్తున్న సీఎం



జస్టిస్ తుహిన్‌కుమార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న న్యాయవాదులు

హోమ్ వర్క్.. హార్డ్ వర్క్‌తో విజయం

- జూనియర్ న్యాయవాదులతో జస్టిస్ తుహిన్ కుమార్
- హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో సన్మానం

అమరావతి, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): కేసుకు సంబంధించి హోమ్ వర్క్, కొంతహార్డ్ వర్క్ చేస్తే విజయం మీ సొంతమవుతుందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తుహిన్ కుమార్ అన్నారు. 'ఎల్లప్పుడూ ఇది నేను చేయగలను, కేసులో విజయం సాధించగలను' అనే విశ్వాసం, భావనతో ఉండాలని జూనియర్ న్యాయవాదులకు సూచించారు. నిస్పృహకు గురికావద్దని చెప్పారు. ఏపీ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ తుహిన్‌కుమార్‌ను ఏపీ హైకోర్టు అడ్వొకేట్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.చిదంబరం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, అదనపు సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ, అడిషనల్ అడ్వొకేట్ జనరల్ సాంబశివ ప్రతాప్, రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ, అడ్వొకేట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కేవీ రఘువీర్, ప్రధాన కార్యదర్శి సి.సుబోధ్, కార్యవర్గ సభ్యులు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

నియోజకవర్గానికో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్

జగ్గయ్యపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో నియోజకవర్గానికి ఒక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తోందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ చెప్పారు. మంగళవారం ఆయన జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేటలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ, ప్రభుత్వాస్పత్రుల పటిష్ఠంతో పాటు వ్యక్తిగతంగా రూ. 25 లక్షల వరకు వైద్య సాయం అందించే ఆలోచన ఉందన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా రోజుకు 7వేల అడ్మిషన్లు వస్తున్నాయని, గత ప్రభుత్వ హయాంలో కంటే అదనంగా 2 వేల అడ్మిషన్లు పెరిగాయన్నారు. ఆరోగ్యశ్రీ ఆగిపోయిందంటూ వైసీపీ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. జగన్ ప్రభుత్వం ఔషధ సరఫరా సంస్థలకు రూ. వెయ్యి కోట్లు, ఆస్పత్రులకు రూ.2,500 కోట్లు బకాయి పెట్టిందని, వాటిని తమ ప్రభుత్వమే తీర్చిందని చెప్పారు. రాష్ట్రంలో ఆస్పత్రుల స్థాయిని బట్టి 105 నుంచి 712 రకాల మందులు అందుబాటులో ఉంచామన్నారు.

బలమైన ఆర్థిక పునరుజ్జీవనానికి వేదికగా ఏపీ: లోకేశ్

అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఏపీ చాలా బలమైన ఆర్థిక పునరుజ్జీవనానికి వేదిక అవుతోందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. 'ఈ ఏడాది జూలైలో ఏపీ రూ.3,803 కోట్ల జీఎస్టీ వసూళ్లతో 14% వృద్ధి నమోదు చేసింది. జీఎస్టీ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత రాష్ట్రం నమోదు చేసిన అత్యధిక వసూళ్లు ఇవే. ఈ వృద్ధి దక్షిణాది రాష్ట్రాల్లోనే అత్యధికం. పెద్ద రాష్ట్రాల జీఎస్టీ వసూళ్ల వృద్ధి శాతంలో రాష్ట్రం మూడో స్థానంలో ఉంది. ఏపీ ఈజ్ బ్యాక్.. మేము ఇప్పుడే మొదలవుతున్నాం' అంటూ లోకేశ్ ట్వీట్ చేశారు.

సీఎంను కలిసిన థాయ్ కాన్సులేట్ జనరల్

అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతో థాయ్ కాన్సులేట్ జనరల్ రచ ఎయిర్‌బార్గ్ భేటీ అయ్యారు. మంగళవారం అమరావతి సచివాలయంలో ఈ భేటీ జరిగింది. ఆగ్రో ఇండస్ట్రియల్, ఆహార ఉత్పత్తుల్లో అంతర్జాతీయంగా పేరొందిన సీపీఎఫ్ ఇండియా లిమిటెడ్ ప్రతినిధులు కూడా సీఎంను కలిశారు. ఏపీలో పెట్టుబడుల అవకాశాలపై సీఎంతో వీరు చర్చించారు.



ఎంత కష్టంలో ఉన్నా అక్షరాన్ని వదలం

పాడుపడిన పార్కు. ప్రహరీయే వాళ్లకు ఆసరా! పూరి పాకలోనే నివాసం! అక్కడే వారి జీవితం! అయినా... చదువును మరువలేదు. బతుకును మార్చే అక్షరాన్ని వదల్లేదు. ఈ పిల్లల పేర్లు వెంకట అశోక్, లక్ష్మి, బాలాజీ. ముగ్గురు పిల్లలు గాంధీ నగర్ మునిసిపల్ పాఠశాలలో చదువుకుంటున్నారు. ముగ్గురికీ ఇటీవల 'తల్లికి వందనం' కింద డబ్బులు జమ అయ్యాయి. వీరి తల్లి మన్నెం రమణమ్మ. నెల్లూరు ఇండస్ట్రియల్ ఏరియాలో వీరి జీవితం. చెక్కముక్కలతో బల్లలు, స్టూళ్లు, బొమ్మలు తయారు చేస్తూ... అక్కడే రోడ్డు మీద పెట్టి అమ్ముతూ ఉపాధి పొందుతున్నారు. ఇలా ఇక్కడ పదికిపైగా కుటుంబాలు పాకలు వేసుకుని జీవిస్తున్నాయి.

- నెల్లూరు, ఆంధ్రజ్యోతి





శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ఆధ్వర్యంలో ట్రాక్టర్ ర్యాలీ

'అన్నదాత'ల భారీ ర్యాలీ

అన్నదాత సుఖీభవ నిధులను ఖాతాల్లో వేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో మంగళవారం రైతులు వెయ్యి ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక మిట్టబండ ఆంజనేయస్వామి ఆలయం నుంచి వాల్మీకి సర్కిల్ వరకు ర్యాలీ జరిగింది. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు నాయకత్వంలో జరిగిన ఈ ర్యాలీలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, పార్టీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే రాజు విలేకరులతో మాట్లాడుతూ జగన్ పాలనలో రైతులకు మద్దతు ధర లేదని, రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తానని చెప్పి మోసగించారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం చంద్రబాబు పంటలకు మద్దతు ధర కల్పించారని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేరని విమర్శలు చేసిన వైసీపీ నేతలు కళ్లు తెరచి రైతులు, ప్రజల ఆనందాన్ని చూడాలన్నారు.

- మడకశిర టౌన్, ఆంధ్రజ్యోతి

అబద్ధాల రాతలతో అతుకుల బొంత!

(మొదటి పేజీ తరువాయి)

ఫామ్‌హౌస్‌లో ఈ డబ్బులు స్వాధీనం చేసుకున్నారు. మద్యం కేసులో ఏ1గా ఉన్న రాజ్ కసిరెడ్డి భార్య, వర్ధమాన్ ఇంజనీరింగ్ కాలేజీ యజమాని ఒక ఆస్పత్రిలో భాగస్వాములు. విజయేందర్ రెడ్డి, రాజ్ కసిరెడ్డి సన్నిహితులని సిట్ నిర్ధారించింది. అయితే... జగన్‌ను ఇరికించేందుకు చంద్రబాబే స్వయంగా తీగల విజయేందర్ రెడ్డి చేత ఫామ్‌హౌస్‌లో రూ.11 కోట్లు పెట్టించారని, ఆ సొమ్మునే 'సిట్' అధికారులు పట్టుకున్నారని రోత పత్రిక అబద్ధాల రాతలు రాసింది. తీగల విజయేందర్ రెడ్డి... టీడీపీ నేత తీగల కృష్ణారెడ్డికి తమ్ముడి కుమారుడు కాబట్టి... తీగల కృష్ణా రెడ్డి టీడీపీ నాయకుడు కాబట్టి... విజయేందర్ రెడ్డి ద్వారా రూ.11 కోట్లు ఫామ్‌హౌస్‌లో పెట్టించి, అవే డబ్బులు పట్టించారని అతుకుల బొంతను సృష్టించింది. కనీస ఔచిత్యం, పరిజ్ఞానంలేకుండా సొంత పాఠకుల చెవిలో పూలు పెట్టేందుకు ప్రయత్నించింది.

- ఎవరినో కేసులో ఇరికించేందుకు... ఇంకెవరి కోసమో ఏకంగా రూ.11 కోట్ల నగదును వదులుకునేందుకు ఎవరైనా సిద్ధపడతారా? తీగల విజయేందర్ రెడ్డికి ఎన్ని వందలకోట్లయినా ఉండొచ్చు! టీడీపీ నేతల కోసం రూ.11 కోట్లతోపాటు తన ప్రతిష్ఠనూ కోల్పోయేందుకు ఇష్టపడతారా?
- 'టీడీపీ నేత తీగల కృష్ణా రెడ్డి' అని రోత పత్రిక పెద్ద అక్షరాలతో రాసింది. తీగల ఒకప్పుడు టీడీపీ నేత. తెలంగాణ ఆవిర్భావం తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. తెలుగుదేశం పార్టీతో దాదాపు దశాబ్దకాలంగా ఆయనకు ఎలాంటి సంబంధాలూ లేవు! అయినా సరే... ఆయనను టీడీపీ నేతగా పేర్కొంది.
- పనిలోపనిగా... తీగల విజయేందర్ రెడ్డి ఒక ఆస్పత్రి ఫంక్షన్‌లో 'ఆంధ్రజ్యోతి' ఎండీ రాధాకృష్ణతో దిగిన ఫొటోను సంపాదించి.. 'ఆయనకూ దగ్గరేనండీ' అని రోత పత్రిక చిత్రాలు పోయింది. ఇక్కడ... రాధాకృష్ణ ఇంటికి తీగల విజయేందర్ రెడ్డి వెళ్లలేదు. ఆయన ఇంటికి ఈయన రాలేదు. మూడో వ్యక్తికి సంబంధించిన కార్యక్రమంలో యాదృచ్ఛికంగా కలిశారు.
- వెంకటేశ్ నాయుడు ఒక పవర్ బ్రోకర్. 'పనులు చేసిపెడతా' అంటాడు. ఆయా పార్టీల నేతలందరి దగ్గరికి వెళ్లి ఫొటోలు దిగుతారు. చివరికి... మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడుతో కూడా ఫొటో దిగారు. చెవిరెడ్డికి మాత్రం సన్నిహితుడు. ఆయన టాలెంట్ నచ్చి కాబోలు... ఎన్నికల సమయంలో నగదు బట్వాడా బాధ్యతను అప్పగించారు. అంతెందుకు... చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, వెంకటేశ్ నాయుడు కలిసి శ్రీలంకకు వెళ్తుండగా బెంగళూరు విమానాశ్రయంలో 'సిట్' అధికారులు ఒకేసారి అరెస్టు చేశారు. ఆరోజున.. 'చెవిరెడ్డిని, ఆయన స్నేహితుడు వెంకటేశ్ నాయుడిని అరెస్టు చేశారు' అని జగన్ రోత పత్రికే పేర్కొంది. ఇప్పుడు... వెంకటేశ్ నాయుడు వేర్వేరు సందర్భాల్లో ఇతర పార్టీల నేతలతో దిగిన ఫొటోలను చూపిస్తూ 'మీ వాడే' అని బురద చల్లుతోంది. అసలు విషయం ఏమిటంటే... అతనికి జగన్‌తోకానీ, ముడుపుల వ్యవహారంతో కానీ సంబంధం లేదని సూటిగా, స్పష్టంగా ఒక్కమాటా చెప్పలేక పోతోంది.



PART – B

(11) ABSTRACT OF THE DETAILS GIVEN IN (1) TO (10) OF PART-A

1	Name of the Candidate		Sh./Smt./Kum. Cherukuru Venkatesh Naidu	
2	Full Postal address		D.No.25-684, Padmavathinagar, Plot No.180, Raithu Bazaar, Nandya, Kurnool, Andhra Pradesh-518501	
3	Number and name of the constituency and State		16-Ongole Parliamentary Constituency, Andhra Pradesh.	
4	Name of the Political party which set up the candidate (otherwise write 'Independent')		Independent.	
5	Total number of pending criminal cases		Nil	
6	Total number of cases in which Convicted		Nil	
7		PAN of	Year for which last income tax return filed	Total income shown
	(a) Candidate	ANSPN1825D	2022-23	Rs.4,95,000
	(b) Spouse	Nil	Nil	Nil
	(c) HUF	Nil	Nil	Nil
	(d) Dependents	Nil	Nil	Nil

12

ఇది ఎవరి కోసం?

ఇది గత ఎన్నికల్లో ఒంగోలు లోక్‌సభ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసినప్పుడు వెంకటేశ్ నాయుడు సమర్పించిన అఫిడవిట్! ఎక్కడో నంద్యాలకు చెందిన వ్యక్తి... ఒంగోలులో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయడమేమిటి? ఈ ప్రశ్నకు సమాధానం ఊహించలేనిదేం కాదు! అక్కడ వైసీపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పోటీలో నిలబడ్డారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు వివిధ రకాల వెసులుబాట్ల కోసం తమ సన్నిహితులను డమ్మీ అభ్యర్థులుగా నిలబెట్టడం సహజం. చెవిరెడ్డికి వెంకటేశ్ నాయుడు సన్నిహితుడనేది నిర్వివాదాంశం. జగన్ రోత పత్రికే పలుమార్లు ఈ విషయాన్ని స్పష్టం చేసింది. ఈ అఫిడవిట్‌లో వెంకటేశ్‌నాయుడు తన వార్షిక ఆదాయం కేవలం రూ.4.95 లక్షలుగా చూపించడం గమనార్హం.

బోత్ ఆర్ నాట్ సేమ్



'ఆంధ్రజ్యోతి' మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ పక్కనే నిలబడి తీగల విజయేందర్ రెడ్డి ఫొటో దిగారు కాబట్టి... ఆయనకు 'బాగా దగ్గరేనండీ' అంటూ జగన్ రోత పత్రిక వయ్యారాలు పోయింది. హైదరాబాద్‌లో ఒక ఆస్పత్రి ఫంక్షన్‌కు వెళ్లిన సందర్భంగా దిగిన ఫొటో ఇది. సదరు వైద్యుడి ఆహ్వానం మేరకు రాధాకృష్ణ అక్కడికి వెళ్లారు. అదే వైద్యుడు ఆహ్వానించిన చాలామందిలో తీగల విజయేందర్ రెడ్డి కూడా ఉన్నారు. అక్కడ రాధాకృష్ణతో ఫొటో దిగారు. దీనిని పట్టుకుని రోత పత్రిక మోకాలికీ బోడిగుండుకూ ముడిపెట్టేందుకు నానా తంటాలు పడింది.



మద్యం స్కామ్ కేసు నిందితుడు, గుట్టలుగా నోట్ల కట్టల వీడియోతో దొరికిపోయిన వెంకటేశ్ నాయుడితో అప్పుడు ముఖ్యమంత్రి 'షిక్కటి' చిరునవ్వులు చిందిస్తూ దిగిన ఫొటో ఇది. స్థలం... తాడేపల్లి ప్యాలెస్. సందర్భం... జగన్ నివాసంలో ఉగాది వేడుకలు! అత్యంత పరిమితంగా, బాగా దగ్గరి వారికి మాత్రమే అక్కడికి ఆహ్వానం లభించింది. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో కలిసి వెంకటేశ్ నాయుడితో జగన్ ఈ ఫొటో దిగారు. ఇలా ఒక్కసారి కాదు... పలు సందర్భాల్లో ఆయన జగన్‌ను కలిసిన చిత్రాలు ఉన్నాయి. ఎవరో మూడో వ్యక్తి ఆహ్వానం మేరకు వెళ్లిన చోట దిగిన ఫొటో వేరు, ఇక్కడ జగన్‌తో వెంకటేశ్ నాయుడు జగన్ దిగిన ఫొటో వేరు! బోత్ ఆర్ నాట్ సేమ్!

అదే కుట్ర.. అదే కుతంత్రం!

- వివేకా హత్య తరహాలో.. మద్యం స్కాంపైనా తప్పుడు ప్రచారం
- నాడు వివేకా.. నేడు వెంకటేశ్‌నాయుడు
- పట్టాభి ధ్వజం



అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): సొంత బాబాయి వివేకానందరెడ్డిని గొడ్డలి వేటుతో హత్య చేసి ఎలా బుకాయించి నిందను చంద్రబాబు మీద వేశారో.. లిక్కర్ స్కాంలోనూ జగన్ అదే పంథా అనుసరిస్తున్నారని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి విమర్శించారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మాట్లాడారు. నాడు వివేకా హత్య కేసులో ఏం జరిగింది.. నేడు మద్యం స్కాం నిందితుడైన వెంకటేశ్ నాయుడి విషయంలో ఏం జరుగుతోందనే అంశాలను వీడియో ద్వారా పట్టాభి వివరించారు. 'మద్యం కుంభకోణంలో పక్కా ఆధారాలతో నిందితులను సిట్ పట్టుకుంటుంటే.. ఎక్కడ జైలుకు వెళ్లాల్సి వస్తుందోనని భయపడుతున్న జగన్.. వెంకటేశ్ చంద్రబాబు మనిషి అంటూ బుకాయిస్తున్నారు. వివేకా హత్య నాటి కుట్ర, కుతంత్రాలను లిక్కర్ స్కాంలోనూ అమలు చేస్తున్నారు. వివేకా హత్య కేసులో రోజుకో అబద్ధం చెప్పి ఎలాగైతే ప్రజల్ని తప్పుదారి పట్టించారో, చంద్రబాబుపై నింద వేశారో.. మద్యం స్కాంలోనూ అదే దారిలో వెళ్తున్నారు. సిట్ దాఖలు చేసిన చార్జిషీటులో గోవిందప్ప బాలాజీ, విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, సైమన్‌ను వెంకటేశ్‌నాయుడు కలిసినట్లు అన్ని సాంకేతిక ఆధారాలూ చూపింది. ఎవరెవరిని ఏ సమయంలో, ఏ ప్రదేశంలో కలిశాడో కూడా పూర్తి ఆధారాలను అందులో పొందుపరచింది. అతడికి, వైసీపీకి సంబంధం లేకుంటే ఆ నేతలను కలవాల్సిన అవసరం ఏముంది? చెవిరెడ్డికి వెంకటేశ్ సన్నిహితుడని తొలుత ఒప్పుకొన్న జగన్ మీడియా.. అడ్డంగా దొరికాక అతడు టీడీపీ మనిషి అంటూ అసత్యాలు ప్రచారం చేస్తోంది. చేతిలో అవినీతి పత్రిక ఉందని ఏది పడితే అది రాస్తే నిజం అబద్ధం అయిపోతుందా? ఒక్క వైసీపీ నేతైనా చేతిలో చార్జిషీటు పట్టుకుని అందులో ఉన్నవి అబద్ధాలని నిరూపించగలరా? ఆ అంశాలు నిజం కాదని ఆ పార్టీ నేతలెవరైనా చర్చకు రాగలరా' అని పట్టాభి సవాల్ విసిరారు.

మళ్లీ జగన్ బెదిరింపులు

- తానొస్తే అధికారులపై చర్యలుంటాయని హెచ్చరిక
- వైసీపీ లీగల్ సెల్ న్యాయవాదులతో భేటీ
- యథావిధిగా అమరావతిపై అవినీతి ఆరోపణలు
- కష్టపెట్టే అధికారుల పేర్లను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని లాయర్లకు సూచన

అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మరోసారి అధికారులను బెదిరించారు. వైసీపీ నేతలను జైళ్లలో పెడుతున్నారని.. తమ పార్టీవారిని ఇబ్బందిపెట్టే అధికారులపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం తాడేపల్లి ప్యాలెస్‌లో వైసీపీ లీగల్ సెల్‌కు చెందిన ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల న్యాయవాదులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజధాని అమరావతి నిర్మాణంలో అవినీతి జరుగుతోందని యథావిధిగా ఆరోపించారు. మద్యం విక్రయాలు, మట్టి తవ్వకాల్లో అక్రమాల దందా జరిగిపోతోందన్నారు. మట్టి తవ్వాలన్నా.. మద్యం అమ్మాలన్నా పోలీసుల సమక్షంలో అవినీతి దందా, సెటిల్‌మెంట్లు జరుగుతున్నాయని ఆరోపించారు. అమరావతి నిర్మాణ పనుల్లో మొబిలైజేషన్ అడ్వాన్సులు నడుస్తున్నాయని.. పది శాతం అడ్వాన్సుల్లో ఎనిమిది శాతం స్థానిక ఎమ్మెల్యేలకు, నేతలకు ఇస్తున్నారని ఆరోపించారు. మట్టి తవ్వాలన్నా, పరిశ్రమలు పెట్టాలన్నా అధికారపక్షం వాళ్లకు డబ్బులు ఇవ్వాల్సిందేనన్నారు. రాష్ట్రంలో కలియుగ రాజకీయం నడుస్తోందని.. తప్పుడు కేసులతో వైసీపీ నేతలను జైల్లో పెట్టి పరువు తీస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. పార్టీ న్యాయవాదుల డేటాను నిక్షిప్తం చేస్తున్నామని, మళ్లీ అధికారంలోకి వచ్చాక వారికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. త్వరలోనే పార్టీ యాప్‌ను ప్రారంభిస్తానన్నారు. కూటమి వల్ల ఇబ్బందులు పడిన వారందరూ.. ఏయే అధికారులు తమను కష్టాలకు గురిచేశారో వారి పేర్లను అందులో అప్‌లోడ్ చేయాలని సూచించారు. వైసీపీ 2.0 వచ్చాక వారిపై చర్యలు ఉంటాయన్నారు.

రాజమండ్రి జైలులో వైసీపీ రాజ్యాంగం!

- వైసీపీ ఎంపీ మిథున్ కోరినట్టే సౌకర్యాలు.. జైలు అధికారుల రాచమర్యాదలు



సెంట్రల్ జైలు గేటు ఎదుట వైసీపీ నేతల గుంపు

రాజమహేంద్రవరం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు లోపల, వెలుపల వైసీపీ రాజ్యాంగం నడుస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాడు చంద్రబాబు జైలులో ఉన్న సమయంలో ములాఖత్‌లకే ముప్పుతిప్పలు పెట్టారు. జైలు పరిసరాల్లోకి టీడీపీ నేతలను అనుమతించనేలేదు. మరిప్పుడో.. మద్యం స్కాంలో జైల్లో ఉన్న ఏ-4, వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డికి సెంట్రల్ జైలు అధికారులు రాచమర్యాదలు చేస్తున్నారు. అడిగింది లేదనకుండా.. కోరింది కాదనకుండా సెల్యూట్ చేసి మరీ సౌకర్యాలు కల్పిస్తున్నారు. రిమాండ్‌లో ఉన్న నిందితుడికి రోజుకు ఒకసారి ములాఖత్ అంటేనే కష్టం. కానీ మిథున్‌రెడ్డి 2 సార్లు తీసుకుంటున్నారు. అంతేకాదు.. సెంట్రల్ జైలు ప్రధాన గేటు ఎదుట వైసీపీ నాయకులు, శ్రేణులు గుంపులు గుంపులుగా గుమిగూడి.. హంగామా చేస్తు న్నా కనీస చర్యలు లేవు. మిథున్‌రెడ్డిని మంగళవారం ఆయన తండ్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ములాఖత్‌లో కలిశారు. ఆయన వెంట ఎమ్మెల్సీ తలశిల రఘురాం, మాజీ ఎమ్మెల్యే జక్కం పూడి రాజా ఉన్నారు. సాధారణంగా ములాఖత్‌కు ముగ్గురికే అనుమతి ఉంది. ప్రధాన గేటు గుండా పెద్దిరెడ్డి, తలశిల, రాజా కలిసి సెంట్రల్ జైలు ఆవరణ నుంచి జైలు గుమ్మం వరకూ వెళ్లారు. వారిని నల్లకోటు లేని న్యాయవాది హుస్సేన్ కూడా అనుసరించారు. ఆయన్ను పోలీసులు గానీ, సెంట్రల్ జైలు అధికారులు గానీ ఆపలేదు. తర్వాత పెద్దిరెడ్డి, తలశిల కలిసి ముందుగా మిథున్‌రెడ్డితో ములాఖత్ అయ్యారు. జక్కంపూడి రాజాను తీసుకువెళ్లలేదు. వారు వచ్చేసిన తర్వాత రాజా ప్రత్యేకంగా మిథున్‌రెడ్డితో ములాఖత్ అయ్యారు. ఆయనతో హుస్సేన్ కూడా వెళ్లారు. వారు వచ్చేవరకూ పెద్దిరెడ్డి, తలశిల జైలు ప్రధాన ద్వారం వద్దే నిలబడి ఉన్నారు. మిథున్‌రెడ్డికి రోజుకు ఒకే ములాఖత్‌కు అనుమతి ఉండగా.. జైలు అధికారులు రెండింటికి ఎలా అనుమతించారు? వాస్తవానికి ములాఖత్‌కు వెళ్లడానికి ముగ్గురికి అనుమతి ఉంది. కానీ ఎందుకో పెద్దిరెడ్డి తన వెంట తలశిలను మాత్రమే తీసుకెళ్లి.. జక్కంపూడి రాజాను బయటే ఉంచారు. అనంతరం పెద్దిరెడ్డి మీడియాతో మాట్లాడకుండా మౌనంగా ఉండిపోగా.. జక్కంపూడి రాజా, చిర్ల జగ్గిరెడ్డి, మాజీ ఎంపీ వంగా గీత విలేకరులతో మాట్లాడారు. సెంట్రల్ జైలు వెలుపల ప్రధాన రోడ్డు మీద మాజీ మంత్రులు చెల్లుబోయిన వేణు, విశ్వరూప్, జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, పార్టీ నేతలు మార్గాని నాగేశ్వరరావు, మేడపాటి షర్మిలారెడ్డి తదితరులు ఉన్నారు.

Printed and Published by ***Koganti Venkata Seshagiri Rao*** *on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107,* ***Editor : N.Rahul Kumar,*** *RNI No:3470/1960,* ***Managing Director : Vemuri Radha Krishna, Founder :*** *K.L.N. Prasad.*